thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 38 | కరీంనగర్ శనివారం, 19 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 21, 22వ తేదీల్లో అమెరికాలో రాహుల్ పర్యటన

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈనెల 21, 22 తేదీల్లో అమెరికాలో పర్యటిస్తారని ఆ పార్టీ నేత పవన్ ఖేరా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బ్రౌన్ యూనివర్సిటీలో అధ్యాపకులు, విద్యార్థులతో జరిగే ముఖాముఖిలో పాల్గొంటారని తెలిపారు. అంతకుముందు ప్రవాస భారతీయులు, ప్రవాస భారత కాంగ్రెస్ సభ్యులతో సమావేశమవుతారన్నారు. 2024లోనూ రాహుల్ తన అమెరికా పర్యటనలో టెక్సాస్ యూనివర్సిటీ, జార్జిటౌన్ వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశమయ్యారు.

## జపాన్‌లో బిజీ బిజీ..



హైదరాబాద్, ఏప్రిల్ 18: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్‌లో రెండో రోజు పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. శుకవారం జపాన్ రాజధాని టోక్యోలోని హొటల్ ఇంపీరియల్‌లో జరిగిన ఇండియా–జపాన్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ రోడ్ షోలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ రోడ్ షోకు జపాన్‌లోని వివిధ రంగాలకు చెందిన దాదాపు 150 మందికిపైగా పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చెందాలంటూ ఈ సందర్భంగా జపాన్ పారిశ్రామిక,వ్యాపారవేత్తలను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఆ క్రమంలో ఈ రోజు తెలంగాణ జపాన్‌లో ఉదయిస్తోందని రైజింగ్ బృందం తెలిపింది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు,నైపుణ్యంతో కూడిన ప్రతిభ,స్థిరమైన విధానాలను ప్రజా ప్రభుత్వం అందిస్తుందని వారికి సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మరోవైపు జపాన్‌తో తెలంగాణ ప్రభుత్వం మరో ఒప్పందం కుదుర్చుకొంది. రుద్రారంలో తోషిబా కొత్త ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ సానుకూలంగా స్పందించింది. అందుకోసం రూ.562 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకొంది. టోక్యోలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఈ అవగాహన ఒప్పందంపై తోషిబా, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు సంతకాలు చేశారు. తెలంగాణ పారిశ్రామిక విధానాలు తమను ఆకట్టుకున్నాయని హిరోషి ఫురుటా స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు అనుకూల గమ్యంగా ఎదుగుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణలో టీటీడీఐ సర్జ్ అరెస్టర్స్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుంది. దీని ద్వారా పవర్,డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్ సామర్థ్యం విస్తరించనుంది. జీఐఎస్ తయారీ కోసం ఫ్యాక్టరీలను టీటీడీఐ అప్‌గ్రేడ్ చేస్తోంది. ఆ క్రమంలో

## రుద్రారంకు ఇంటర్నేషనల్ కంపెనీ



ఈ మూడో ఫ్యాక్టరీ ఏర్పాటు ద్వారా రుద్రారంలో పరిశ్రమలు మరింత విస్తరించనున్నాయి. ఇదే పర్యటనలో మరో భారీ పెట్టుబడి ఒప్పందాన్ని తెలంగాణ ప్రభుత్వం కుదుర్చుకొంది. ఎన్‌టీటీ డేటా– నెయిసా సంస్థ తెలంగాణలో రూ.10,500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. టోక్యోలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో అవగాహన ఒప్పందం కుదర్చుకొంది. దీంతో 400 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు కానుంది.

25,000 సీపీయూలతో శక్తివంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ తయారు చేయనుంది. లిక్విడ్ ఇమ్మర్షన్ టెక్నాలజీతో క్లస్టర్ నిర్మాణం చేపట్టనుంది. తెలంగాణలోని విద్యా సంస్థలతో భాగస్వామ్యానికి రూపకల్పన చేయనున్నారు. దేశంలోనే అతిపెద్ద ఏఐ మౌలిక సదుపాయం ఇదే కావడం గమనార్హం. తెలంగాణను ఏఐ రాజధానిగా తీర్చిదిద్దే ప్రాజెక్ట్ ఇదే అవనుంది. ఏడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ,కంట్రోల్‌ఎస్ తర్వాత మరో మెగా ప్రాజెక్ట్ ఇదే కానుంది.



## హైదరాబాద్ అతలాకుతలం.. అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం సూచన

హైదరాబాద్: అకాల వర్షంతో హైదరాబాద్ మహానగరం అతలాకుతలమైంది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సహాయకచర్యల్లో తీవ్ర జాప్యం నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సహాయక చర్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీ అధికారులను అప్రమత్తం చేశారు. కూలిన చెట్లను వెంటనే తొలగించాలని డీఆర్ఎఫ్ సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

మరోసారి భారీ వర్షం పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రోడ్లపై నీరు నిలిస్తే వెంటనే తొలగించాలని పొన్నం సూచించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోరారు. బండ్లగూడలో 8 సెం.మీ వర్షపాతం నమోదైంది. బహదూర్‌పురలో 7.8 సెం.మీ , చార్మినార్‌లో 7.6 సెం.మీ, నాంపల్లిలో 6.9 సెం.మీ, అంబర్‌పేటలో 5 సెం.మీ, ఖైరతాబాద్‌లో 4.4 సెం.మీ, కుత్బుల్లాపూర్‌లో 4.3 సెం.మీ ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.




## బీఆర్ఎస్‌కు భారీ షాకిచ్చేలా...

# రేవంత్ భారీ స్కెచ్!

## కేసీఆర్ సభ కంటే ముందే.. 5 ఎమ్మెల్యేలు జంప్?

హైదరాబాద్ : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు... చేసే ప్రతి పనికి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డువస్తుంది. ఏప్రిల్ 27వ తేదీన.... వరంగల్లోని ఎల్కతుర్తి ప్రాంతంలో... భారీ బహిరంగ సభ నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. గులాబీ పార్టీ స్థాపించి సిల్వర్ జూబ్లీ అవుతున్న నేపథ్యంలో... 10 లక్షల మందితో భారీ బహిరంగ సభకు కేసీఆర్ ప్లాన్ చేశారు. ఇక ఈ సభ నుంచే జనాల్లోకి కేసీఆర్... వెళ్లబోతున్నట్లు కూడా ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగున ప్రశ్నించేందుకు.. సభను ప్లాట్ఫార్మ్ గా చేసుకొని రంగంలోకి దిగబోతున్నారు గులాబీ బాస్ కల్వకుంట్ల చంద్రశేఖర రావు. దీనికోసం 27వ తేదీన భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయబోతున్నారు గులాబీ నేతలు. ఇప్పటికే ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు అన్ని పూర్తయ్యాయి. ఇలాంటి నేపథ్యంలో కెసిఆర్ కు ఊహించని షాక్ ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యూహరచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కెసిఆర్ సభ కంటే ముందే... గులాబీ పార్టీని దెబ్బ కొట్టాలని అనుకుంటున్నారట. ఈ సభ జరగక ముందే ఐదుగురు ఎమ్మెల్యేలతో... రేవంత్ రెడ్డి స్కెచ్ వేసినట్లు చెబుతున్నారు. గులాబీ పార్టీకి సంబంధించిన ఐదుగురు ఎమ్మెల్యేలను... కాంగ్రెస్ లో చేర్చుకునేందుకు రంగం సిద్ధం చేశారట సీఎం రేవంత్ రెడ్డి. ఆ దిశగా సీఎం రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నట్లు చెబుతున్నారు.

ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో చేరిన పదిమంది ఎమ్మెల్యేల పరిస్థితి అత్యంత దారుణంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సమస్యల నేపథ్యంలో గులాబీ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు ఎవరు పోతారు అనేదానిపైనా చర్చ జరుగుతుంది. అంత సాహసం ఎవరు చేయబోరని కూడా చెబుతున్నారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీలో చేరితే రాజకీయ భవిష్యత్తు నాశనం అవుతుందని కూడా అంచన వేస్తున్నారు ఎమ్మెల్యేలు. కాబట్టి మూడు సంవత్సరాలు సైలెంట్ గా కూర్చుండటమే మేలు... అని అనుకుంటున్నారట గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు. మరి ఈ విషయంలో రేవంత్ రెడ్డి ఎలా ముందుకు వెళ్తారో చూడాలి.

## కమలనాధుని ఎంపికకు...

# మొదలైన కసరత్తు...!

## ఈ నెలలోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడి ప్రకటన..!!



బీజేపీ జాతీయ అధ్యక్షుడి ప్రకటన గత కొన్నేళ్లుగా ఆలస్యమవుతూ వస్తోంది. ఇదిగో.. అదిగో అంటూ ప్రకటనలకే పరిమితమైంది. మరోవైపు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి ప్రకటన కూడా ఆలస్యమవుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 20 తర్వాత భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడి ప్రకటన ఉండబోతున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఈ నెలాఖరులోకా మిగిలిన 6 రాష్ట్రాల అధ్యక్షులతో పాటు జాతీయ అధ్యక్షుడి ఎన్నికను పూర్తి చేయనుంది. ముందుగా పెండింగ్ లో ఉన్న 6 రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించనున్నారు. ఆ తర్వాత అందరు కలిసి జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. ఈ నేపథ్యంలో నిన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నివాసంలో కీలక సమావేశం జరిగింది. ఈ భేటిలో పార్టీ అగ్రనేతలైన అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జగత్ ప్రకాష్ నడ్డా తో పలువురు నేతలు భేటి అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్నాటక, పుదుచ్చేరి అధ్యక్షులను ప్రకటించనున్నారు. అయితే.. ఇప్పటి వరకు బీజేపీ జాతీయ అధ్యక్షులుగా ఒక్క మహిళ కూడా పనిచేయలేదు. ఈ నేపథ్యంలో ఈ సారి మహిళను జాతీయ అధ్యక్షురాలిగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రాజస్థాన మాజీ సీఎం వసుంధరా రాజేతో పాటు స్మృతి ఇరానీ, పురంధేశ్వరి పేర్లు జాతీయ అధ్యక్షురాలి రేసులో వినిపిస్తున్నాయి. ఒక వేళ దక్షిణాది, మహిళ కోటాలో పురంధేశ్వరికి ఇస్తారా అనేది చూడాలి. లేకపోతే.. అన్నామలై, కిషన్ రెడ్డితో పాటు భూపేంద్ర యాదవ్, అనురాగ్ ఠాకూర్ పేర్లు కూడా రేసులో వినిపిస్తున్నాయి. వీళ్లు కాకుండా మరెవరికైనా జాతీయ అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తారా అనేది చూడాలి. ఇక తెలంగాణ నూతన అధ్యక్షుడి ఈటల రాజేందర్ పేరు దాదాపు ఖరారైనట్టు సమాచారం. మరోవైపు డీకే పేరు కూడా వినిపిస్తోంది. వీళ్లిద్దరు కాకపోతే.. ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు పేర్లను కూడా పరిశీలిస్తున్నట్టు సమాచారం. గత కొన్నేళ్లుగా బీజేపీ అధ్యక్షులుగా, ముఖ్యమంత్రులుగా ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ లేని వాళ్లను ఎన్నిక చేస్తూ వస్తోంది. ఈ రకంగా ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ లేకుండా.. ముందు నుంచి పార్టీలో లేని వాళ్లకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. రీసెంట్ గా కేరళలో కూడా ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ లేని రాజీవ్ చంద్రశేఖర్ ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది. గతంలో అస్సాం కాంగ్రెస్ నేతగా ఉన్న హిమంత్ బిశ్వ శర్మను ఏకంగా సీఎం పీఠంపై కూర్చొబెట్టింది. అటు కర్ణాటకలో కూడా వేరే పార్టీ నుంచి వచ్చిన బసవరాజ బొమ్మైను సీఎంను చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఆర్ఎస్ఎస్ నేపథ్యంలేని నేతను బీజేపీ అధ్యక్షుడిగా నియమించవచ్చని చెబుతున్నారు.



# హైదరాబాద్‌లో భారీ ఏఐ డేటా సెంటర్ క్లస్టర్

## హైదరాబాద్ అభివృద్ధికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నా: సీఎం రేవంత్‌రెడ్డి

టోక్యో: జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టోక్యోలో నిర్వహించిన ఇండియా-జపాన్ భాగస్వామ్య రోడ్‌షోలో పాల్గొన్నారు.

జపాన్‌లోని పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర బృందం సమావేశమైంది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని జపాన్ పారిశ్రామికవేత్తలను సీఎం ఆహ్వానించారు. వివిధ రంగాల్లో పెట్టుబడులకు అనుకూలతలను వివరించారు. లైఫ్ సైన్సెస్, జీసీసీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈవీ, టెక్స్‌టైల్స్, ఏఐ డేటా సెంటర్లు, లాజిస్టిక్స్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం ప్రచార వీడియోలను రేవంత్ బృందం ప్రదర్శించింది.

హైదరాబాద్ అభివృద్ధికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నానని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. భారత్, జపాన్ కలిసి ప్రపంచానికి అద్భుతమైన భవిష్యత్ నిర్మిద్దామని పిలుపునిచ్చారు.



# రష్యాకు ఆయుధాలు.. జెలెన్‌స్కీ ఆరోపణలు అవాస్తవం

రష్యాకు చైనా ఆయుధాలు, మందుగుండు సామగ్రి సమకూరుస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపణలు చేశారు. వీటిని చైనా తోసిపుచ్చింది. యుద్ధం ముగియాలని తాము బలంగా కోరుకుంటున్నామని, త్వరగా శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు చైనా విదేశాంగశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఉక్రెయిన్‌పై గత మూడేళ్లుగా యుద్ధం జరుగుతున్న వేళ రష్యాతో చైనా ఆర్థికంగా బలమైన సంబంధాలు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఓ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ చైనాపై తీవ్ర ఆరోపణలు చేశారు. మాస్కోకు ఆయుధాలు, మందుగుండు సామగ్రిని చైనా సమకూరుస్తోందని నేరుగా ఆరోపించారు. అదే సమయంలో రష్యా భూభాగంలో ఆయుధాలు కూడా తయారు చేస్తోందన్నారు. ఇలా బీజింగ్‌పై జెలెన్‌స్కీ బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం ఇదే తొలిసారి. దీనిపై చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ స్పందిస్తూ.. ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై చైనా వైఖరి స్పష్టంగా ఉందన్నారు. నిరాధార, రాజకీయ ఉద్దేశాలను వ్యతిరేకిస్తున్నామని, రష్యా దిగుమతి చేసుకుంటున్న ఆయుధాల్లో ఎక్కువగా అమెరికా, పాశ్చాత్య దేశాలవేనని ఉక్రెయిన్‌బహిరంగంగా చెప్పిందన్నారు. తాము ఎవరికీ మారణాయుధాలను సరఫరా చేయలేదన్నారు. యుద్ధం ముగియాలని కోరుకుంటున్నామని, కాల్పుల విరమణను ప్రోత్సహించడంతోపాటు శాంతి చర్చలకు సహకారం అందించేందుకు చైనా కట్టుబడి ఉందన్నారు.



# యువతిపై అత్యాచారయత్నం.. అవాస్తవం

హైదరాబాద్: సికింద్రాబాద్ ఎంఎంటీఎస్ రైల్లో యువతిపై అత్యాచారయత్నం కేసు కీలక మలుపు తిరిగింది. విచారణలో పోలీసులను యువతి తప్పుదోవ పట్టించిందని రైల్వే ఎస్పీ చందనా దీప్తి వెల్లడించారు. సెల్‌ఫోన్‌తో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడినట్లు ఆమె తెలిపారు.

పోలీసులకు కట్టుకథ చెప్పి తనపై అత్యాచారం జరిగినట్లు ఆ యువతి పోలీసులను నమ్మించినట్లు నిర్ధరించారు. దర్యాప్తులో భాగంగా సుమారు 300కుపైగా సీసీ కెమెరాలను రైల్వే పోలీసులు పరిశీలించారు. దాదాపు 120 మంది అనుమానితులను ప్రశ్నించారు. ఆ తర్వాత యువతిపై అత్యాచారం జరగలేదని రైల్వే పోలీసులు తేల్చారు. న్యాయసంబంధమైన అంశాలను పరిశీలించి కేసును మూసివేసే యోచనలో రైల్వే పోలీసులు ఉన్నారు. మేడ్చల్ జిల్లాలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్న అనంతపురం జిల్లాకు చెందిన యువతిపై ఓ యువకుడు ఎంఎంటీఎస్ రైలు బోగీలో అత్యాచారానికి పాల్పడినట్లు వచ్చిన వార్తలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. కొంపల్లి సమీప ప్రాంతంలోని రైలు బ్రిడ్జి వద్ద కిందపడి గాయపడిన ఆమెను తొలుత గాంధీ ఆసుపత్రికి, ఆ తర్వాత ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకున్నట్లు సమాచారం.



# కంచ గచ్చిబౌలి భూములపై వెంటనే విచారణ చేపట్టాలి

హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీకి భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కీలక విజ్ఞప్తి చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రధానిగా పర్యావరణంపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయమిదన్నారు. ఈ మేరకు 'ఎక్స్' ద్వారా ప్రధానిని ఆయన కోరారు. "కంచ గచ్చిబౌలి భూముల ఆర్థిక అక్రమాలపై విచారణ చేపట్టాలి. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలి. దీనిపై ప్రధాని వ్యాఖ్యలకే పరిమితం కాకుండా చర్యలు తీసుకోవాలి. కంచ గచ్చిబౌలి అంశం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.10వేల కోట్ల ఆర్థిక మోసం. దీనిపై ఇప్పటికే దర్యాప్తు సంస్థలకు ఆధారాలతో సహా తెలిపాం.

ఆర్థిక అవకతవకల అంశాన్ని కేంద్ర సాధికార కమిటీ నిర్ధరించింది. స్వతంత్ర విచారణ చేయాలని సూచించింది. దీనిపై వెంటనే కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలి" అని కేటీఆర్ కోరారు.

# రజాకార్ల గురించి ఇంకెన్నాళ్లు మాట్లాడతారు?: మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్: భాజపా నేతలు ఇంకెన్నాళ్లు రజాకార్ల గురించి మాట్లాడతారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మండిపడ్డారు. వాళ్లు మతం గురించి తప్ప.. అభివృద్ధి గురించి ఎప్పుడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ భాజపా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

"భాజపా పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఇస్తున్నారా? కులం, మతం పేరుతో రాజకీయాలు తప్ప.. భాజపాకి అభివృద్ధి పట్టదు. మతం పేరుతో చేసే రాజకీయాలకు కాలం చెల్లింది. మూసీ పునరుజ్జీవం విషయంలో భాజపాకి స్పష్టత లేదు. భాజపా నేతలకు రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలనే సోయి లేదు. మెట్రో విస్తీర్ణంలో హైదరాబాద్ రెండో స్థానం నుంచి తొమ్మిదో స్థానానికి పడిపోయింది. మెట్రో రెండో దశకు కేంద్రం అనుమతి, నిధులు తీసుకురావాలనే ఆలోచన లేదు"అని మహేశ్‌గౌడ్ విమర్శించారు.

# ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన 22 మంది మావోయిస్టులు



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శుక్రవారం 22 మంది మావోయిస్టులు భద్రతా దళాల ముందు లొంగిపోయారు. వారిలో 12 మందిపై రూ.40 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. అమానవీయ మావోయిస్టు భావజాలం, స్థానిక గిరిజనులపై జరిగిన దురాగతాలతో నిరాశ చెందామని పేర్కొంటూ తొమ్మిది మంది మహిళలు సహా 13 మంది మావోయిస్టులు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్సెస్ (సీఆర్‌పీఎఫ్) సీనియర్ అధికారుల ముందు లొంగిపోయారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. వీరంతా పలు హింసాత్మక, విధ్వంసకర సంఘటనల్లో పాల్గొన్నారని పోలీసులు చెప్పారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు మిలిటరీ డిప్యూటీ కమాండర్ ముచాకి జోగా, స్క్వాడ్ సభ్యురాలు.. అతని భార్య ముచాకి జోగి ఉన్నారని, వీరిపై రూ.8 లక్షల రివార్డు ఉండగా.. మావోయిస్టుల ఏరియా కమిటీ సభ్యులు దేవే, దుధి బుద్రాలపై ఒక్కొక్కరిపై రూ.5 లక్షల రివార్డు ఉందన్నారు. మరో ఏడుగురు కార్యకర్తలపై రూ.2 లక్షల రివార్డు, ఒకరిపై రూ.50వేలు రివార్డు ఉన్నట్లు తెలిపారు. వీరందరికీ ఒక్కొక్కరికి రూ.50,000 సాయం అందించామని.. ప్రభుత్వ పునరావాస పథకాన్ని వర్తింపజేస్తామని చెప్పారు. గతేడాది సుక్మాతో సహా బస్తర్ ప్రాంతంలో దాదాపు 792 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు.

**వచ్చే మార్చి నాటికి నక్సలిజం అంతం...** వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తిగా తుడిచిపెడతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం పునరుద్ఘాటించిన నేపథ్యంలో మావోయిస్టుల లొంగుబాటు ప్రాధాన్యం సంతరించుకుంది. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన సీఆర్పీఎఫ్ 86వ వ్యవస్థాపక దినోత్సవాల పరేడ్‌లో షా మాట్లాడుతూ.. మావోయిస్టులు లేని భారత్ దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మావోయిస్టుల ఏరివేత మిషన్‌కు సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) వెన్నెముకగా నిలిచిందని ప్రశంసించారు. ఫలితంగా ఆ ప్రాంతాల్లో మావోయిస్టుల హింసాత్మక ఘటనలు 70శాతానికి పైగా తగ్గి ఇప్పుడు ముగింపు దశకు చేరాయన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడం కోసం ప్రత్యేక కోబ్రా దళాన్ని ఏర్పాటుచేశామన్నారు.

# హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, భారాస ఎందుకు పోటీ చేయడం లేదు?: కిషన్‌రెడ్డి




హైదరాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, భారాస ఎందుకు పోటీ చేయడం లేదో ప్రజలకు జవాబివ్వాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బేగంపేటలో ఎమ్మెల్సీ ఎన్నికపై నిర్వహించిన భాజపా సన్నాహక భేటీలో ఆయన మాట్లాడారు. మజ్లిస్‌కు వ్యతిరేకంగా భాజపా పోరాటం చేస్తోందన్నారు. తమ పార్టీని ఓడించే ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్, భారాస పనిచేస్తున్నాయని విమర్శించారు. భాజపాను విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేదన్నారు. కాంగ్రెస్, భారాస.. మజ్లిస్ కనుసన్నల్లో ఉన్నాయని మండిపడ్డారు. " రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నా హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో ఎందుకు పోటీ చేయడం లేదో రాహుల్ గాంధీ చెప్పాలి. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన భారాస.. ఇప్పుడు ఎందుకు బరిలో దిగడం లేదు? మూడు కుటుంబ పార్టీలు కుమ్మక్కై భాజపాను ఓడించాలని చూస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉన్నచోటే భారాస ప్రభుత్వం అభివృద్ధి చేసింది. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే ఈ నగరం అభివృద్ధి చెందుతుంది. మోదీ చేస్తున్న కృషి వల్లే ఇక్కడికి పరిశ్రమలు వస్తున్నాయి. హైదరాబాద్ అంటే హైటెక్ సిటీ ఒక్కటే కాదు.. అంబర్ పేట, ఖైరతాబాద్, నాంపల్లి కూడా నగరంలో భాగమే. కాంగ్రెస్ పార్టీ పట్ల ఎలా ఉండాలనేదానిపై కేటీఆర్ సర్టిఫికెట్ భాజపాకు అవసరం లేదు" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# కర్ణాటకలో రోహిత్ వేముల చట్టం చేయాలి: రాహుల్ గాంధీ



దిల్లీ: విద్యావ్యవస్థలో నేటికీ బలహీన వర్గాలు కుల వివక్షను ఎదుర్కొంటున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దళిత విద్యార్థులెవరూ అటువంటి వివక్షను ఎదుర్కోకుండా ఉండాలంటే 'రోహిత్ వేముల' చట్టాన్ని రూపొందించి.. అమలు చేయాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు లేఖ రాశారు. నేటికి కూడా మన విద్యావ్యవస్థలో దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఇటువంటి వివక్షను ఎదుర్కోవడం సిగ్గుచేటని రాహుల్ పేర్కొన్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ జీవితంలో ఎదుర్కొన్న కుల వివక్ష గురించి ఈ లేఖలో రాసుకొచ్చారు. వెనుకబడిన వర్గాల బిడ్డగా అంబేడ్కర్ ఎదుర్కొన్న కష్టాన్ని మరే బిడ్డా ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవడానికి సిద్ధరామయ్య కృషి చేస్తారని తాను నమ్ముతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు చూపిన వివక్షతో రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోయారని.. ఇకనైనా ఇటువంటి హత్యలకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని రాహుల్ అన్నారు. 2016 జనవరి 17న హెచ్‌సీయూ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నాడు. యూనివర్సిటీ అధికారులు, ఇతర విద్యార్థి సంఘాల వేధింపుల కారణంగానే రోహిత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని దళిత సంఘాలు దేశవ్యాప్తంగా ఉద్యమించాయి. విద్యాసంస్థల్లో దళిత విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం రోహిత్ చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. అతడు ఆత్మహత్య చేసుకున్న ఎనిమిదేళ్ల తర్వాత మృతుడి తల్లి విజ్ఞప్తి మేరకు తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసుపై పునర్విచారణ ప్రారంభించింది.

# హైకోర్టు తీర్పు.. టీజీపీఎస్సీకి చెంపపెట్టు: రాకేశ్‌రెడ్డి



హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షల విషయంలో హైకోర్టు తీర్పు టీజీపీఎస్సీకి చెంపపెట్టు అని భారాస నేత రాకేశ్‌రెడ్డి అన్నారు. ధర్మానిదే అంతిమ విజయమని హైకోర్టు తీర్పుతో స్పష్టమైందన్నారు. " పోరాడిన అభ్యర్థులది విజయం, అండగా నిలిచిన భారాసది నైతిక విజయం.

పరీక్షల్లో 10 మంది అభ్యర్థులు ఎలా పెరిగారు?ఇది కూడా సైబర్ నేరమా? పక్కాగా ఒక ప్యాటర్న్ ప్రకారం మార్కులు వేసినట్లు కనిపిస్తోంది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో 21 ఉల్లంఘనలు జరిగాయి. దీనిపై న్యాయవిచారణ లేదా సీబీఐ విచారణ జరపాలి" అని ఏనుగుల రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో మళ్లీ వర్షం.. పలు చోట్ల ట్రాఫిక్ జామ్

తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మధ్యాహ్నం వరకు తీవ్ర ఎండ ఉండగా సాయంత్రం కల్లా పూర్తిగా మారిపోయింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మొదలైంది. సిద్దిపేట జిల్లా, కామారెడ్డి జిల్లా, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో కుండపోత వర్షం కురుస్తోంది. వర్షం కారణంగా అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసి ముద్దాయింది. వరి, మామిడి నేలకొరిగాయి. కామారెడ్డి జిల్లా ఇస్రోజవాడి గ్రామంలో పిడుగుపాటుతో 40 గొర్రెలు మృతి చెందాయి. సుమారు 5 లక్షల వరకు ఆస్తి నష్టం కలిగింది. అటు సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలోనూ పిడుగుపడి గుడిసె కనకయ్యకు చెందిన రెండు పాడి గేదెలు మృతి చెందాయి. ఇలా భారీ వర్షం రైతుల్లో తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది. ఈ మేరకు తెలంగాణలోని కొన్ని జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లోనూ పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. భారీ వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. మ్యాన్ హోల్స్ పొంగిపొర్లుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఐటీ కారిడార్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. సోమాజిగూడ, పంజాగుట్ట, అమీర్‌పేట్ , ఖైరతాబాద్‌లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# గొప్ప మనసు చాటుకున్న పవన్ కల్యాణ్

అల్లూరి జిల్లా: అల్లూరి జిల్లాలో ఎక్కువగా గిరిజనులు ఉండే గ్రామం పెదపాడు. ఈ గ్రామంలో ఎంతో మంది గిరిజనులు నివసిస్తున్నారు. వారికి కనీసం పాదరక్షలు కూడా లేకుండా నడుస్తున్నారు. ఈ క్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ గ్రామంలో పర్యటించారు. పవన్‌ను చూడటానికి ఆ గ్రామంలోని పాంగి మిత్తు అనే వృద్ధురాలు వచ్చింది. ఆమెకు కనీసం చెప్పులు లేకుండా తనను చూడటం కోసం రావడాన్ని చూసి పవన్ కల్యాణ్ చలించిపోయారు. వెంటనే పక్కనున్న ఉపాధి హామీ సిబ్బంది గురించి ఈ విషయంపై ఆరా తీశారు. ఈ నెల 7వ తేదీన అల్లూరి జిల్లాలో పవన్ కల్యాణ్ పర్యటించారు. ఈ సందర్భంగా "అడవి తల్లిబాట" అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ప్రాంతానికి చెందిన పాంగి మిత్తు అనే వృద్ధురాలు పవన్‌ను చూడటానికి వచ్చింది. అయితే ఆమె చెప్పులు లేకుండా ఉండటాన్ని చూసిన పవన్ కల్యాణ్ చలించిపోయారు. వెంటనే అక్కడున్న ఉపాధి హామీ సిబ్బందితో ఈ విషయం గురించి పవన్ కల్యాణ్ మాట్లాడారు. గిరిజనులకు వెంటనే చెప్పులను తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం వారితో మాట్లాడాలని పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ మేరకు కార్యాలయ సిబ్బందిని పవన్ కల్యాణ్ ఆ ఊరికి పంపించారు. గిరిజనులకు కావాల్సిన చెప్పుల సైజులు, ఎంతమందికి చెప్పులు లేవనే వివరాలను కార్యాలయ సిబ్బంది సేకరించింది. అనంతరం 345 మంది గిరిజనులకు ఇంటింటికీ వెళ్లి పాదరక్షలను పవన్ కల్యాణ్ కార్యాలయ సిబ్బంది, స్థానిక సర్పంచ్ వెంకటరావు అందజేశారు. ఇవిధంగా పవన్ కల్యాణ్ గొప్ప మనస్సు చాటుకున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమపట్ల స్పందించిన తీరుపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రతి నాయక పాత్రలకు భూషణం నాగభూషణం

## - ఏప్రిల్ 19...నాగభూషణం జయంతి



అటు సినిమాల్లోనూ, రంగస్థలం మీదా ఏకకాలంలో 'బిజీస్టార్' అనిపించుకున్న ఏకైక నటుడు ఆయన. సినీ పరిశ్రమలో బిజీస్టార్ కాకముందు ఒకే నెలలో ముప్పయ్ ప్రదర్శనలు, ఒకే రాత్రిలో రెండు ప్రదర్శనలు ఇచ్చిన ఘనత ఆయనది. పాతిక ఏళ్ల పాటూ మూడు వందల మంది కళాకారులకు అన్నం పెట్టిన, వాణిశ్రీ, శారద లాంటి ప్రముఖ నటీమణుల ను బృంద సభ్యులు గా గుర్తింపు కలిగిన నాటక బృందంతో వేలాది ప్రదర్శనలు ఇచ్చిన నటనకే అంకితమైన అరుదైన నటుడు ఆయన. విలనిజానికి ఒక ప్రత్యేక పంథాను ప్రవేశపెట్టి, కామెడీ టచ్ ఇచ్చిన నటులుగా గుర్తింపు పొందారు ఆయన. ఒక్క 'రక్తకన్నీరు' నాటకాన్నే ఆయన దాదాపు రెండువేల ప్రదర్శనలు నిర్వహించిన రికార్డును సొంతం చేసుకున్న ఘనుడు ఆయన. ఇప్పుడు ఆయన గుర్తుకు వచ్చారను కుంటా. ఆయనే రక్త కన్నీరు నాగభూషణం గా పేరెన్నిక గన్న చుండి నాగభూషణం. చుండి నాగభూషణం (ఏప్రిల్ 19, 1921 – మే 5, 1995) తెలుగు సినిమా, రంగస్థల నటుడు. తెలుగు సినిమాలలో ప్రత్యేకంగా సాంఘిక చిత్రాలలో ప్రతినాయకులకు గుర్తింపు తెచ్చిన నటుల్లో ప్రత్యేకించి చెప్పుకోవాల్సిన నటుడు. విలన్ చెప్పే డైలాగులకు కూడా క్లాప్స్ కొట్టించిన గొప్పనటుడు. ఇంటర్మీడియట్ వరకూ సజావుగా సాగిన చదువు ఆర్థికలోపం కారణంగా వెనకడుగు.వేయడంతో ఉద్యోగాన్వేషణ చేయక తప్పలేదు. ఎట్టకేలకు నెలకు పాతిక రూపాయల జీతంతో సెంట్రల్ కమర్షియల్ సూపరిడెంట్ కార్యాలయంలో ఉద్యోగం దొరికింది. దాంతో మద్రాసుకు మకాం మర్చారు. ఎస్.వి.రంగారావు కొన్ని సాంఘిక చిత్రాలలో ప్రతినాయకుని వేషం వేసినా అవి సంఖ్యాపరంగా చాలా తక్కువ. ఆర్.నాగేశ్వరరావు, రాజనాల, సత్యనారాయణలు కథానాయకునితో ఫైటింగులు చేసే ప్రతినాయకులు. విలనిజానికి ఒక ప్రత్యేక పంథాను ప్రవేశపెట్టి, కామెడీ టచ్ ఇచ్చిన నటులు నాగభూషణం. కథను హీరో నడిపిస్తుంటే ఆ హీరోను ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ల తాగించడలో ఆరితేరిన వాడు నాగభూషణం. కన్నింగ్ విలనిజానికి నిలువెత్తు తెరరూపం నాగభూషణం. 1952లో పల్లెటూరు చిత్రంతో ప్రవేశించి తొంభయ్యవ దశకం వరకూ చిత్రాలలో నటించారు. ఏది నిజం చిత్రంలో హీరోగా నటించినా మంచి మనసులు (1962) చిత్రంతో గుర్తింపు పొంది రెండు దశాబ్దాల పాటు ఉజ్వలంగా ప్రకాశించారు. ఆయన సృష్టించిన ఒరవడి తరువాత రావు గోపాలరావు, నూతన్ ప్రసాద్, కోట శ్రీనివాసరావు ద్వారా కొనసాగింది. ఆ కాలంలో అందరిలాగే ఆయన తొలుత స్టేజీ ఎక్కి, అందరి నటుల్లాగానే చప్పట్లనే జీత భత్యాలుగా భావించి వాటికి మైమరచిన నటుడు. చిన్నతనం నుండి నాటక రంగంపై మక్కువ పెంచుకున్నారు. ఆయనలోని నిజమైన నటుడ్ని వెలికి తీసింది మద్రాస్ నాటక రంగమే. మద్రాసు చేరే దాకా ఆయనకు నాటకాలంటే ఏమిటో తెలియదు. ఆయనలోని నటుడ్ని మేల్కొల్పిన వారు జి. వరలక్ష్మి, మిక్కిలినేని. ఆనాటికే ఎమ్మార్ రాధా, మనోహర్ వంటి ప్రయోక్తలు తమిళ నాటకాలను భారీ సెట్టింగులతో దుమ్ము రేపేవాళ్లు. అదే నాగభూషణం జీవితాన్ని మలుపు తిప్పింది. చిన్నప్పటి నుంచీ వామపక్ష భావజాలానికి ఆకర్షితుడవుతూ వచ్చారు. ప్రజానాట్య మండలి, ఆ ఇద్దరితో పరిచయానికి ప్రాణం పోసింది. వారితో కలిసి ఆత్రేయ రాసిన భయం, కప్పలు వంటి నాటకాల్లో విరివిగా పాల్గొనేవారు. అలా నాగభూషణం నటజీవితానికి బీజం పడింది. దాని ఫలితం ప్రేక్షక హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయింది. చదువుకొనేటప్పుడు, ఉద్యోగ జీవితంలోను (రైల్వే), నటజీవీవితంలోను (ఉన్నతస్థాయి ఉన్నప్పుడు కూడా) నాటక రంగాన్ని విడిచి పెట్టలేదు. ప్రత్యేకంగా ప్రస్తావించ వలసింది "రక్తకన్నీరు" నాటకం గురించి. ఎమ్మార్ రాధా, మనోహర్ ఆడిన రక్తకన్నీర్ నాటకం ఆనాడు పెద్ద స్టేజ్ ప్లే సెన్సేషన్. దాన్ని తెలుగునాట చేస్తే ఎలా వుంటుందన్న ఆలోచన నాగభూషణం జీవితంలో ఓ మలుపు. సుమారు 5వేలా 500ల ప్రదర్శనలు చేసింది రక్తకన్నీరు. ఆఖరుకు అదే ఆయన ఇంటి పేరుగా మారిపోయింది. నాటి నుంచి నాగభూషణం ప్రతినాయక పాత్రకు నిజంగానే భూషణంగా మారాడు. ఎమ్.ఆర్. రాధా తమిళ నాటకాన్ని తెలుగులో రక్త కన్నీరు పేరుతో వ్రాయించి వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. రవి ఆర్ట్స్ థియేటరు (1956 నుండి) పేరు మీద అనేక నాటకాలు వేసి 30కుటుంబాలకు ఉపాధి కల్పించారు. నట జీవితపు తొలి రోజుల్లో నటించిన చిత్రాలు అంత పేరు తేలేదు. పీపుల్ ఆర్ట్ థియేటర్స్ పతాకంపై వచ్చిన పల్లెటూరు (1952) సినిమాలో నాగభూషణం చిన్న వేషం వేసారు. ఆ తరువాతపెంకి పెళ్లాం (1956)లో వేసిన తాగుబోతు వేషం, అమర సందేశం (1954)లో వేసిన విలన్ వేషం ఆయనకు మంచి పేరు తెచ్చాయి. అలాగే హీరో కావాలన్న కాంక్ష కూడా మనసులో బలంగా వుండేది. 1957లో వచ్చిన ఏది నిజం సినిమాతో ఎట్టకేలకు కథానాయకుడయ్యారు. ఆ సినిమాకు అన్నీ తానై చేశాడు నాగభూషణం. సినిమా బాగానే ఆడింది. రాష్ట్రపతి అవార్డు కూడా వచ్చింది. కొంత కాలం డబ్బింగు ఆర్టిస్టుగా పనిచేశారు. ఐతే మంచి మనసులు (మూలచిత్రం 'కుముదం'లో ఎం.ఆర్. రాధ పాత్ర) చిత్రం ద్వారా మంచి గుర్తింపు లభించింది. విలక్షణమైన సంభాషణా విధానంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. పౌరాణిక పాత్రల్లో శివుడు (భూకైలాస్), సాత్యకి , మాయాబజార్ (1957) లో సహాయక పాత్ర, పౌండ్రక వాసుదేవుడు (శ్రీకృష్ణవిజయం), శకుని (కురుక్షేత్రం) మొదలైన పాత్రలు ధరించారు. 1960లో సుందర్ లాల్ నహతా, డూండీలు శభాష్ రాజా సినిమా తీస్తూ నాగభూషణానికి మంచి వేషం ఇచ్చారు. ఆ అవకాశమే ఆయన దశ మార్చింది. ఎన్టీ ఆర్ కు నాగభూషణం అంటే అభిమానం ఉండేది. తన స్వంత సినిమాలు ఉమ్మడి కుటుంబం, వరకట్నం, తల్లా పెళ్లామా, కోడలు దిద్దిన కాపురం, ఇలా అన్నింటిలోనూ ఆయనకు వరుస వేషాలు ఇచ్చారు. బ్రహ్మచారి సినిమాలో ఆయన సూర్యకాంతానికి జంటగా వేసిన ముసలి వేషంలో సైతం ప్రేక్షకజన ఆమోదం పొందారు. పాత్ర ఏదైనా ఆయన పరకాయ ప్రవేశం చేసే వారు. నాటక సంస్థ రవి ఆర్ట్ థియేటర్స్ పేరుతో నాటకాల రాయుడు (1969), ఒకే కుటుంబం (1970) చిత్రాలు నిర్మించారు నాగభూషణం. నాటకాల రాయుడుకు భగవాన్ హీరోగా నటించిన 'అల్‌బేలా' (1951) హిందీ చిత్రం ఆధారం. (హిందీ పాట' నిందియా ఆజారే ఆజా '(సి. రామచంద్ర స్వరరచన) వరుసలోనే తెలుగులో 'నీలాల కన్నుల్లో మెలమెల్లగా నిదుర రావమ్మా రా' స్వర పరచారు.) ఒకే కుటుంబంకు తమిళచిత్రం 'పాపమన్నిప్పు' ఆధారం. ఇదే చిత్రం మొదట పాప పరిహారం పేరుతో తెలుగులో డబ్బింగు చేశారు. అందులో ఎం.ఆర్.రాధాకి నాగభూషణమే డబ్బింగ్ చెప్పారు. అదే చిత్రాన్ని మళ్ళీ ఎన్.టి.ఆర్, కాంతారావులతో తిరిగి నిర్మించారు. నాటకీయతతో కూడిన తనదైన ప్రత్యేక శైలితో నాగభూషణం మార్కును ఆయన సృష్టించారు. ఈ దాసరి నారాయణరావు ఒక చిత్రంలో పూర్తిగా నాగభూషణం బాణీలో నటించారు. విలన్ పాత్రలతో పాటు ఆడపిల్లల తండ్రిగా చాలా సినిమాల్లో కరుణ రసాత్మకమైన పాత్రలు వేశారు. అమ్మమాట, కథా నాయకుడు, అడవి రాముడు చిత్రాలలో నాగభూషణం నటనను గమనిస్తే తర్వాత కాలంలో రావు గోపాలరావు ధరించిన అనేక పాత్రలలో నాగభూషణం ముద్ర కనిపిస్తుంది. సాంగ్స్ అండ్ డ్రామా కమిటీలో సలహా సంఘ సభ్యునిగా, సినీ కళాకారుల సంక్షేమ నిధి ఏర్పాటు చేసిన వ్యక్తిగా ఆయనకు సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు వుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నమ్మశక్యం కాని నిజం? ఉక్రెయిన్‌లో యూఎఫ్ఓ దాడి, గడ్డకట్టుకుపోయిన సైనికులు



ఉక్రెయిన్‌లో సోవియట్ సైనికుల మీద ఏకంగా గ్రహాంతరవాసులే దాడి చేశారట! వినడానికి ఇది సైన్స్ ఫిక్షన్ సినిమా కథలా ఉన్నా, అమెరికా గూఢచారి సంస్థ సీఐఏ బయటపెట్టిన కొన్ని రహస్య ఫైల్స్‌లో ఈ విషయం ఉందట. దీంతో ఇప్పుడు ఇది సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. నిజానికి ఈ పత్రాల్ని 2000 సంవత్సరంలోనే డీక్లాసిఫైడ్ చేశారు. కెనడాకు చెందిన వీక్లీ న్యూస్, ఉక్రెయిన్‌కు చెందిన హెూలోస్ ఉక్రెయినీ అనే పత్రికలు ఈ విషయాన్ని రిపోర్ట్ చేశాయి. అప్పటినుంచి గుర్తుతెలియని ఎగిరే వస్తువులు (యూఎఫ్‌వో) గురించి వెతికేవాళ్ల మధ్య ఇది ఒక హాట్ టాపిక్‌గా మారిపోయింది. అంతేకాదు, పాపులర్ పాడ్‌కాస్ట్ అయిన 'జోరోగన్ ఎక్స్‌పీరియన్స్'లో కూడా దీన్ని గురించి చర్చించారు. ఇంతకీ ఆ ఫైల్స్‌లో ఏం ఉందో తెలుసుకుందాం పదండి! సీఐఏ పత్రాల్లో పేర్కొన్న దాని ప్రకారం, సోవియట్‌కు చెందిన ఒక ప్లాటూన్ దళం సాసర్ ఆకారంలో ఎగురుతున్న ఒక వస్తువు మీద కాల్పులు జరిపింది. దీంతో ఆ వస్తువులో ఉన్న గ్రహాంతరవాసులు ఎదురుదాడి చేశారట. ఈ దాడిలో 23 మంది సైనికులు అక్కడి నుంచి తప్పించుకునేలోపే గడ్డకట్టుకుపోయారట. కొందరి రక్తం కూడా గడ్డకట్టుకుపోయినట్లు గుర్తించారని ఆ పత్రాల్లో ఉంది. 1991లో సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత దీనికి సంబంధించిన 250 పేజీల కేజీబీ రిపోర్టును సీఐఏ సంపాదించిందట. న్యూయార్క్ పోస్ట్ పత్రిక ఒక కథనంలో దీనికి సంబంధించిన ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, చిత్రాలు ఆ రిపోర్టులో ఉన్నాయని పేర్కొంది. సీఐఏ దగ్గర ఉన్న భారీ సమాచార సేకరణలో భాగంగా ఫ్రీడమ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ యాక్ట్ ఎలక్ట్రానిక్ రీడింగ్ రూమ్‌లో ఈ పత్రాలు అందుబాటులో ఉన్నాయని ఆ పత్రిక తెలిపింది. ఆ రిపోర్టులో ఇంకేముందంటే, ఉక్రెయిన్‌లో శిక్షణ కార్యక్రమంలో ఉన్న సోవియట్ సైనిక బృందం చాలా తక్కువ ఎత్తులో ఎగురుతున్న సాసర్ లాంటి ఒక పెద్ద వాహనాన్ని చూసిందట. ఆ సమయంలో ఒక సైనికుడు క్షిపణిని ప్రయోగించగా అది దాన్ని తాకడంతో అది క్రాష్ ల్యాండ్ అయింది. దానిలో నుంచి పొట్టిగా ఉన్న ఆకారాలు బయటకు దిగాయని, వాటికి పెద్ద కళ్లు, పొడవైన చేతులు ఉన్నాయని ఆ రిపోర్టులో ఉంది. అంతేకాదు, వారు చాలా తీవ్రమైన కాంతి, వెలుగుతో ఉన్న ఒక పరికరంతో ఎదురుదాడి చేశారని కూడా ఆ నివేదిక తెలిపింది. ఆ తర్వాత అక్కడ దొరికిన ఆ ఎగిరే వస్తువు శకలాలను కేజీబీ ఏజెంట్లు ఒక రహస్య ప్రదేశానికి తరలించారు. వారికి అక్కడ ఒక గుర్తుతెలియని వెలుగు కనిపించిందని, దాని వల్ల అక్కడి సైనికులందరూ బిగుసుకుపోయారని గుర్తించారు. గ్రహాంతరవాసుల దగ్గర మనం ఊహించిన దానికన్నా చాలా అత్యాధునిక ఆయుధాలు ఉన్నాయని సీఐఏ తేల్చిందని ఆ పత్రాల్లో ఉంది. కెనడాకు చెందిన వరల్డ్ న్యూస్ 1993లో ఈ ఘటన 1989 నుంచి 1990 మధ్యలో జరిగిందని వెల్లడించింది. ఒక ఊహాజనిత కథలాంటి ఈ రిపోర్టు సీఐఏ ఫైల్స్‌లో ఉండటం నిజంగా ఆశ్చర్యం కలిగిస్తుంది. మరోవైపు, సీఐఏకు చెందిన మాజీ ఏజెంట్ మైక్ బేకర్ మాత్రం ఈ కథనంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఒకవేళ గ్రహాంతరవాసుల ఘటన నిజంగా జరిగి ఉన్నా, ప్రచురితమైన ఈ నివేదిక మాత్రం ప్రత్యక్షంగా చూసిన వాళ్ల సమాచారం నుంచి రాలేదని, అది నాలుగైదు చేతులు మారిన సమాచారాన్ని ప్రచురించినట్లుగా ఉందని ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనా, ఈ కథనం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా యూఎఫ్‌వోల గురించి ఆసక్తి ఉన్నవాళ్లందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

# పెళ్లి ప్రమాణానికి కొత్త అర్థం.. భార్యను తుపాకితో కాల్చి చంపాడు!

ఇటీవల కాలంలో జీవిత భాగస్వామి వేధింపులు తాళలేక ఆత్మహత్యలు చేసుకోవడం, భాగస్వామిని హత్య చేయడం వంటి ఘటనలు తరచూ తెరపైకి వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల కాలంలో వరుసగా ఎన్నో సంఘటనలు జరిగాయి! ఈ నేపథ్యంలో తాజాగా తన భార్యను తుపాకీతో కాల్చిన భర్త.. సూసైడ్ నోట్ లో ఓ కీలక విషయం వెల్లడించారు! అవును... ఇటీవల కాలంలో దంపతుల్లో ఒకరు ఆత్మహత్యకు పాల్పడటం.. లేదా హత్య చేయడం.. ఇంకొన్ని సందర్భాల్లో భాగస్వామిని హత్య చేసి, తాను ఆత్మహత్యకు పాల్పడటం వంటి ఘటనలు తరచూ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో ఓ భర్త తన భార్యను తుపాకీతో కాల్చి చంపి, తాను సూసైడ్ చేసుకుని.. తెరపైకి పెళ్లి నాటి ప్రమాణాన్ని తీసుకొచ్చారు! వివరాల్లోకి వెళ్తే... ఉత్తరప్రదేశ్ లోని ఘజియాబాద్ లో దారుణం



జరిగింది. ఇందులో భాగంగా... మీరట్ నివాసి అయిన కుల్దీప్ త్యాగి.. భార్య నిషు త్యాగిని తుపాకీతో కాల్చి చంపారు. అనంతరం.. కుల్దీప్ కూడా తనను తాను కాల్చుకుని ఆత్యహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు ముందు రాసిన సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ సూసైడ్ నోట్ లో తనకు కేన్సర్ ఉందని.. చికిత్స ఖర్చులు కుటుంబానికి భారంగా ఉండకూడదనే ఉద్దేశ్యంతోనే తాను చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు రాసినట్లు పోలీసులు తెలిపారు. తనకు కేన్సర్ ఉందనే విషయం కుటుంబ సభ్యులకు తెలియదని కూడా ఆ సూసైడ్ నోట్ లో పేర్కొన్నట్లు చెబుతున్నారు. అయితే... తన భార్యతో జీవితాంతం కలిసి ఉంటానని మాట ఇచ్చానని.. పెళ్లి నాడు ప్రమాణం చేశానని.. అందుకే తాను ఆత్మహత్య చెసుకోవడానికి ముందు ఆమెను చంపినట్లు పేర్కొన్నాడని చెబుతున్నారు.

కేన్సర్ రోగం తనను మానసికంగా తీవ్రంగా కలిచి వేసిందని పేర్కొన్నట్లు చెబుతున్నారు. కాగా.. కుల్దీప్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడని పోలీసులు తెలిపారు! ఇలా.. జీవితాంతం కలిసి ఉంటానని ప్రమాణం చేసినందుకు.. తాను ఆత్మహత్య చేసుకోవడానికి ముందు తన భార్యను హత్య చేసినట్లు అతడు సూసైడ్ నోట్ లో పేర్కొనడం షాకింగ్ గా మారింది!

# 'స్త్రీ' అనే పదానికి ఇదే చట్టపరమైన నిర్వచనం... సుప్రీం సంచలనం!

సమానత్వ చట్టాలు ఎలా వర్తింపజేయబడతాయనే దానిపై తీవ్ర పరిణామాలు ఉన్న కేసులో.. యునైటెడ్ కింగ్ డమ్ అత్యున్నత న్యాయస్థానం "స్త్రీ" అనే పదానికి చట్టపరమైన నిర్వచనం తెలిపింది. ఈ మేరకు సంచలన తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా పుట్టుకతో అమ్మాయిలుగా పుట్టినవారికి మాత్రమే లింగపరంగా "స్త్రీ"గా గుర్తింపు దక్కుతుందని తెలిపింది. అవును... 'స్త్రీ' అనే పదానికి చట్టపరమైన నిర్వచనాన్ని వెల్లడిస్తూ తాజాగా యూకే సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఇందులో భాగంగా... అమ్మాయిలుగా పుట్టినవారికి మాత్రమే చట్టపరంగా, లింగపరంగా 'స్త్రీ'గా గుర్తింపు దక్కుతుందని తెలిపింది. 'స్త్రీ'కి చట్టపరమైన నిర్వచనం... జీవసంబంధమైన స్త్రీ, జీవసంబంధమైన లైంగికత అని ఏకగ్రీవంగా తీర్పు ఇచ్చింది! 2018లో స్కాట్లాండ్ లోని ఓ ప్రచారకర్తల బృందం ఈ సవాలును ముందుకు తెచ్చింది. దీంతో.. ఎన్నో ఏళ్ల




సుదీర్ఘ విచారణ అనంతరం ఈ తీర్పు వెల్లడైంది. ఇందులో భాగంగా... సమానత్వ చట్టం – 2010 ప్రకారం "స్త్రీ", "లింగం" అనే పదాలు పుట్టుకతో అమ్మాయిలుగా పుట్టినవారిని, పుట్టుకతో ఏ లింగానికి చెందినవారు అనే విషయాలను మాత్రమే సూచిస్తాయని సుప్రీం స్పష్టం చేసింది. వాస్తవానికి లింగ ధృవీకరణ గుర్తింపు పత్రం (జీ.ఆర్.సీ) ఉన్న ట్రాన్స్ ఉమెన్ చట్టబద్ధంగా 'స్త్రీ' అని, అందువల్ల వారికి కూడా అదే చట్టపరమైన రక్షణలు కల్పించాలని స్కాట్లాండ్ ప్రభుత్వం పేర్కొంది. అయితే... లింగమార్పిడి చేయించుకున్నంత మాత్రాన్న ఆమె చట్టపరంగా మహిళ కాదని సుప్రీం స్పష్టం చేస్తూ.. ఇదే సమయంలో.. ట్రాన్స్ జెండర్ లకు రక్షణ ఉంటుందని తెలిపింది. అయితే ఈ తీర్పుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండగా.. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ చేస్తోన్న వాదన, ఆ మేరకు తీసుకుంటున్న నిర్ణయాలకు ఈ తీర్పు పరోక్షంగా మద్దతు కలిగించిందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ సందర్భంగా స్పందించిన ఎల్.జీ.బీ.టీ.క్యూ. ఛారిటీ స్టోన్ వాల్.. తాజా సుప్రీం తీర్పు ట్రాన్స్ కమ్యునిటీకి చాలా ఆందోళన కలిగించేదని అన్నారు. కాగా... యూకే ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2023లో లైంగిక గుర్తింపు ఆధారంగా ద్వేషపూరిత నేరాలు సుమారు 112% పెరిగినట్లు చెబుతున్నారు. అదే విధంగా.. అదే ఏడది సెంట్రల్ ఇంగ్లాండ్ లోని ఓ పార్కులో బ్రియానా ఘే అనే యువ ట్రాన్స్ అమ్మాయిని ఇద్దరు స్కూలు పిల్లలు హత్య చేశారు!

# ఇలా నిర్ణయం.. అలా అమలు: విమర్శకుల నోళ్లకు తాళం!



అమరావతి రాజధాని విషయంలో విమర్శకుల నోళ్లకు తాళం వేసేలా చంద్రబాబు ప్రభుత్వం సంచలన దిశగా అడుగులు వేసింది. ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే.. అమలు చేసేందుకు కొంత సమయం పడుతుంది. ఇది సహజం. యంత్రాంగంలో కదలిక, నిర్ణయాల తీరు వంటివి ఆధారంగా సదరు కార్యాచరణ ఉంటుంది. అయితే.. అమరావతి రాజధానిలో ఐకానిక్ భవనాల నిర్మాణా నికి సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను 24 గంటలు కూడా గడవకముందే.. అమలులోకి వచ్చాయి. మంగళవారం రాష్ట్ర మంత్రి వర్గం.. అమరావతి నిర్మాణాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన భేటీ అయిన మంత్రి వర్గం.. ఐకానిక్ టవర్లను నిర్మించేందుకు ఆమోద ముద్ర వేసింది. అంతే.. తెల్లవారేసరికి అంటే.. బుధవారానికి అధికారులు కార్యాచరణ ప్రకటించారు. కీలకమైన సచివాలయం, హైకోర్టు, ఉన్నతాధికారుల కార్యాలయాలకు సంబంధించిన భవన నిర్మాణాలకు క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సీఆర్ డీఏ) టెండర్లను పిలిచింది. సచివాలయానికి 4 టవర్లు, ఉన్నతాధికారుల(హెచ్‌వోడీ) కార్యాలయానికి ఒక టవర్ కు సంబంధించి టెండర్లను ఆహ్వానించింది. వీటిలో పాల్గొనే వారు.. సంబంధిత నిబంధనలకు లోబడి వ్యవహరించాలని పేర్కొంది. ఈ రెండు టెండర్ల సీల్డ్ బిడ్లను కూడా.. వచ్చే నెల 1న తెరవనున్నారు. ఏయే టవర్‌కు ఎంతెంత ఖర్చు.. హెచ్‌వోడీ టవర్ నిర్మాణానికి రూ.1,126 కోట్లు, సచివాలయం 1, 2 టవర్ల కోసం రూ.1,897 కోట్లు., సచివాలయం 3, 4 టవర్ల కోసం రూ.1,664 కోట్లు. మొత్తంగా 5 టవర్ల నిర్మాణానికి రూ.4,668 కోట్లను ఖర్చు చేయనున్నారు.

**ఎన్నెన్ని అంతస్థులు?...** నిర్మించబోయే ఐకానిక్ టవర్లకు ముందుగానే అనుకున్న ప్రకారం.. అంస్థులను కూడా నిర్ణయించారు. దీని ప్రకారం.. ఉన్నతాధికారులు ఉండే హెచ్‌వోడీ టవర్‌ను 45 అంతస్థులతో నిర్మిస్తారు. సచివాలయానికి సంబంధించిన 4 టవర్లను ఒక్కొక్కటీ 40 అంతస్థులతో నిర్మిస్తారు. వీటి నిర్మాణానికి రెండున్నరేళ్ల గడువు విధించారు. అత్యధికంగా మరో ఆరు మాసాలు పొడిగించే వెసులుబాటు ఉంది.


చురకలు

## సంపాదకీయం

### ఈసారి గెలిస్తే స్టాలిన్ హీరోనే !

దేశంలో ఆసక్తికరమైన పోరు ఈసారి తమిళనాడులో జరగనుంది. మొదటిసారి బీజేపీ దక్షిణాది మీద గురి పెట్టింది. దానికి గేట్ వేగా తమిళనాడుని చేసుకుంటోంది. తమిళనాడులో ద్రవిడ పార్టీల మీద గెలిస్తే ఇక తిరుగేలేదని కూడా భావిస్తోంది. ఎందు చేతనటే తమిళనాడు అనంది రాజకీయంగా చైతన్యవంతమైన ప్రాంతం. అక్కడ కనుక జెండా పాతితే బీజేపీకి ఎదురు ఉండదు. కర్ణాటక ఎటూ బీజేపీకి అధికారం ఇస్తూ వస్తోంది. తెలంగాణాలో ఇపుడిపుడే బలపడు తోంది. ఏపీలో టీడీపీ జనసేనలతో కలసి కూటమి కట్టింది. అక్కడ మెల్లగా పాగా వేయడానికి మార్గాలు వెతుకుతోంది. ఇక తమిళనాడునే గెలుచుకోవాలన్నది బీజేపీ మార్క్ వ్యూహం. దాని కోసం అన్నాడీఎం కేతో పొత్తు పెట్టుకుంది. ఒక విధంగా బీజేపీకి గ్రౌండ్ లెవెల్ లో కష్టాలు తీరినట్లే. అన్నా డీఎంకేకు క్షేత్ర స్థాయిలో బలం బలగం దండీగా ఉన్నాయి. పై స్థాయిలో అండగా ఉంటూ బేజేపీ ఆశీర్వదిస్తే ఏపీ మాదిరిగా తమిళనాడులో గెలుపు సాధ్యమే అన్నది ఒక ఆలోచనగా ఉంది. ఇవన్నీ పక్కన పెడితే తమిళనాడు నుంచే బీజేపీకే పదునైన రాజకీయ సవాల్ ఎదురైంది. అది కూడా డీఎంకే అధినేత స్టాలిన్ రూపంలో. కరుణానిధి వారసుడిగా వచ్చిన స్టాలిన్ ఇంతలోనే జాతీయ రాజకీయల్లో కీలకం అవుతారని ఎవరూ అనుకోలేదు. బీజేపీ అంతలా ఊహించలేదు కూడా. కానీ జరుగు తున్నది వేరుగా ఉంది. స్టాలిన్ కేవలం తమిళనాడుకే పరిమితం కావడం లేదు. సౌత్ స్టేట్స్ ని ఆయన ఏకం చేస్తున్నారు. ఇటీవలనే ఆయన డీలిమిటేషన్ మీద దక్షిణాది రాష్ట్రాల సీఎంలతో రాజకీయ పార్టీల నేతలతో కీలక మీటింగ్ నిర్వహించారు. ఒక రకంగా బీజేపీకి పెను సవాల్ చేశారు. బీజేపీ దక్షిణాది ఆశలకు తొలి చెక్ పెట్టాలని చూశారు. దాంతోనే బీజేపీ చలా మెట్లు దిగి వచ్చి మరీ అన్నా డీఎంకేతో పొత్తు పెట్టుకుంది. ఆరు నూరు అయినా స్టాలిన్ అధికారంలోకి మళ్ళీ రాకూడదన్నది బీజేపీ గట్టి పట్టుదలగా ఉంది. దాని కోసం తనదైన రాజకీయ వ్యూహాలను అమలు చేస్తోంది. అయితే స్టాలిన్ కాంగ్రెస్ వామపక్షాలు ఇతర పార్టీలతో కలసి కూటమిగా వస్తున్నారు. ఆయన కేంద్రం మీద పోరాడే యోధుడిగా ఇప్పటికే తమిళ ప్రజలకు చేరువ అయ్యారు. ద్రవిడ వాదానికి కేంద్ర బిందువుగా ఆయన ఫోకస్ అయ్యే ప్రయత్నం చేస్తున్నారు. సౌత్ నుంచి మోడీని ఢీ కొట్టే రాజకీయ నేతగా ఆయన తనను తాను ప్రొజెక్ట్ చేసుకుంటున్నారు. ఇవన్నీ కలసి ఆయన అవకాశాలను ఎన్నికల్లో ఏ మేరకు పెంచుతాయో చూడాలి. అయిదేళ్ళ పాలన మీద ఎంతో కొంత యాంటీ ఇంకెంబెన్సీ ఉంటుంది. అయితే దానితో పాటుగా మోడీ వర్సెస్ స్టాలిన్ అన్నట్లుగా పిక్చర్ ని కనుక జనంలోకి బలంగా పంపితే అది అంతిమంగా స్టాలిన్ కి ప్లస్ అవుతుంది అని అంటున్నారు. ఈసారి కనుక స్టాలిన్ గెలిచి మళ్ళీ సీఎం అయితే ఆయన హీరో అవడం ఖాయమని అంటున్నారు. అంతే కాదు జాతీయ రాజకీయాల్లో ఆయన ప్రభ పూర్తి స్థాయిలో వెలగడం ఖాయమని కూడా అంటున్నారు.


## జీవ పరిణామ సిద్ధాంత కర్త డార్విన్ - ఏప్రిల్ 19.. చార్లెస్ డార్విన్ వర్ధంతి




డార్విన్ పేరును తలుచుకుంటే ఎవరికైనా వెనువెంటనే గుర్తుకు వచ్చేది పరిణామ సిద్ధాంతం. భూమిపై జీవజాలము ఏ విధంగా పరిణామక్రమం చెందినది అనే విషయముపై పరిశోధనలు చేసి, జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు అయన. ప్రకృతిలో జీవజాతులు వేటికవే ఏక కాలంలో రూపొందినట్లు ఎంతో కాలం నుండి నమ్మేతూ వస్తున్న ప్రజానీకానికి - అదంతా వాస్తవం కాదని ఒక మాతృక నుంచి సకల జీవరాశులు క్రమానుగతంగా పరిణామం చెందుతూ ఏర్పడతాయని, ఈ చర్య అనంతంగా కొనసాగుతూ ఉంటుందని మొట్ట మొదటి సారిగా వివరించినవాడు చార్లెస్ డార్విన్ మాత్రమే. వానరుని నుంచి నరవానరుడు, నరవానరుని నుంచి నరుడు పరిణామ పరంగా ఉద్భవించాడని తెలిపి సంచలనం రేపిన ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్. చార్లెస్ రాబర్ట్ డార్విన్ (ఫిబ్రవరి 12, 1809 - ఏప్రిల్ 19, 1882) ఇంగ్లాండుకు చెందిన ప్రకృతివాది. డార్విన్ 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లండులోని ష్రూస్‌బరీలో జన్మించాడు. వైద్యుడైన తండ్రి అన్ని సదుపాయాలూ సమకూర్చినా చదువులో రాణించలేదు. ఆయనను మంద బుద్ధిగా ఉపాధ్యాయులు భావించేవారు. ఆయన చిన్ననాటి నుండి కీటకాలను, ఖనిజాలను సేకరిస్తూ రసాయనిక శాస్త్రంలో పరిశోధనలు చేస్తూ ఉండేవాడు. 16 యేండ్ల వయస్సులో వైద్య విద్యను చదవటం కోసం ఆయనను ఎడిన్ బర్గ్ విశ్వ విద్యాలయంలో చేర్పించారు. కాని మత్తు మందులు లేకుండా చేస్తున్న ఆపరేషన్లను చూచి, ఆ చిత్రహింసకు ఆయన కలత చెంది వైద్య విద్యపై మనసు పెట్టి చదవలేక పోయాడు. ఏదో ఒక డిగ్రీ సంపాదించాలనే తండ్రి కోరికపై కేంబ్రిడ్జ్‌లో తత్త్వశాస్త్ర అధ్య అధ్యయనంలో చేరినా అక్కడా అదే పరిస్థితి. అక్కడి ప్రొఫెసర్ ఓసారి అతడికి 'బీగల్' అనే ఓ నౌక కెప్టెన్ కు పరిచయం చేశాడు. వివిధ దేశాల్లో, దీవుల్లో ఉండే జీవుల పరిశీలనకు అవకాశం ఉంటుందనే ఆలోచనతో డార్విన్ తన తండ్రి వద్దంటున్నా వినకుండా ఆ ఓడ ఎక్కేశాడు. ఆ నౌకాయానంలో డార్విన్ అనేక ప్రాంతాల్లో మొక్కలు, రాళ్లు, శిలాజాలు, కీటకాలు, జంతువులను పరిశీలించి చాలా నమూనాలను సేకరించి ఇంటికి పంపుతూ వచ్చాడు. ఆ పరిశీలనల ఆధారంగానే జీవజాతుల పరిణామ క్రమంపై పుస్తకం రాశాడు. 150 సంవత్సరాల క్రితం రాసిన ఈ గ్రంథం ఇప్పటికీ ప్రామాణికంగా నిలిచి ఉంది. జీవుల్ని ఏదో అతీత శక్తి ఏకకాలంలో సృష్టించ.లేదని, అవి వివిధ దశల్లో స్వాభావిక ఎంపిక ద్వారా పరిణామం చెందాయని డార్విన్ సిద్ధాంతం చెబుతుంది. ఇది ఇప్పటి మైక్రో బయాలజీ, జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీలను సంఘటిత పరచడంలోనూ, డీఎన్ఏ పరీక్షల్లోనూ ప్రముఖ పాత్ర వహిస్తోంది. చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం భూమి మీది జీవుల పరిణామ క్రమాన్ని తెలియజేస్తుంది. ఆధునిక జీవ శాస్త్రంలో "డార్వినిజం" చాలా మార్పు తెచ్చింది. మూఢ నమ్మకాలను విభేదించడంలో కూడా డార్వినిజం కీలక పాత్ర పోషించింది. మనిషి ఒక రకమైన కోతి జాతి నుంచి పరిణామం చెందుకుంటూ వచ్చాడని, మనిషిని దేవుడు సృష్టించలేదన్న సిద్ధాంతాన్ని తెర మీదకు తెచ్చింది. ఇప్పుడు కూడా సృష్టివాదం పేరుతో డార్వినిజాన్ని వ్యతిరేకించే వాళ్ళు ఉన్నారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం మార్క్సిస్ట్ చారిత్రక భౌతికవాద రచనలకి కూడా ఊపిరి పోసింది. మలేషియా నుంచి రసెల్ వాలేస్ (1823- 1913) అనే వ్యక్తి పంపిన సిద్ధాంత వ్యాసం డార్విన్ వ్యాసం ఒకే విధంగా ఉన్నాయి. డార్విన్ 1844లో తన రచనను, వాలేస్ పంపిన వ్యాసాన్ని లియన్ సొసైటీ జర్నల్‌కు అందచేశాడు. 1858 జూలై 15న శాస్త్రవేత్తల సమావేశం జరిగింది. ఇరువురి వ్యాసాలు పరిశీలించారు. 1844లో డార్విన్ మొదలు పెట్టగా, వాలేస్ 1858లో రాశాడు. కనుక డార్విన్ ముందు రాసినట్టు నిర్ధారించారు. ప్రస్తుతం ప్రపంచంలో కనబడుతున్న రకరకాల ప్రాణులు మొదటి నుంచీ లేవనేది ఈ సిద్ధాంతం యొక్క ప్రధానమైన వాదన. కుక్కలూ, నక్కలూ, తోడేళ్ళూ ఒక జాతివనీ, పిల్లులూ, చిరత పులులూ, పెద్ద పులులూ, సింహాలూ మరొక జాతికి చెందినవనీ, గుర్రాలూ, గాడిదలూ, జీబ్రాలూ ఒకలాంటివే. గతంలో వీటికి తలొక "పూర్వీకుడూ" ఉండి ఉండాలి. ఇంకా వెనక్కెళితే ఈ "ఆదిమ" శునకానికీ, మార్జాలానికీ, అశ్వానికీ జన్మనిచ్చిన మరేదో మృగం ఉండి ఉంటుంది. ఇంకా ప్రాచీన యుగంలో ఈ క్షీరదాలకీ, తక్కిన చేపలూ, తాబేళ్ళూ, జలచరాలూ, పక్షులూ అన్నిటి ఆవిర్భావానికీ దారితీసిన ప్రాణి ఏదో ఉండే ఉ ంటుంది. వీటిలో కొన్ని శాకాహారులుగా, మరికొన్ని మాంసాహారులుగా రూపొందడానికి భౌతిక ప్రేరణలూ, పర్యావరణ పరిస్థితులే కారణాలు అయి ఉంటాయి. ఇన్నిరకాల ప్రాణులు "వాటంతట అవే" ఎలా ఉ ద్భవిస్తాయని వీరి వాదన సాగిపోతుంది. ఉదాహరణకు ఆఫ్రికాలో పుట్టుకొచ్చిన మానవ జాతి క్రమంగా ఉత్తర దిశగానూ, తక్కిన ప్రాంతాలకీ విస్తరించిందని శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. ఉష్ణోగ్రత దృష్ట్యా తొలి మానవులు నల్లని రంగులో ఉండి ఉంటారని అనుకోవచ్చు. ఉత్తరాన ఎండపొడ తక్కువగా పడే ప్రాంతాలకు వెళ్ళినవారి చర్మం తెల్లగా మారక తప్పలేదు. పూర్తిగా నల్లరంగులో ఉన్న ఒక మానవ సమూహం తెల్లగా మారి పోవడానికి 20 వేల సంవత్సరాలు సరిపోతాయని అంచనా. తక్కిన జంతువుల సంగతి ఎలా ఉ న్నా, ఒక్క మనిషి జాతినే తీసుకుంటే, చర్మం రంగూ, ముఖ కవళికలూ అన్నీ మెల్ల మెల్లగా మారడానికి జీవపరిణామ ప్రక్రియలే కారణమని రుజువు అవుతోంది. సరిగ్గా ఆ సమయంలోనే ఆల్ఫ్రెడ్ రస్సెల్ వాలెస్ అనే మరో శాస్త్రవేత్త కూడా డార్విన్ చెప్పిన సిద్ధాంతాన్నే వెలువరించాడు. డార్విన్ కు ఉత్తరం కూడా రాసాడు. 1858 లో వీరిద్దరూ సంయుక్తంగా ఒక పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. కూడా! 1859 లో ప్రపంచ ప్రసిద్ధి పొందిన "ది ఆరిజన్ ఆఫ్ స్పీసిస్ ఆఫ్ నేచురల్ సెలక్షన్" పుస్తకాన్ని చార్లెస్ డార్విన్ వెలువరించాడు. ఈ పుస్తకం విడుదలైన రోజునె అన్ని ప్రతులూ అమ్ముడు పోయి సరికొత్త రికార్డును సృష్టించింది. పరిణామ సిద్ధాంతం జీవజాతుల మధ్య సంఘర్షణ ఉంటుంది. సజాతి సంఘర్షణ, విజాతి సంఘర్షణ, ప్రకృతిలో సంఘర్షణ. ఈ సంఘర్షణలో నెగ్గినవే ప్రకృతి ఎన్నిక చేసిన సార్థకమ జీవులు. ఇవే మనుగడను సాగిస్తాయి. ఈ జీవులలోని వైవిధ్యాలే తరాలు మారుతూ పోగా కొత్త జాతుల ఉత్పన్నానికి మూలాధారాలు అవుతాయి. ఇది సంక్షిప్తంగా డార్విన్ పరిణామ వాదం. అయితే సృష్టి సిద్ధాంత వాదులు ఈయన వాదనను సమర్థించరు. అయితే బైబిల్ లో చెప్పినట్లు ఏడు రోజుల లోనే సమస్త సృష్టి, సకల జీవ జలాలు రూపొందించ బడినాయని చెబితే మాత్రం నమ్మడం కష్టం. చార్లెస్ డార్విన్ స్వంత దేశమైన బ్రిటన్ లో డార్వినిజం ఎన్నో ప్రశంశలు అందుకుంది. డార్వినిజం ప్రపంచంలో ఎంతో మంది భౌతిక శాస్త్రవేత్తలని, జీవ శాస్త్రవేత్తలని ప్రభావితం చేసి అధునిక భౌతిక శాస్త్ర విజ్ఞానాన్ని ఎన్నో మలుపులు తిప్పింది. అయితే కొన్ని క్రైస్తవ, ఇస్లామిక్ దేశాలలో డార్వినిజం చాలా వివాదాస్పద మయ్యింది. సృష్టి వాదాన్ని వ్యతిరేకించడం దైవ ద్రోహం అని మతవాదుల వాదన. కొన్ని ఇస్లామిక్ దేశాలలో ఈ సిద్ధాంతాన్ని నిషేదించారు. ఈ సిద్ధాంతం తప్పని, జీవ పరిణామక్రమం జరగలేదని వాదించే వారు కూడా ఉన్నారు. ఈయన 74 యేండ్ల వయస్సులో మృతి చెందాడు. సర్ ఐజాక్ న్యూటన్ సమాధి దగ్గరే ఆయన కూడా సమాధి చేయ బడింది. డార్విన్ లేకపోయినా ఆయన ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్ధాంతం ఎప్పటికీ నిలిచే ఉంటుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


## బాల గేయ సాహిత్య ఆద్యులు గిడుగు సీతాపతి - ఏప్రిల్ 19... గిడుగు వెంకట సీతాపతి వర్ధంతి

బాల సాహిత్యరచయితల్లో ప్రథముడిగా, ప్రముఖుడి గా భావించ బడతారు గిడుగు వెంకట సీతాపతి. 1800 సంవత్సరానికి పూర్వం బాల సాహిత్యమనేది ఎక్కువగా కనిపించేది కాదు. ఉన్నా అది లిఖితం కానిదే. జానపద సాహిత్యంలో అంతర్భాగమై ఉండేది. 1819లో పిల్లల కోసం విక్రమార్కుని కథలు పుస్తకం అచ్చయ్యింది. ఆనాటి నుంచి బాలసాహిత్యం ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన సాహిత్యంగా వచ్చింది. 20వ శతాబ్ది ప్రారంభంలో అధునిక తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియలు ఆంగ్ల భాషా సాహిత్య ప్రభావ కారణంగా పరిణమించినట్లే బాలసాహిత్య ప్రక్రియ కూడా ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల వచ్చింది. పిల్లలు చదివి అర్థం చేసుకో గల సాహిత్యం ఈ వికాస దశలోనే వెలువడింది. బాల సాహిత్యంతో గిడుగు వెంకట సీతాపతికి విడదీయ రాని సంబంధం ఉంది. సీతాపతి 1885వ సంవత్సరం జనవరి28 వ తేదీన విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం తెలుగు వ్యావహారిక భాషోద్యమసారధి అయిన గిడుగు వెంకటరామ మూర్తి దంపతులకు జన్మించారు. మద్రాసు క్రైస్తవ కళాశాలలో చరిత్రలో పట్టభద్రులై కొంతకాలం పర్లాకిమిడిలో చరిత్ర ఉపన్యాసకులుగా పని చేశారు. వ్యావహారిక భాషోద్యమం లోను, సవర భాషోద్ధరణ లోను తండ్రికి కుడిభుజంగా నిలిచి విశేషానుభవం గడించారు. రైతుబిడ్డ, స్వర్గసీమ, పల్నాటి యుద్ధం, భక్తిమాల వంటి కొన్ని చలనచిత్రాల్లోను మరియు కొన్ని నాటకాల్లోను నటించారు. మాగంటి బాపినీడు సంపాదకత్వంలో వెలువడిన ఆంధ్ర సర్వస్వానికి అనేక వ్యాసాలు రాశారు. తెలుగులో భాషాసమితి ఏర్పడినప్పుడు తెలుగు విజ్ఞాన సర్వస్వానికి ప్రధాన సంపాదకుడిగా నియమితులయ్యారు. చరిత్ర - రాజనీతి శాస్త్ర సంపుట సంపాదక వర్గంలో ప్రముఖ పాత్ర పోషించారు. సూర్యరాయాంధ్ర నిఘంటువు చివరి దశలో ఆయన సంపాదకత్వం వహించారు. ఆయన రచనల్లో ముఖ్యమైనవి భారతీ శతకం, సరస్వతీ విలాసం, కొద్దిమొర్ర కువలయావళీ నాటిక మొదలైనవి. బైబిల్ మూడు సువార్తల్ని సవర భాషలోకి అనువదించారు. కేంద్ర సాహిత్య అకాడమీ వారి అభ్యర్థనపై తెలుగు సాహిత్య చరిత్రను ఇంగ్లీషులోకి అనువదించారు. '' తెలుగులో చంధోరీతులు' అనే గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి పురస్కారం లభించింది. ఆయనను ఆంధ్రవిశ్వకళా పరిషత్ కళా ప్రపూర్ణ బిరుదుతో గౌరవించింది. గిడుగు ఇంగ్లీషు రచనల్లోని విశిష్టతను గుర్తించి వాషింగ్టన్‌లోని అంతర్జాతీయ అకాడమీ డి.లిట్ ప్రదానం చేసింది. సీతాపతి రాసిన రచనలన్నీ ఒక ఎత్తు కాగా, బాలల కోసం సృష్టించిన సాహిత్యం మరొక ఎత్తు. ఈయన చిలకమ్మ పెళ్లి, ఎలుకా - పిల్లి, రైలుబండి, ఈగా-సాలీడు మొదలైన రచనలు 1907-1909 మధ్యకాలంలో 'వివేకవతి' పత్రికలో ప్రచురిత మయ్యాయి. ఆనాడు బాలగేయాలకు అసలు ఆదరణే వుండేది కాదు. రాతలు కాకుండా పిల్లలు మెచ్చేవి చిరకాలం మనసులో నిలిచే కథలు, కబుర్లు తేలిక భాషలో చెప్పాలనేవారు సీతాపతి. తర్వాత 1940 సంవత్సరంలో సీతాపతి "భారతి' సాహిత్య మాస పత్రికకు సంపాదకులై నప్పుడు బాలలకోసం ఉపయుక్త రచనలు చేయమని కవులకు, రచయితలకు ప్రబోధించారు. అలా ప్రేరేపితులైన, నూతనోత్సాహ భరితులైన కవులు, రచయితలు బాలల కోసం రాసిన గేయాల్ని



గేయకథల్ని, చిన్న కథల్ని 1955 సంవత్సరంలో 'బాలానందం' అనే అనే శీర్షికతో పుస్తకరూపంలో ముద్రించారు. 1958 సం.లో బాలవినోదం అనే గేయసంపుటాన్ని ప్రచురించారు. కేంద్ర ప్రభుత్వ సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన బాలసాహిత్య రచనాలయాల్ని నిర్వహించి యువ రచయితలకు శిక్షణ కూడా యిచ్చారు. ఎందరో, కవులకు రచయితలకు మార్గ దర్శకులయ్యారు. పల్నాటి యుద్ధం(1947), భక్తి మాల(1941), రైతు బిడ్డ(1939), పంతులమ్మ(1943), మాలపిల్ల (1938) తదితర తెలుగు సినిమాలలో నటించారు. ఆయన ఏప్రిల్ 19, 1969లో హైదరాబాదులో తుది శ్వాస విడిచారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## అలుపెరుగని పోరాట యోధుడు గౌతు లచ్చన్న - ఏప్రిల్ 19...సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి



భారత దేశంలో సర్దార్ లుగా పేరొందిన ప్రముఖులలో ఒకరు సర్దార్ వల్లభభాయి పటేల్. మరొకరు సర్దార్ గౌతు లచ్చన్న. ఒకరిది దేశస్థాయిలో, మరొకరిది రాష్ట్ర స్థాయిలో రాణించారు. సర్దార్ అంటే సేనాని. స్వాతంత్ర్యోద్యమ పోరాట వీరునిగా ఎన్నో ఉద్యమాలు నడిపిన కురువృద్ధుడు సర్దార్ గౌతు లచ్చన్న. జమీందారీ వర్గాల వ్యతిరేక పోరాట వీరునిగా ప్రజాహృదయాలలో లచ్చన్న స్థానం చెక్కు చెదరనిది. గౌతు లచ్చన్న (ఆగష్టు 16, 1909 - ఏప్రిల్ 19, 2006) సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్. సర్దార్ గౌతు లచ్చన్న, వి.వి.గిరి, నేతాజి సుభాష్ చంద్రబోస్, జయంతి ధర్మతేజ, మొదలగు అనేకమంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని, అనేక పర్యాయాలు జైలుకు వెళ్ళారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల రెడ్డి మంత్రివర్గంలో మంత్రి పదవి నిర్వహించిన లచ్చన్న, మద్యపాన నిషేధం విషయంలో ప్రకాశం పంతులుతో విభేదించి, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, ప్రకాశం ప్రభుత్వ పతనానికి కారణభూతుడయ్యారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు ప్రకటించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు నాటి ఉద్యమ నేత మర్రి చెన్నారెడ్డితో చేతులు కలిపారు. తెలంగాణా రాష్ట్ర అవసరాన్ని, ఔచిత్యాన్ని వివరిస్తూ పుస్తకం వ్రాశాడు. ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితి విధించినప్పుడు వ్యతిరేకించి, స్వేచ్ఛ కోసం పోరాడారు. చౌదరి చరణ్ సింగ్, జయప్రకాష్ నారాయణ, మసాని లతో కలిసి పనిచేశారు. తెలుగులో మంచి ఉపన్యాసకుడుగా, రాజాజి ఉపన్యాసాల అనువాదకుడిగా, చరిత్ర ముద్ర వేయించుకున్న బడుగువర్గ పోరాట యోధుడు లచ్చన్న. సర్దార్ గౌతు లచ్చన్న. ఉత్తర కోస్తా కళింగసీమలో ఉద్దానం ప్రాంతాన (నాటి గంజాం జిల్లా) సోంపేట తాలూకాలో బారువా అనే గ్రామంలో 1909 ఆగష్టు 16 వ తేదీన ఒక సాధారణ బీద గౌడ కుటుంబములో గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారు. బారువాలో గల ప్రాథమిక పాఠశాలలో 1916లో చేరి, పాఠశాలలో 8 వ తరగతి వరకు చదివి, ప్రక్కనే ఉన్న మందసా రాజావారి హైస్కూల్లో 9 వ తరగతిలో చేరి, పరీక్ష తప్పాడు. శ్రీకాకుళంలో ఉన్నత పాఠశాలలో చేర్పించగా, అక్కడ జగన్నాధం పంతులుగారి ఇంటిలో ఉండి చదువు సాగించారు. ఆ స్కూల్లో డ్రిల్ మాష్టారు నేమాని నరసింహమూర్తి శిక్షణలో జాతీయ భావాల్ని అలవర్చుకున్నారు. లచ్చన్నకు ఆనాటికి 21 సవంత్సరాలు. 1929-30 విద్యా సంవత్సరం మెట్రిక్యులేషన్ చదువుతుండగానే 21వ ఏట గాంధీజీ పిలుపువిని విద్యకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. 1930 లో మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపినిచ్చారు. దీనికి ప్రభావితుడైన లచ్చన్న బారువా సమీపంలో ఉన్న సముద్రపు నీరుతో ఉప్పు తయారుచేసి ఆ డబ్బుతో ఆ ఉద్యమాన్ని నడిపారు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొని అందరూ చూస్తుండగానే తన విలువైన దుస్తులను అగ్నికి అహుతి చేశారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంటున్నప్పుడు లచ్చన్నను అరెస్టు చేసి టెక్కలి, నరసన్నపేట సబ్ జైళ్లల్లో నలభై రోజులు ఉంచారు. కోర్టు తీర్పు మేరకు మరో నెల రోజుల శిక్షను అతను బరంపురం జైల్లో అనుభవించవలసి వచ్చింది. 1932 వ సంవత్సరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొంటున్న లచ్చన్నను రాజమండ్రి జైల్లో ఐదు మాసాలు ఉంచారు. అంటరానితనం నిర్మూలన. అంటరానితనం మీద కత్తి ఝుళిపించాడు లచ్చన్న. అతను నడిపిన హరిజన సేవా సంఘాలు, చేపట్టిన హరిజన రక్షణ యాత్రలు ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. బారువా గ్రామ వీధుల్లో యువజనులను వెంట వేసుకొని భజన గీతాలు పాడుతూ వెళుతుంటే గ్రామమంతా దద్దరిల్లుతున్నట్లు కనిపించేది. సవర్ణులలో ఆశ్చర్యం, హరిజనులలో ఆశలు రేకెత్తించేవి. రాత్రి పాఠశాలలు నిర్వహించి బడుగు వర్గాల విద్యాభివృద్ధికి అతనెంతో కృషి చేశాడు. హరిజనులకు దేవాలయాలలో ప్రవేశం కలిగించారు. లచ్చన్న చేసిన ఆర్థిక సహాయంతో కుశాగ్రబుద్ధులైన ఎందరో హరిజన విద్యార్థులు ఉన్నత స్థానాల నలంకరించారు. ఆచార్య గోగినేని రంగాతో లచ్చన్న స్నేహం రాష్ట్ర రాజకీయాలలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ గురు శిష్య సంబంధం లాంటిదే రంగా- లచ్చన్నల సంబంధం. 1935లో రాష్ట్రంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ శాఖ ఏర్పడినప్పుడు దానికి అతను సభ్యుడుగా ఎన్నికయ్యాడు. ఆ రోజుల్లో రైతు సంఘాలు కాంగ్రెస్ పార్టీలోని అంగాలే. 1939లో త్రిపురలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభ, కిసాన్ సభలను ఆంధ్రలోని పలాసాలో జరపాలని తీర్మానించారు. రాహుల్ సాంకృత్యాయన్ ఈ సభలకు అధ్యక్షత వహించారు. ఈ సభలు జయప్రదం కావడానికి ప్రధానకారకుడు లచ్చన్నే. దీనితో ఆయన పేరూ, ఆయన కార్యదీక్ష దేశమంతటా తెలిసింది. లచ్చన్న అనేక కిసాన్ ఉద్యమాలు నడిపి ఆ రోజుల్లో జమీందార్ల పక్కల్లో బల్లెంగా తయరైనారు. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న లచ్చన్నను ప్రభుత్వం అతి ప్రమాదకరమైన వ్యక్తిగా గుర్తించి, ఆయనను పట్టి యిచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతిని ప్రకటించింది. చివరకు ప్రభుత్వమే అతనిని బంధించి మూడేళ్ళు జైల్లో ఉంచి 1945 అక్టోబరులో విడుదల చేసింది. ఆనాటి నుంచి లచ్చన్న ఆంధ్ర అగ్రనాయకులలో ఒకరైనారు. 1947లో లచ్చన్న ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కు రాష్ట్ర శాఖ అధ్యక్షులయ్యారు. 1950లో ఆచార్య గోగినేని రంగా కృషి కార్ లోక్ పార్టీని స్థాపించినప్పుడు అందులో లచ్చన్న ప్రధాన పాత్ర పోషించాడు. 1953 అక్టోబరు 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. మద్రాసు ప్రభుత్వం నుంచి ఆంధ్రులకు రావలసిన ఆస్తుల విభజనను పరిశీలించడానికై ఏర్పడిన ఆంధ్రసంఘంలో కాంగ్రెస్ నుంచి నీలం సంజీవరెడ్డి, ప్రజా పార్టీ నుంచి తెన్నేటి విశ్వనాధం, కృషి కార్ లోక్ పార్టీనుంచి లచ్చన్న సభ్యులు. ప్రకాశం పంతులు మంత్రివర్గంలో, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గం లోనూ, లచ్చన్న మంత్రిగా పనిచేశారు. 1961లో రాజాజీ ఏర్పాటు చేసిన స్వతంత్ర పార్టీకి ఆంధ్రప్రదేశ్ శాఖకు సర్దార్ గౌతు లచ్చన్న అధ్యక్షుడు. 1978లో లచ్చన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అధికార ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నాడు. పబ్లిక్ అక్కౌంట్స్ ఛైర్మన్ గా ఆ రోజుల్లో పనిచేశారు. కొంతకాలం బహుజన పార్టీలో పనిచేసిన లచ్చన్న ఆ తరువాత అన్ని రాజకీయ పార్టీలతో తెగతెంపులు చేసుకుని, పార్టీలకు అతీతంగా బడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ వచ్చారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19 న కన్ను మూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



## ఉద్యానం.. నిర్వహణ అధ్వానం

పెద్దపల్లి : ఆహ్లాదకర వాతావరణం కోసం వెళ్లే ఉద్యానవనాలు అధ్వానంగా మారాయి. పట్టణాల్లో ఇళ్ల మధ్యన ఉన్న పార్కులను అభివృద్ధి చేసినప్పటికి నిర్వహణ లేక ఆహ్లాదం కరవవుతోంది. రూ.లక్షలు ఖర్చు చేసినా ఆట పరికరాలు, వస్తువులు పాడయ్యాయి. కొన్ని పురపాలికల్లో ఇప్పటికీ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వేసవి సెలవుల్లో పిల్లలను టీవీలు, చరవాణులకు అతుక్కుపోకుండా సాయంత్రం పూట పార్కులకు పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తుండగా అవి నిర్వహణ లేక ఇబ్బందికరంగా ఉంది.

**ఇదీ పరిస్థితి** రామగుండం నగరపాలిక పరిధిలో రూ.3.5 కోట్ల వ్యయంతో గౌతమినగర్, దుర్గానగర్, గంగానగర్, ఇందిరమ్మ కాలనీ, ప్రీకే రామయ్య కాలనీల్లో ఉద్యానవనాలు ఏర్పాటు చేసినప్పటికీ దుర్గానగర్, గౌతమి నగర్, టీచర్స్ కాలనీల్లో పూర్తి చేయగా ఇందిరమ్మ కాలనీ, ప్రీకే రామయ్య కాలనీల్లో నిరుపయోగంగా మారాయి. కొన్నింటిలో ఆట వస్తువులు శిథిలం కాగా, పచ్చదనం కనిపించదు. నిర్వహణ కోసం రూ.10 లక్షలు ఖర్చు చేసినా నీటి వసతి లేదు. టీచర్స్ కాలనీలో చెట్లు పెరగడంతో పాములు తిరుగుతున్నాయి.

పెద్దపల్లిలో మూడు పార్కులు ఉండగా మినీ ట్యాంక్ బండ్, చిల్డ్రన్ పార్కు బాగున్నాయి. క్రిస్టియన్ కాలనీలోని పిల్లల పార్కు 8 ఏళ్ల కిందట రూ.6 లక్షలతో నిర్మించారు. దీనిని ప్రారంభించకుండానే శిథిలమైంది. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 18 పార్కులు ఉన్నాయి. వీటికి రూ.7 కోట్లు కేటాయించారు. పద్మానగర్, బుట్టి రాజారాం కాలనీ, జ్యోతినగర్ శివ థియేటర్ దగ్గర అసంపూర్తి పనులు చేశారు. కొన్ని చోట్ల ఆట పరికరాలు విరిగిపోగా, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. న్యూశ్రీనగర్ కాలనీ, అలకాపురి, బ్యాంకు కాలనీ, జ్యోతినగర్, వావిలాలపల్లి, సప్తగిరి కాలనీ, మంకమ్మతోట, హౌసింగ్ బోర్డు కాలనీ, ఏవోఎస్ కాలనీ, జడ్పీ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో నిర్వహణ వదిలేశారు.

హుజూరాబాద్‌లో లవ్ హుజూరాబాద్ సిట్టింగ్ పాయింట్, మున్సిపల్ పార్కులో ఆడుకునే వస్తువులు పాడయ్యాయి. ఫౌంటెయిన్, కొలను పని చేయడం లేదు.జమ్మికుంటలో మొత్తం మూడు పార్కులుండగా పాత మున్సిపల్ ఉద్యానవనంలో విగ్రహాలు, బొమ్మలు, ఊయలలు విరిగిపోయాయి. జగిత్యాల పట్టణంలో రెండు పార్కులు ఉండగా రోటరీ పార్కుకు ఐదేళ్లలో రూ.కోటి వెచ్చించినా ఆట వస్తువులు పాడయ్యాయి. హౌసింగ్ బోర్డులో రూ.50 లక్షలు ఖర్చు చేసి ప్రహరీ, మొక్కలు ఏర్పాటు చేయగా జారుడు బల్ల తప్ప పిల్లలకు వేరే ఆట వస్తువులే లేవు.కోరుట్ల పట్టణంలో రెండు పార్కులుండగా పిల్లల పార్కును రూ.25 లక్షలతో అభివృద్ధి చేశారు. రూ.40 లక్షలతో వాగు స్థలంలో నాలుగేళ్ల కిందట పనులు ప్రారంభించగా మధ్యలో వదిలేశారు. ప్రస్తుతం పిల్లలు ఆడుకోవడానికి జూనియర్ కళాశాల మైదానం ఒక్కటే అందుబాటులో ఉంది.పరిశీలించిన నగరాలు: 2

పట్టణాలు : 7

మొత్తం పార్కులు : 46

అధ్వానంగా ఉన్నవి : 19

## భౌగోళిక గుర్తింపు దక్కేనా?

కరీంనగర్ : కరీంనగర్ జిల్లాలో ఉత్పత్తి అవుతున్న చేనేత వస్త్రాలకు ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు ఉంది. జిల్లాలో తువ్వాలలు, దుప్పట్లు, చీరలు, ధోవతులు, షర్టింగ్ వస్త్రాలు చేనేత సహకార సంఘాల్లో తయారీ అవుతున్నాయి. ఇక్కడ ఉత్పత్తి అయ్యే వస్త్రాలను టెస్కోతోపాటు ఇతర ప్రాంతాలకు కూడా సరఫరా చేస్తారు. ముఖ్యంగా ప్రతి శనివారం కరీంనగర్ నేతబజారులో విక్రయిస్తుంటారు.

జిల్లాలో ఉత్పత్తి అయ్యే డబుల్ క్లాత్ దుప్పటికి ప్రత్యేకత ఉంది. కరీంనగర్‌లోని రెండు ఆదర్శ సహకార సంఘాలు కొత్తపల్లి, హుజూరాబాద్ చేనేత సహకార సంఘాల్లో వీటిని ఉత్పత్తి చేస్తున్నారు. వీటిని చెద్దర్లుగా కూడా పిలుస్తారు. ఒక్కోటి అరకిలో బరువు ఉంటాయి. ఎక్కువ కాలం మన్నుతాయి. దాదాపు 12 ఏళ్ల వరకు వీటిని వినియోగించుకునే అవకాశముంది. మేలు రకమైన పత్తితో తయారు చేస్తుండటంతో మెత్తగా, నాణ్యతగా ఉంటాయి.


ఇవి రెండు వైపులా వస్త్రంతో తయారవుతాయి. వీటికి భౌగోళిక గుర్తింపు ట్యాగ్‌ను ఇవ్వాలని చెన్నైలోని కార్యాలయంలో దరఖాస్తు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పలు రకాల ఉత్పత్తులకు ట్యాగ్ కావాలని దరఖాస్తు చేయగా, అందులో కరీంనగర్ కూడా ఉంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే ఈ దుప్పటి తెలంగాణలోని ఏ జిల్లాలోనూ ఉత్పత్తి కావడం లేదు.జీఐ ట్యాగ్ ఇవ్వాలని జిల్లా చేనేత శాఖ ద్వారా మూడు నెలల కిందట ఒక నివేదికతో కూడిన దరఖాస్తులను సమర్పించినట్లు జిల్లా చేనేత శాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్ తెలిపారు. ట్యాగ్ వస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## ఉపాధి కూలీలకు గిట్టుబాటు

సారంగాపూర్ : జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు వేగవంతం చేశారు. 380 పంచాయతీల్లో పనులు కొనసాగుతున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూలీల వేతనాన్ని రూ.307కు పెంచడంతోపాటు కూలీలు తప్పకుండా పనులకు వెళ్లాలన్న నిబంధనలతో జాబ్ కార్డు కలిగినవారంతా పనులకు వెళ్తున్నారు. వారికి కూలి గిట్టుబాటు అయ్యేలా చూడాలని అధికారులు ఉపాధి సిబ్బందిని ఆదేశిస్తున్నారు.

పెరిగిన సంఖ్య గ్రామాల్లో ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులకు వెళ్లే వారి సంఖ్య పెరిగింది. జిల్లాలో 1,65,700 కుటుంబాలు జాబ్‌కార్డులు కలిగి ఉండగా ఆయా కుటుంబాలలో 1,97,962 (పురుషులు-1,33,822, మహిళలు-1,64,140) మంది కూలీలు ఉన్నారు. ఆయా కుటుంబాలకు ఏడాదిలో 100 రోజులు తప్పకుండా పనులు కల్పించేందుకు ఇప్పటి నుంచే అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 15 రోజుల్లోనే 5.07 కుటుంబాలకు పనులు చూపించారు. ఆయా కుటుంబాలలో సగటున ప్రస్తుతం రూ.249.49 వేతనం చెల్లించారు. 10 పనులు ఇప్పటికే పూర్తి చేయగా, 12,465 పనులు కొనసాగుతున్నాయి. అత్యధికంగా మేడిపల్లి మండలంలో రూ.297.21 వేతనాన్ని చెల్లించగా, అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో రూ.164.49 మాత్రమే చెల్లించారు. కనీస గిట్టుబాటు కల్పించేలా ఉపాధి సిబ్బంది కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామం నుంచి అయిదు కిలోమీటర్ దూరం వెళ్లిన కూలీలకు అదనంగా చేసిన కూలీకి అదనంగా 10శాతం చెల్లిస్తున్నారు. దీనివల్ల కొడిమ్యాల మండలంలో ఒక్కో కూలీకి ప్రభుత్వం అందించే కూలీ కలుపుకుని రూ. 320.63 రావడం విశేషం. వివరాలకు ప్రత్యేక యాప్ కేంద్రం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టినప్పటికీ ఎక్కడో ఓచోట అవకతవకలు జరుగుతూనే ఉన్నాయి. కూలీలు, పనుల వివరాలు, వేతనాలు జమ తెలుసుకునేందుకు నానావస్థలు పడాల్సి వస్తోంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని కేంద్రం కూలీల కోసం ప్రత్యేకంగా 'జన్‌మన్‌రేగా' అనే యాప్‌ను అందుబాటులో ఉంచింది. ఈ యాప్ తెలుగుతోపాటు ఇతర భాషల్లోనూ ఉంటుంది. రాష్ట్ర, జిల్లా, పంచాయతీ, కుటుంబం, జాబ్ కార్డు సంఖ్య నమోదు చేసుకోవాలి. దీనిద్వారా ఎన్ని పనిదినాలు చేశారు.. ఏ బ్యాంకులో నగదు జమ అయిందో వివరాలు కనిపిస్తాయి. ప్రస్తుతం ఆత్మీయ భరోసాకు కనీసం 20 రోజుల పనిదినాలు పూర్తి చేయాలన్న నిబంధన ఉండడంతో కూలీ దినాలు పూర్తి చేసిన వివరాలు తెలుసుకునేందుకు ఎంతగానో యాప్ ఉపయోగ పడనుంది.

# మధ్య మానేరులో 7.17 టీఎంసీల నిల్వ



బోయినపల్లి : రాజరాజేశ్వర జలాశయం(మధ్యమానేరు) నుంచి నీటి విడుదల నిలిచిపోయింది. యాసంగిలో పంటల సాగు కోసం మధ్యమానేరు జలాశయం నుంచి దిగువన ఎల్ఎండీ, కుడి, ఎడమ కాలువతోపాటు, మల్కపేట రిజర్వాయర్‌కు నీటిని తరలించారు. ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడం, పంట కోతలు ప్రారంభం కావడంతోపాటు మిషన్ భగరీథ తాగు నీటి అవసరాల దృష్ట్యా నీటి విడుదలను నిలిపివేశారు. జలాశయంలో ప్రస్తుతం నీటి నిల్వ 7.17 టీఎంసీలకు చేరింది. బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద 27.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన రాజరాజేశ్వర జలాశయం పంటల సాగులో అన్నదాతలకు ప్రధాన ఆదరువుగా మారింది. జలాశయం నుంచి దిగువన ఎల్ఎండీ జలాశయం, కుడి, ఎడమ కాలువలతోపాటు అన్నపూర్ణ జలాశయం, మల్కపేట రిజర్వాయర్, వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం గుడి చెరువు, మిషన్ భగీరథకు నీరు వెళ్తుంది. జలాశయానికి ప్రధానంగా ఎస్సారెస్పీ, కాళేశ్వరం, ఎల్లంపల్లి, మానేరు, మూలవాగుల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో ఆధారం. యాసంగిలో ఎల్ఎండీ జలాశయం, మధ్యమానేరు జలాశయం కుడి కాలువ కింద ఆయకట్టు పంటలకు నీరు అందించాలని అధికారులు నిర్ణయించారు. ఎల్ఎండీ జలాశయానికి 16 టీఎంసీలు, కుడి కాలువకు 6 టీఎంసీల నీటిని వదలాలని అక్కడి అధికారులు కోరారు. వరి నాట్లు, ఇతర పంటల సాగు ప్రారంభమైననాటి నుంచి రైతుల అవసరాల మేరకు నీటి విడుదల ప్రారంభించారు. కుడి కాలువ కింద సుమారు 60 వేలు, ఎడమ కాలువ కింద సుమారు 4 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని అధికారులు పేర్కొన్నారు.

**71.082 టీఎంసీల ఇన్‌ఫ్లో 69.315 అవుట్‌ఫ్లో**

జలాశయానికి 1 జూన్ 2024 నుంచి 71.082 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఇందులో ఎల్లంపల్లి నుంచి 23.816 టీఎంసీలు, ఎస్సారెస్పీ 31.266, మానేరు మూలవాగు నుంచి 16.040 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఇదే సమయంలో జలాశయం నుంచి దిగువన ఎల్ఎండీ జలాశయానికి 40.245 టీఎంసీలు అన్నపూర్ణ జలాశయానికి 20.766, మల్కపేట రిజర్వాయర్‌కు 0.160, కుడి కాలువకు 3.905 ఎడమ కాలువకు 0.018, మిషన్ భగీరథ (ఈవీపీ కలిపి) 4.221 టీఎంసీల నీరు వదిలారు.

**తాగునీటి అవసరాలకు**

పంట కోతలు ప్రారంభం కావడంతో జలాశయం నుంచి నీటి విడుదలను నిలిపివేశాం. జలాశయంలో ప్రస్తుతం 7.17 టీఎంసీల నీరు నిల్వ ఉంది. యాసంగిలో పంటలకు ఎల్ఎండీ, కుడి కాలువతో పాటు ఎడమ కాలువ, మల్కపేట రిజర్వాయర్‌కు నీటిని తరలించాం. మిషన్ భగీరథ తాగు నీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. జలాశయానికి ఇన్‌ఫ్లో ప్రారంభమైతేనే నీటి విడుదల ఉంటుంది.

జగన్, ఈఈ మధ్యమానేరు

# రెండో వంతెన పూర్తయ్యేనా!



వేములవాడ : వేములవాడ మూలవాగులో అసంపూర్తి రెండో వంతెన నిర్మాణం పనులకు గత నెలలో తిరిగి భూమి పూజ చేసినప్పటికీ ఇంకా పనులు ప్రారంభం కాలేదు. ఎప్పుడు మొదలవుతాయనే అనుమానాలను పట్టణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం ఆరంభంలో పనులు మొదలు పెడితే భారీ వర్షాలకు గతంలో లాగే మళ్లీ కొట్టుకు పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఈ వంతెన నిర్మాణం పనులు గత రెండేన్నరేళ్లుగా వివిధ కారణాలతో అసంపూర్తిగా నిలిచి పోయాయి. ఇరువైపులా భూసేకరణ చేసి పరిహారం అందించేందుకు రూ.6.96 కోట్లతో పాటు వంతెన నిర్మాణ పనులకు మరో రూ.3 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని మూలవాగుపై రెండు వంతెనల నిర్మాణాలతో పాటు ఇరువైపులా సుందరీకరణ పనులు చేపట్టడానికి అప్పటి ప్రభుత్వం 2015 సంవత్సరంలో రూ.28 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో వంతెనల నిర్మాణానికి రూ.12 కోట్లను కేటాయించారు. దీంతో పనులు చేపట్టిన గుత్తేదారు మూలవాగుపై పడమరవైపు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. రెండో వంతెన నిర్మాణం పనులు మొదలు పెట్టినప్పటికీ భారీ వర్షాల కారణంగా, ఇతర బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా వంతెన నిర్మాణంలో పనులు ఆగుతూ సాగుతూ చివరికి నిలిచి పోయాయి. రెండో వంతెన నిర్మాణం చేపట్టినప్పటి నుంచి మూడు సార్లు భారీ వర్షాలకు సెంట్రింగ్ కొట్టుకుపోయి నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడింది.

**మళ్లీ ఇబ్బందులు తప్పవా..**

మూలవాగులో చేపట్టిన రెండు వంతెనల నిర్మాణం పనులు అగ్రిమెంట్ ప్రకారం 2018 సంవత్సరంలోనే పూర్తి కావాల్సి ఉంది. మొదటి వంతెన సకాలంలో పూర్తయినప్పటికీ రెండో వంతెన నిర్మాణంలో ప్రతి ఏటా అంతరాయం ఏర్పడింది. రెండో స్టాండ్ భీమ్‌ల నిర్మాణం సమయంలో భారీ వర్షాలకు కుంగి పోయాయి. ఆ తరువాత రెండు సార్లు భారీ వర్షాలకు సెంట్రింగ్ కొట్టుకుపోయింది. తరువాత సెంట్రింగ్ పైపులు కొట్టుకు పోయి భీములు వంగి పోయాయి. దీంతో గుత్తేదారు పెద్ద ఎత్తున నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. తిరిగి ఆయా పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇటీవల భూమిపూజ చేశారు. వర్షాకాలం రాక ముందే అధికారులు పనులు మొదలు పెట్టి నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

**వినూత్న డిజైన్**


వేములవాడ మూలవాగుపై రెండు వంతెనల నిర్మాణాలు ఆధ్యాత్మికత ఉట్టి పడేలా డిజైన్ చేశారు. 12 మీటర్ల వెడల్పు, 190 మీటర్ల పొడవుతో రెండు వంతెనల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో పడమర వైపు వంతెన నిర్మాణం పూర్తయి వినియోగంలోకి రాగా రెండో వంతెన నిర్మాణం పనులు పూర్తి చేయాల్సి ఉంది.

**త్వరలోనే మొదలు**

మూలవాగులోని రెండో వంతెన నిర్మాణ పనులు త్వరలోనే మొదలవుతాయి. నిర్మాణ పనుల యంత్రాలు గుజరాత్ నుంచి రావాల్సి ఉంది. అవి రాగానే ప్రారంభిస్తాం. భారీ వర్షాలు కురిసినా పనులకు ఎలాంటి ఆటంకాలు ఉండవు. అగ్రిమెంట్ ప్రకారం వంతెన నిర్మాణం పనులు పూర్తవుతాయి. ఈమేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. శాంతయ్య, డీఈ ఆర్అండ్‌బీ

# 'తలలు పట్టు'కొంటున్నారు

హైదరాబాద్: మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పోచారం పురపాలక సంఘం పరిధిలో ఓ ప్రముఖ వ్యక్తి వేసిన లేఅవుట్‌లో ఒక చిరుద్యోగి సుమారు 200 గజాల స్థలం కొనుగోలు చేశారు. లేఅవుట్‌కు అనుమతి లేకపోవడంతో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేశారు. పరిశీలించిన సిబ్బంది రిజిస్ట్రేషన్ ఛార్జీలు, 14 శాతం ఓపెన్ స్పేస్ రుసుములు అన్నీ కలిపి రూ.3.36 లక్షలు చెల్లించాలని, 25 శాతం రాయితీ మినహాయిస్తే రూ.2.78 లక్షలు అవుతుందని నోటీసులు జారీ అయ్యాయి. రంగారెడ్డి జిల్లా జల్‌పల్లి పురపాలక సంఘం పరిధిలో ఒక వ్యక్తి 1000 గజాల స్థలం కొనుగోలు చేశారు. దీనికి అన్నీ కలిపి రూ.1.88 లక్షలు చెల్లించాలని, 25 శాతం రాయితీ మినహాయిస్తే రూ.1.46 లక్షలు చెల్లిస్తే సరిపోతుందని నోటీసులు ఇచ్చారు. అయితే ఈ రుసుములు.. 1000 గజాల స్థలానికి తక్కువ వేయడం.. 200 గజాల స్థలానికి ఎక్కువ వేయడంతో దరఖాస్తుదారులు అయోమయానికి గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ గడువు ఈనెల 30 వరకు పెంచింది. 25 శాతం రాయితీ ప్రకటించినా ప్రభుత్వానికి ఆశించిన ఆదాయం రావడం లేదు. మొత్తం మీద రూ.2,230 కోట్ల వరకు ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తే ఇప్పటివరకు రూ.306.30 కోట్లే వచ్చాయి. రిజిస్ట్రేషన్



రుసుములతోపాటు 14 శాతం ఓపెన్ స్పేస్ రుసుములు కలిపి రూ.లక్షల్లో ఉంటున్నాయి.


**సిబ్బంది హస్తలాఘవం**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో కొంతమంది సిబ్బంది హస్తలాఘవం ప్రదర్శిస్తున్నారు. ఎక్కువ శాతం ఒప్పంద ఉద్యోగులు వీటిని పరిశీలిస్తున్నారు. ఎమ్మార్వోలు, పురపాలకశాఖ కమిషనర్ల లాగిన్‌లు వీరి చేతుల్లోనే ఉండటమే కారణం. ఇష్టానుసారం నోటీసులు పంపి పునఃసమీక్ష కోరిన వారితో బేరసారాలు కుదుర్చుకుంటున్నారు. రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిసింది.

# రాయితీ విత్తనాలపై రైతుల ఆశలు

జగిత్యాల : విత్తన రాయితీని పునరుద్ధరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్నా గడిచిన వానాకాలం, యాసంగిల్లో అమలు చేయలేదు. వచ్చే వానాకాలం నుంచి విత్తనాలను ఇస్తామని తాజాగా వ్యవసాయ శాఖామంత్రి ప్రకటించటం రైతులకు ఆశగా మారింది. ఐతే వానాకాలం సీజన్‌కు విత్తనాలను ఇవ్వాలంటే ఇప్పటి నుంచే మేలైన వంగడాలను ప్రభుత్వం సేకరించి సరఫరాకు సిద్ధం చేయాల్సి ఉంటుంది.ఇప్పటి నుంచి చర్యలు చేపడితేనే లబ్ధి

రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల పంటల విత్తనాలను 50 శాతం రాయితీపై ఇవ్వగా ఏడేళ్ల క్రితం అన్నిపంటల విత్తనాల సరఫరాను నిలిపివేసి కేవలం జనుము, జీలుగ విత్తనాలను మాత్రమే అత్యంత పరిమితంగా రాయితీపై ఇస్తోంది. దీంతో రైతులు బయటి మార్కెట్లో ప్రైవేటు విత్తనాలను పూర్తి ధరకు కొని ఆర్థిక భారానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగా కూరగాయలు సహా అన్నిరకాల పంటలను రాయితీపై అందిస్తే రైతులకు ఆర్థిక ఆసరాగా ఉంటుంది. జిల్లాలో వానాకాలంలో 4.32 లక్షల ఎకరాల్లో రైతులు అన్నిరకాల పంటలను సాగు చేస్తారు. ఇందులో వరిసాగే 2.92 లక్షల ఎకరాలుగా ఉండనుండగా గతంలో మాదిరిగా తెలంగాణ విత్తన, జాతీయ విత్తన



కంపెనీ ద్వారా, జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా విత్తనాలను రాయితీపై ఇవ్వాల్సి ఉంది. ఇందుకు ఇప్పటి నుంచే రైతుల నుంచి విత్తనాలను సేకరించి నిల్వ చేస్తేనే వానాకాలంలో రాయితీపై సరఫరా సాధ్యపడుతుంది.జిల్లాలో అన్నిపైర్ల సాగు విస్తీర్ణాన్నిబట్టి రూ.100 కోట్ల వరకు వెచ్చిస్తుండగా గతంలో మాదిరిగా ప్రభుత్వం 50 శాతం రాయితీని పునరుద్ధరిస్తే రూ.50 కోట్ల వరకు జిల్లా రైతులకు ఆర్థిక లబ్ధి కలుగుతుంది. సర్కారు సరఫరాతో మేలైన విత్తనాలు తక్కువ ధరలు అందుబాటులోకి వస్తాయి, ప్రైవేటు కంపెనీల విత్తనాల ధరలు కూడా దిగివస్తాయి కాబట్టి సర్కారు విత్తన రాయితీపై రైతులు ఆశగా ఉన్నారు. కంపెనీలను బట్టి 5 కిలోల మొక్కజొన్న విత్తన ప్యాకెట్‌కు రూ.350 నుంచి రూ.2,500 వరకు ధరుండటంతో రైతులు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అలాగే మిరప, కూరగాయల ధరలు కిలోకే రూ.వేలల్లో ఉంటున్నాయి. కొన్నేళ్లుగా ప్రభుత్వ సరఫరా లేనందున విత్తనాల ధరల నిర్ణయం కంపెనీల ఇష్టానుసారం మారి విత్తనాల ధరలు నాలుగింతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాయితీపై విత్తనాలిస్తే కంపెనీలు కూడా ధరను తగ్గిస్తాయి.

## మూలకు పడి.. మూడేళ్లు..!

నల్గొండ: జిల్లాలోని కనగల్ మండలంలో ఉన్న తేలకంటి గూడెం, జి.యడవెల్లి తాగునీటి ప్రాజెక్టులు.. దశాబ్దాల క్రితం వేలాది గొంతుకల దాహార్తిని తీర్చాయి. రూ.20 కోట్లు వెచ్చించి ఇంటింటా శుద్ధ నీటిని అందించిన ఈ తాగు నీటి కేంద్రాలు నేడు నిరుపయోగంగా మారాయి. మూడేళ్ల నుంచి ఈ రెండు ప్రాజెక్టులు నిరుపయోగంగా మారడంతో ప్రస్తుతం నల్గొండలోని పానగల్ తాగునీటి శుద్ధి కేంద్రం నుంచి నీటిని ఈ మండలాలకు అందించాల్సిన పరిస్థితి వచ్చింది. ఫ్లోరైడ్ పీడిత గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

2007వ సంవత్సరంలో రూ.10 కోట్లతో నిర్మించిన తేలకంటి గూడెం నీటి శుద్ధి కేంద్రం ద్వారా నిడమనూరు, హాలియా, పెద్దవూర, కనగల్, నల్గొండ మండలాలకు తాగు నీటిని సరఫరా చేసే వారు. మరో రూ.10 కోట్లతో జీ.యడవెల్లి ప్రాజెక్టును అదే సమయంలో నిర్మించారు. ఈ ప్రాజెక్టు నుంచి కనగల్, చండూరు, మర్రిగూడ మండలాల పరిధిలో 73 గ్రామాలకు ఫ్లోరైడ్ రహిత రక్షిత మంచినీటిని అందించే వారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం-నాబార్డు ఆర్థిక సాయంతో సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకాలను 2006లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది.

కనగల్ మండలంలోని తేలకంటిగూడెం ప్రాజెక్టు పరిధిలో ఐదు మండలాల్లోని 110 గ్రామాలకు, జి.యడవల్లి ప్రాజెక్టు మూడు మండలాల్లోని 73 గ్రామాలకు తాగు నీటిని అందించాయి. తేలకంటి గూడెం వద్ద ఉన్న మహిళ సముద్రం చెరువు, జి.యడవల్లి వద్ద ఉన్న యడవల్లి చెరువుల్లో నీటి లభ్యత లేకపోవడం ప్రధాన కారణమని



సంబంధిత అధికారులు చెబుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ కింద ఇంటింటా పైప్‌లైన్లు వేయడం, నల్గొండ నుంచి నేరుగా ఈ గ్రామాలకు నీళ్లు రావడంతో ఈ ప్రాజెక్టు నిర్వహణను ప్రభుత్వ యంత్రాంగం గాలికి వదిలేసింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇందులో ఉన్న మోటార్లు, పంపులు, ఇతరత్రా వస్తు సామగ్రిని దొంగలు అపహరించి సొమ్ము చేసుకుంటున్నారు. మిషన్ భగీరథ పథకం రాకతో ఈ రెండు ప్రాజెక్టుల వద్ద నీటిని తోడే పంపులు ఫిల్టర్ బెడ్స్ వద్ద వృథాగా మారాయి. దీంతో కొందరు దొంగలు వీటిని అపహరించారు. పలుమార్లు తేలకంటి గూడెం ఫిల్టర్ బెడ్‌లలో మూడు మోటార్లతో పాటు సామగ్రి కూడా మాయమయ్యాయి. ట్యాంకు పరికరాలు, ఇతర వస్తువులను సైతం మాయం చేశారు.ఇటీవలే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కనగల్ మండల కేంద్రంలో పర్యటించినప్పుడు ఈ ప్రాజెక్టుల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు అతీగతీ లేకుండా పోయింది.

# అసైన్డ్ భూములా.. ఇళ్లు కట్టేసుకుందాం

హైదరాబాద్ : శంషాబాద్ విమానాశ్రయం.. బెంగళూరు జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు.. అసైన్డ్ స్థలాలు కనిపిస్తే చాలు... అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. తాజాగా శంషాబాద్ మండలంలోని మదనపల్లి గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 8లో 100 ఎకరాల అసైన్డ్ భూముల్లో 60 ఎకరాలకుపైగా ఆక్రమించుకున్నారు. అసైనీలను బెదిరించి వారిపేరుమీద మార్పించుకున్నారు. అనంతరం తప్పుడు పత్రాలు సృష్టించి మా భూములేనంటూ లే-అవుట్లు వేశారు. కొన్నిచోట్ల భారీ నిర్మాణాలు చేపట్టారు. అడ్డుకునే గ్రామస్థులను బెదిరిస్తున్నారు. కబ్జాల విలువ రూ.300 కోట్లు ఉ ంటుందని స్థానికులు చెబుతున్నారు.

**అప్పట్లో వ్యవసాయానికి..**

40 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం మదనపల్లి, పెద్దషాపూర్ గ్రామాలకు చెందిన 50మంది పేద కుటుంబాలకు మదనపల్లి సర్వేనంబర్ 8లో



100 ఎకరాలను వ్యవసాయం కోసం ఇచ్చింది. వర్షాధార పంటలను పండించి కొన్నేళ్ల తర్వాత వదిలేశారు. పదేళ్ల నుంచి అక్కడ రియల్ వెంచర్లు వెలుస్తుండడంతో కొందరు ముచ్చింతల్, పెద్దషాపూర్ ప్రాంతాల్లో రియల్ వెంచర్లపై దృష్టి కేంద్రీకరించారు. మదనపల్లి గ్రామంలోని సర్వేనంబర్ 8పై పడింది. నెలల వ్యవధిలో కొందరు అసైనీలను ప్రలోభపెట్టి వారి వద్ద నుంచి ఎకరాల చొప్పున కొన్నారు. అనంతరం లే-అవుట్లుగా మార్చి స్థలాలు విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**ఇంటి నంబర్లు.. విద్యుత్తు..**

లేఅవుట్లకు ఆనుకొని ఉన్న గర్వోనికుంట, పోషమోని కుంటల భూములను కలుపుకొని రోడ్లు వేసి ఇళ్ల స్థలాలుగా మార్చేశారు. పంచాయతీ, విద్యుత్తు శాఖల అధికారులు ఇంటి నంబర్లు, విద్యుత్తు మీటర్లను కేటాయించారు. పైగా మదనపల్లి గ్రామమంతా 111 జీవో పరిధిలోకి వస్తుంది. నిబంధనలు ఉల్లంఘించి పొలాల్లో లే-అవుట్లకు ఇంటి నంబర్లు కేటాయించినా.. విద్యుత్ మీటర్లు బిగించినా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు.

# నిధుల మంజూరు సరే.. పనుల ప్రారంభమేదీ!

కోనరావుపేట : గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించడంలో భాగంగా ప్రభుత్వం బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టింది. వాగుల వద్ద ఇబ్బందులు లేకుండా లోలెవల్ కల్వర్టులను, కాజ్‌వేలను నిర్మించింది. జిల్లాలో గతంలో కురిసిన భారీ వర్షాలకు చాలాచోట్ల లోలెవల్ కల్వర్టులు కొట్టుకుపోయాయి. హైలెవల్ వంతెన నిర్మాణాలకు నిధులు మంజూరైనా పనుల ప్రారంభానికి మోక్షం లభించడం లేదు. దీంతో రవాణా కష్టాలు తొలగేలా లేవని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.4.10 కోట్లు మంజూరు**

కోనరావుపేట మండలం కొలనూర్-రామన్నపేట గ్రామాల మధ్య ప్రధాన రోడ్డులోని లోలెవల్ కల్వర్టు మూడేళ్ల క్రితం పెద్ద చెరువు మత్తడి వరద తాకిడికి కోతకు గురైంది. కల్వర్టు పగుళ్లుబారి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు, ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.90 కోట్లు మంజూరు చేసింది. మంగళ్లపల్లి-సుద్దాల మలుపు రెండు వరసల తారు రోడ్డు వరకు కిలోమీటర్ ప్రధాన రోడ్డు ప్రతిఏటా వర్షాకాలంలో గుంతలమయంగా మారి ప్రయాణం ప్రశ్నార్థకంగా మారుతోంది. దశాబ్దకాలంగా నిధుల మంజూరుకు మోక్షం లభించ లేదు. ఎట్టకేలకు ఆరు నెలల క్రితం తారురోడ్డు నిర్మాణానికి రూ.1.30 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. మల్కపేటలో కాళేశ్వరం రిజర్వాయర్ కట్టపై రామాలయం నుంచి రెండు వరసల తారు రోడ్డు వరకు సుమారు 800 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.90 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆయా నిర్మాణ పనులకు పరిపాలన



అనుమతులు లభించగా నవంబర్ మాసంలో శంకుస్థాపన చేశారు. నేటికీ పనులు ప్రారంభం కాలేదు.

**మూడేళ్లుగా ప్రమాదకర ప్రయాణం**

రోడ్డు సక్రమంగా లేకపోవడంతో సుద్దాల, మంగళ్లపల్లి, లింగంపల్లి, నాగారం, పల్లిమక్త తదితర గ్రామాల వారు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఇబ్బందులు తప్పడం లేదు. రామన్నపేట, కొలనూర్ గ్రామాల రైతులు వ్యవసాయ పంట ఉత్పత్తులు ధాన్యం, పత్తి, మిర్చి, కూరగాయలను మిల్లులకు, సిరిసిల్లకు తరలించటం ప్రశ్నార్థకంగా మారింది. శిథిలమైన లోలెవల్ కల్వర్టులపై ఏ వాహనం ఎప్పుడు కూరుకుపోతుందో తెలియని దుస్థితి నెలకొంది. తడకమడ్ల లక్ష్మారెడ్డి, రామన్నపేట

**గుత్తేదారు ఖరారు ప్రక్రియ పూర్తి**

ఆయా నిర్మాణ పనులకు గుత్తేదారుల ఖరారు ప్రక్రియ ఇటీవలె ముగిసింది. నాలుగైదు రోజుల్లో అగ్రిమెంటు పూర్తి కానుంది. త్వరలోనే పనులను ప్రారంభించి సకాలంలో పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకుంటాము. పవనకుమారి, పీఆర్ డీఈ చందుర్తి.

# నేటికీ.. గొలుసు కొలతలే దిక్కు!



వికారాబాద్: వికారాబాద్ జిల్లా ఏర్పడి తొమ్మిదేళ్లు దాటినా సర్వేశాఖ సేవలు గాడిన పడటం లేదు. నేటికీ సర్వేయర్లు గొలుసు కొలతలపైనే ఆధారపడి విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు మంజూరైన డీజీపీఎస్, ఈటీఎస్ లాంటి ఆధునిక పరికరాలు జిల్లాలో అందుబాటులోకి రాకపోవడం సత్వర సేవలకు ఆటంకంగా మారింది.

**2008లో డిజిటల్ రూపంలోకి మార్పు**

సర్వేశాఖ పరిభాషలో ఒక సర్వే నంబరులోని భూమి విస్తీర్ణం మేరకు నాలుగు వైపులా హద్దులు నిర్ణయించి రూపొందించిన పటాన్ని టిపన్‌గా వ్యవహరిస్తారు. వీటిని 2008లో స్కాన్ చేసి డిజిటల్ సమాచారం రూపంలో కంప్యూటర్లలో భద్రపరిచారు. జిల్లాలోని సర్వే పరిస్థితుల దృష్ట్యా 2 డివిజన్లకు ఇద్దరు డివిజన్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. జిల్లాలోని 20 మండలాలకు ఒక సర్వేయర్ చొప్పున 20 మందికి 13 పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. డీజీపీఎస్, ఈటీఎస్ లాంటి పరికరాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నప్పటికీ, సర్వే సిబ్బంది మాత్రం నేటికీ గొలుసులతోనే వెళ్లదీస్తున్నారు.

ఇప్పటివరకు కేవలం 18 వేల దరఖాస్తుల పరిష్కారం: జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి 9 వేల ఎకరాల భూసేకరణ కోసం సర్వే జరిగింది. ఇప్పటి వరకు 18 వేల సర్వే దరఖాస్తులను పరిష్కరించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,450 దరఖాస్తులు పరిష్కరించగా, వీటిలో 550, డివిజన్ స్థాయిలో పరిష్కారం కోసం దరఖాస్తు చేసినవి మరో 640 పెండింగులో ఉన్నాయి. ఒక్కో మండలం నుంచి సగటున నెలకు 50 వరకు దరఖాస్తులు వస్తుండగా, 45 రోజుల్లో పరిష్కరించలేక తీవ్ర జాప్యం జరుగుతోంది.

పరికరాల అవసరంపై ఉన్నతాధికారులకు నివేదించాం.. - ఎం.రాంరెడ్డి, జిల్లా భూ సర్వే, కొలతల సహాయ సంచాలకుడు, వికారాబాద్.

ఈ ఏడాది ఇప్పటి వరకు సర్వే నిమిత్తం 2,640 దరఖాస్తులు అందాయి. వీటిని పరిష్కరించడంలో జాప్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.ఆధునిక పరికరాల కొరత, జిల్లాలోని సర్వే పరిస్థితులు, ఆధునిక పరికరాల ఆవశ్యకత గురించి ఉన్నతాధికారులకు నివేదించాం.

**ఇదీ సమాచారం**

జిల్లా విస్తీర్ణం.. 10.6 లక్షల ఎకరాలు
మొత్తం మండలాలు.. 20
సర్వేకు మండలాల విభజన.. 2 డివిజన్లు
సర్వే నంబర్లకు టిపన్లు.. 10 లక్షలు
వీటిలో శిథిలం.. 58,883
ప్రస్తుతం అందుబాటు.. 97,0223

# అత్తింటి కార్డుల్లో అల్లుళ్ల పేర్లు.. గందరగోళంగా జారీ ప్రక్రియ



చొప్పదండి : ఏళ్లుగా రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ లేకపోవడంతో నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల కిందట అర్హుల నుంచి నూతన కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించింది. సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా క్షేత్ర స్థాయిలో అర్హులను గుర్తించి లబ్ధిదారుల జాబితాను అధికారులు ప్రకటించారు. ఈ జాబితాలో ఉ న్న వారు మీసేవా కేంద్రాలలో దరఖాస్తులు చేసుకోవద్దని అధికారులు చెప్పడంతో నూతన కార్డులు వచ్చినట్లేనని ఆనందపడ్డారు. కానీ అధికారులు ప్రకటించిన జాబితాలో కొందరి లబ్ధిదారుల పేర్లు గందరగోళంగా మారడంతో ఆందోళనకు గురవుతున్నారు.

ప్రజాపాలన, సమగ్ర కుటుంబ సర్వేల్లో భాగంగా దరఖాస్తులు సమర్పించిన వారిలో 45 వేల మందిలో కొందరికి ఇలాంటి పరిస్థితి ఎదురైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పెళ్లైన మహిళలు తమ పేర్లను తల్లిగారి ఇంటి నుంచి తొలగించుకుని భర్తతో నూతన రేషన్ కార్డులు కావాలని తమ చిన్నారులతో సహా దరఖాస్తులు అందజేశారు. నూతనంగా పేర్లు జత చేసుకునే వారి ఆధార్‌కార్డు ఆధారంగా వారి పాత రేషన్‌కార్డులలో కుటుంబం మొత్తం పేర్లు నమోదయ్యాయి. కొత్త కార్డు కోసం యువకులు తమ పేర్లను తల్లిదండ్రుల కార్డుల నుంచి తొలగించుకుని దరఖాస్తు చేసుకోవడంతో వీరి పేర్లు సైతం తమ భార్య వాళ్ల తల్లిగారి రేషన్‌కార్డులో తమ చిన్నారులతో సహా నమోదయ్యాయి. దీంతో పేర్లను సవరించాలని వారు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పేర్లను తొలగించాలని కోరుతూ దరఖాస్తులను సమర్పిస్తున్నారు.

గతంలో రెవెన్యూ అధికారులకు రేషన్‌కార్డు జారీపై లాగిన్ ఇవ్వడంతో ప్రక్రియ మొత్తం సవ్యంగా సాగేది.. కానీ పంచాయతీలకు, పురపాలికలకు ఈ ప్రక్రియను అనుసంధానించడంతో ఇలాంటి పరిస్థితి ఎదురైందని విమర్శలు వినిపిస్తున్నాయి.

చొప్పదండి మండలంలోని చిట్యాలపల్లిలో 47 రేషన్‌కార్డులను మంజూరు చేశారు. ఇందులో మూడేళ్ల చిన్నారి ఎన్నం మనుశ్రీకి రేషన్‌కార్డు మంజూరైంది. ఆమె తల్లిదండ్రులు మల్లేశం, శ్యామల పేర్లు లేకుండా ఒక్క చిన్నారికి రేషన్‌కార్డు ఇచ్చారు. ఆ తర్వాత తప్పిదాన్ని గుర్తించి మళ్లీ చిన్నారి పేరును ఆమె తల్లిదండ్రులతో జతచేశారు.

**పరిశీలించి.. సరి చేస్తాం**

చిన్నారులు, అల్లుళ్ల పేర్లు నమోదైన రేషన్‌కార్డులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నాం. ఇప్పటికే కొన్ని తప్పులను సవరించాం. మా దృష్టికి వచ్చినవి ఎప్పటికప్పుడు చేస్తున్నాం. వీలైనంత త్వరగా వాటిని సరి చేసే ప్రక్రియ చేపడతాం.నర్సింగరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిచొప్పదండికి చెందిన ఈయన పేరు కట్ల మల్లేశం. నూతన రేషన్‌కార్డు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. వీరి కుటుంబానికి కొత్త కార్డు కావాలని భార్య శ్రీలక్ష్మి పేరును కొత్తపల్లి నుంచి తొలగించి మరీ దరఖాస్తు చేశారు. భార్యాభర్తలతోపాటు కుమారుడి సుమిత్ పేరు కూడా కొత్తపల్లిలోని ఆమె తల్లిదండ్రుల రేషన్‌కార్డులో నమోదైంది.చొప్పదండికి చెందిన దూస రాజశేఖర్‌కు గతేడాది వివాహం కావడంతో ఈ ఏడాది జనవరిలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన పేరు కోహెడ మండలంలోని భార్య ప్రియాంక వాళ్ల ఇంటి రేషన్‌కార్డులో నమోదైంది.

# ఒప్పంద పత్రం.. యథేచ్ఛగా అమ్మకం



సిరిసిల్ల : నిరుపేదలకు తోడ్పాటు ఇవ్వడానికి ఇరవైఅయిదేళ్ల క్రితం జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గంలో బీడీ, చేనేత కార్మికులకు ప్రభుత్వం నివేశనస్థలాలను పంపిణీ చేసింది. వేములవాడ మండలం తెట్టెకుంటలోని ఈ ప్లాట్లు కలెక్టరేట్కు సమీపంలో సిరిసిల్ల-వేములవాడ ప్రధాన రహదారిని ఆనుకుని ఉ న్నాయి. ఇక్కడ గుంటభూమికి సుమారు రూ.20 లక్షలకు పైగా ధర పలుకుతోంది. ప్రభుత్వం పంపిణీ చేసిన ఈ ప్లాట్లపై రియల్ వ్యాపారుల కన్నుపడింది. ప్రభుత్వ ప్లాట్లను నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం వీలుకాదు. దీంతో ప్లాట్ల క్రయవిక్రయాలకు అక్రమార్కులు కొత్త దారులు వెతుకుతున్నారు.

**అక్రమాలిలా..**వేములవాడ మండలం తెట్టెకుంటలోని ప్రభుత్వ భూమిలో 316 మంది బీడీ, చేనేత కార్మికులకు 1999లో ప్లాట్లుగా చేసి పంపిణీ చేశారు. ఒక్కో ప్లాటు 180 నుంచి 200 చదరపు గజాలుగా ఉన్నాయి. అప్పుడు ఈ ప్రాంతమంతా గుట్ట శివారులో ఉ ండటం.. మౌలిక వసతులు లేక.. ఏళ్ల తరబడి ప్లాట్లు పొందిన లబ్ధిదారులు కన్నెత్తి చూడలేదు. జిల్లా ఆవిర్భావం తరువాత కలెక్టరేట్ నిర్మాణంతోపాటు సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు.. రహదారులు విస్తరించడంతో ఈ ప్లాట్లకు క్రమంగా డిమాండ్ పెరుగుతూ వస్తోంది. 2019లో తెట్టెకుంట పంచాయతీగా ఏర్పడింది. ఇంటి నిర్మాణాలకు అనుమతులు.. మౌలిక వసతులు సమకూరుతున్నాయి. 316 ప్లాట్లలో ఇప్పటికి 120 వరకు ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. మరికొందరు పునాదిదశలో వదిలేశారు. మరికొందరు ఒక్కగది నిర్మించారు. వీటిని లబ్ధిదారుల వద్ద కొనుగోలు చేస్తూ బాండ్ పేపర్‌పై విక్రయ ఒప్పంద పత్రం రాసుకుంటున్నారు. తర్వాత ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు పంచాయతీలో దరఖాస్తు చేస్తున్నారు. ఇంటి నంబరు రాగానే.. లబ్ధిదారుడితో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విక్రయిస్తున్నారు.

**హద్దులు లేక**

తెట్టెకుంటలో ప్రభుత్వం పంపిణీచేసిన ప్లాట్లతోపాటు మరింత ఖాళీ స్థలం ఉంది. ఇందులో అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు పుట్టుకొస్తున్నాయి. ఈ ఆక్రమణలపై గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ చేపట్టిన అప్పటి రెవెన్యూ అధికారులు నిర్మాణాలు చేయని ప్లాట్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఖాళీ స్థలాల చుట్టూ హద్దులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్లాట్లు పొందిన లబ్ధిదారులు స్వాధీనం చేసుకోవద్దని రెవెన్యూ అధికారులను అడ్డుకున్నారు. దీంతో హద్దుల నిర్ణయం కూడా నిలిచిపోయింది. ఇటీవల అక్రమ నిర్మాణాలు మరింతగా పెరిగాయి.

విచారణ చేపడతాం ప్రభుత్వం నిరుపేదలకు పంపిణీచేసిన ప్లాట్లు విక్రయించారు. తెట్టెకుంటలో క్రయవిక్రయాలు జరిగిన ప్లాట్లపై విచారణ చేపడతాం. వాటిని గ్రామంలో అర్హులైవారికి చెందేలా చర్యలు తీసుకుంటాం. విజయప్రకాశ్, తహసీల్దార్, వేములవాడ

# వసూళ్లు ఘనం.. వసతులు మృగ్యం

తిమ్మాపూర్ : తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీ స్టేజీ వద్ద సిగ్నల్ లైట్ ఇది. పెద్ద సంఖ్యలో పాదచారులు, వాహనదారులు రోడ్డు దాటుతుంటారు. రాజీవ్ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లలో ఇదొకటి. కానీ ఇక్కడ ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్ కొన్ని రోజులుగా వెలగడం లేదు.

రాజీవ్ రహదారిపై వాహనదారులకు, స్థానికులకు వసతులు కల్పించడంలో టోల్‌ప్లాజా నిర్వాహకులు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రోజుకో ప్రమాదం జరుగుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. టోల్‌ఫీజు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ వసతులు కల్పించడంలో లేదని పేర్కొంటున్నారు.

**ప్రాణాలు పోతున్నా..**హైదరాబాద్ నుంచి రామగుండం వరకు సుమారు 207 కిలోమీటర్ల మేర 2014లో హెచ్‌కేఆర్ రోడ్ వేస్ లిమిటెడ్ నాలుగు వరుసల రహదారిని నిర్మించింది. తిమ్మాపూర్ రేణికుంట వద్ద టోల్‌ప్లాజా కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు మీదుగా వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే డివైడర్ల వద్ద ఈ దారి గుండా అవగాహన లేనివారు రోడ్డు దాటేటప్పుడు ప్రాణాలు కోల్పోతున్నా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నిబంధనలు** రోడ్డు ప్రమాదాలు జరిగితే గుర్తు తెలియని వాహనాల



ఆచూకీ తెలుసుకోవడానికి నిఘా నేత్రాలు ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి ప్రమాదాల కారణాలు తెలుసుకొని రోడ్డు నిర్మాణ లోపమైతే వెంటనే సరి చేయాలి. రోడ్డుపై గుంతలు పడకుండా చూసుకోవాలి. వర్షాకాలంలో రహదారి ధ్వంసమైతే వెంటనే మరమ్మతు చేయాలి.

మచ్చుకు కొన్ని ప్రమాదాలు

రాజీవ్ రహదారిపై ఆరేళ్ల క్రితం మంచిర్యాలకు చెందిన ఓ కుటుంబం పెళ్లి కార్డులను పంచుతూ హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు వస్తూ అల్గునూర్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొనగా కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.గతేడాది నవంబరు 15న తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి వద్ద బిహార్‌కు చెందిన కూలీలు నడుచుకుంటూ వెళ్తుండగా కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు చనిపోయారు.డిసెంబరు 7న నుస్తులాపూర్ వద్ద జరిగిన ప్రమాదంలో కనకయ్య మృతి చెందారు. ఈ ఏడాది మార్చి 17న నేదునూరుకు చెందిన ఎలగందుల లచ్చవ్వ రేణిగుంట వద్ద రోడ్డు దాటుతుంగా లారీ ఢీకొని మృతి చెందారు.

సమస్యలను పరిష్కరిస్తున్నాం రహదారి నిర్వహణ నిరంతర ప్రక్రియ. వాహనదారుల సేవలకు ప్రతి 65 కి.మీటర్లకు ఒక బృందం పని చేస్తోంది. దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నాం. వాహనదారులకు ఇబ్బందులు ఎదురైతే మా దృష్టికి తీసుకురావచ్చు. విజయభాస్కర్‌రెడ్డి, డీజీఎం, హెచ్‌కేఆర్ రోడ్‌వేస్ లిమిటెడ్

ఒక్కరోజులో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు : దాదాపు 20 వేలు

# మూడు మార్గాలకు మహర్దశ

మంథని : మంథని డివిజన్‌లో ఇసుక లారీల రాకపోకలతో అధ్వానంగా మారిన రహదారులకు మోక్షం కలిగింది. వివిధ మార్గాల్లో చేపట్టే తారు నిర్మాణ పనులకు రూ.101.90 కోట్లు మంజూరు కాగా ఇటీవలే మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలకు కష్టాలు తీరనున్నాయి. మంథని, ముత్తారం మండలాల్లో ఆరు ఇసుక క్వారీలు నిర్వహిస్తుండగా దాదాపు రెండేళ్లుగా నిత్యం వేల సంఖ్యలో లారీలు అధిక బరువుతో నడుస్తుండటంతో రెండు మండలాల్లో దారులు అధ్వానంగా మారాయి. పెద్ద వాహనాల డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎగ్లాస్‌పూర్-ఖమ్మంపల్లి, గంగాపురి-ఓడేడ్, ఓడేడ్-ఖమ్మంపల్లి మార్గాల్లో రోడ్లు గుంతలమయంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

**ఇసుక లారీలతో తారు ఛిద్రం**



చిన్నఓదాల, గోపాల్‌పూర్, జిల్లాలపల్లి, ఖమ్మంపల్లి ఇసుక క్వారీల వద్దకు రాకపోకలు సాగించే లారీలతో ఎగ్లాస్‌పూర్-ఖమ్మంపల్లి రోడ్డు అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారింది. ఎగ్లాస్‌పూర్ నుంచి రచ్చపల్లి వరకు మూడు కిలోమీటర్ల మేర దూరం తారు పూర్తిగా ఛిద్రమై కంకర తేలింది. రచ్చపల్లి నుంచి ఖమ్మంపల్లి వరకు దారిపై గుంతలు పడటంతో ప్రమాదాల్లో పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు.ముత్తారం, ఓడేడ్, అడవి శ్రీరాంపూర్ ఇసుక క్వారీల లారీలు అధిక లోడ్‌తో వెళ్లడంతో గంగాపురి-ఓడేడ్ మార్గంలో రహదారి పూర్తిగా పాడయింది.

ఖమ్మంపల్లి-ఓడేడ్ మార్గంలో ఖమ్మంపల్లి, ఓడేడ్, అడవిశ్రీరాంపూర్ ఇసుక క్వారీల లారీలు 50 టన్నుల బరువుతో వెళ్లడంతో తారు పూర్తిగా ఛిద్రమైంది. పై మూడు మార్గాల్లో రోడ్ల మరమ్మతుకు మూడు నెలల కిందట రూ.101.90 కోట్లు మంజూరు కాగా టెండరు ప్రక్రియలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు పూర్తి కావడంతో ఈ నెల 14న మంత్రి శ్రీధర్‌బాబు పనులకు శంకుస్థాపన చేశారు.పనులు పూర్తయితే రహదారులు మెరుగై వాహనదారుల ఇబ్బందులు తీరడంతో పాటు సకాలంలో గమ్యం చేరే అవకాశముంది.

# పంట పొలాల్లో సౌర వెలుగులు



తెలంగాణ : పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయ వనరులను ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికే ఇంటింటా సౌర వెలుగులు తేవడానికి సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తుండగా.. తాజాగా పంట పొలాల్లో సౌర వెలుగులు నింపాలనే ఉద్దేశంతో పీఎం-కుసుమ్ (ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్) పథకం కింద సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా ఉపాధి పొందడానికి వీలుంటుంది. ఆసక్తి గల రైతులు (వ్యక్తిగతంగా), రైతు, సహకార, మహిళా సంఘాలు, మండల సమాఖ్యలు, ఇతరులు టీఎస్-రెడ్కో (తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ)కు సంబంధించిన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈనెల 10 వరకు దరఖాస్తులు స్వీకరించింది.

**అర్హులు.. ఎంపిక విధానం**

కుసుమ్ పథకం ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనుకునేవారికి సబ్‌స్టేషన్‌కు 5 కిలోమీటర్ల పరిధిలో నాలుగెకరాల భూమి ఉన్న రైతు లేదా లీజుకు తీసుకున్నవారు అర్హులు. ఒక మెగావాట్ ఉత్పత్తి చేయాలంటే దాదాపు రూ.3 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో పది శాతం వాటా భరిస్తే, 90 శాతం బ్యాంకులు రుణంగా ఇవ్వనున్నాయి. ఒక్కో సబ్‌స్టేషన్ పరిధిలో 2 మెగావాట్లు ఉత్పత్తి చేయడానికి వీలుంటుంది. రెడ్కో, సబ్‌స్టేషన్‌కు సంబంధించిన అధికారులు సర్వే చేసి అనుమతించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లాకు 2 మెగావాట్ల చొప్పున మహిళా సంఘాలకు కేటాయించారు. ఇందుకు అవసరమైన భూమిని కూడా కేటాయించారు. కాకపోతే ప్రభుత్వ భూములను కేటాయించొద్దని కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లు తెలిసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉందని సమాచారం.

**మహిళా సంఘాలకు 120 మెగావాట్లు**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 520 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇందులో 120 మెగావాట్లు ఎస్‌హెచ్‌జీ(మహిళా) సంఘాలకు కేటాయించారు. నాలుగు జిల్లాల్లో 100 మెగావాట్ల చొప్పున సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. వీటిని రైతులు, సహకార, మహిళా స్వశక్తి సంఘాలతో నెలకొల్పనున్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద జిల్లాకు రెండు గ్రామాల చొప్పున 8 గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా ప్లాంట్ల నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్తును డిస్కంలు కొనుగోలు చేయనున్నాయి. రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి నిర్ణయించిన ధర ప్రకారం ఒక్కో యూనిట్‌కు రూ.3.18 చొప్పున ఉత్పత్తిదారులకు చెల్లించనుంది. మహిళా సంఘాల నుంచి వచ్చిన దరఖాస్తులు కాకుండా కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 600.8 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం 468 దరఖాస్తులు రావడం విశేషం.

ఉమ్మడి జిల్లాలో 8 మహిళా సంఘాల ఎంపిక..

కరీంనగర్ : దత్తోజీపేట, ఘన్ముకుల

పెద్దపల్లి : సిరిపురం, కాల్వశ్రీరాంపూర్

జగిత్యాల : తాటిపల్లి, స్తంభంపల్లి రాజన్న సిరిసిల్ల : ముష్టిపల్లి, ధర్మారం.

# ఆహార శుద్ధి.. లోపించిన చిత్తశుద్ధి

పెద్దపల్లి : ఔత్సాహిక యువతకు ఉపాధి కల్పించి, ఉత్పత్తులకు విలువలు జోడించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే ప్రభుత్వ ప్రయత్నం నెరవేరడం లేదు. ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపనలో అడుగు ముందుకు పడటం లేదు. భూముల లభ్యత లేకపోవడంతో పారిశ్రామికీకరణకు ప్రతిబంధకంగా మారింది. గతంలో గుర్తించిన భూములు పరిశ్రమలకు సరిపడకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. భూసేకరణలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులకు దగ్గర ఉన్న జిల్లాలో పరిశ్రమలు విరివిగా స్థాపిస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

**వసతులకు కరవైన నిధులు**

తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) ఆధ్వర్యంలో ర్యాకల్‌దేవ్‌పల్లిలో గుర్తించిన స్థలాల్లో పరిశ్రమల స్థాపనకు అవసరమైన రోడ్లు, మురుగు కాలువలు, విద్యుతు వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాల్సి ఉన్నా ఏళ్లుగా కేటాయించడం లేదు. వసతులు కల్పిస్తే ఔత్సాహిక యువత ముందుకురానుంది. జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లో మహిళలు ఆసక్తి చూపుతున్నారు. స్థలాలను సద్వినియోగం చేసుకుంటేనే యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**ఉత్పత్తుల జాడేది?**

జిల్లాలో సుమారు 2.50 లక్షల ఎకరాల్లో వరి, మిర్చి, పసుపు,



మొక్కజొన్న, కూరగాయలు సాగు అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఇక్కడ 200పైనా రైసు మిల్లులున్నాయి. వ్యవసాయరంగ పరంగా ప్రతి సంవత్సరం రెండు పంటల్లో లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యపురాశులు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ అనుబంధ రంగానికి దగ్గరగా ఉండే ఆహార శుద్ధి పరిశ్రమలనే ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రైస్ మిల్లులు, బియ్యంతో తయారయ్యే తిను బండారాల తయారీ, ఇతరత్రా ఉత్పత్తుల తయారీ పరిశ్రమలతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఆశయం అటకెక్కింది.

**స్థలాల సమస్యే ప్రధానం**

ఆహారశుద్ధి పరిశ్రమలకు కనీసం 400 ఎకరాల్లోపు ఉండాలి. ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లిలో 102 ఎకరాలు గుర్తించారు. సమీప ప్రాంత రైతులు మరి కొన్ని భూములు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు.అందుబాటులో ఉన్న భూముల్లో పరిశ్రమలు నెలకొల్పే చర్యలు తీసుకోవడం లేదు.

**రైతులు ముందుకు రావాలి**

మహేశ్వర్, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్, ఉమ్మడి కరీంనగర్

జిల్లాలో ర్యాకల్‌దేవులపల్లి 102 ఎకరాలు మాత్రమే లభ్యమైంది. చుట్టుపక్కల రైతులు స్థలాలు ఇవ్వడం లేదు. ముందుకొచ్చి స్థలాలు ఇస్తే ప్రభుత్వం తరఫున పరిహారం చెల్లించనుంది. గుర్తించిన స్థలాల్లో మౌలిక వసతులకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుంటాం.

# ఉత్సాహం.. ఉసూరుమంటోంది

సిరిసిల్ల: ఆహారశుద్ధి.. టెక్స్‌టైల్.. అపరెల్ ఉత్పత్తుల పరిశ్రమల కోసం జిల్లాలో వేర్వేరు చోట్ల 450 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. అందులో ఇప్పటివరకు ఏర్పాటైనవి కేవలం మూడు పరిశ్రమలు మాత్రమే. మిగతా వందలాది ఎకరాల భూములు నిరుపయోగంగా ఉన్నాయి. జిల్లాలో మరమగ్గాల వస్త్రోత్పత్తిలో అనుబంధ పరిశ్రమలు లేక అయిదు దశాబ్దాలుగా ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితులు. దీంతో జిల్లాలో ఎగుమతి రకాలకు చెందిన వస్త్రోత్పత్తులకు అవకాశం లేదు. ఈ కారణంగా పరిశ్రమ తరచూ ఆటుపోట్లను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడి.. ఇతర రాష్ట్ర ఉత్పత్తులతో పోటీపడాలంటే.. జిల్లా వస్త్రోత్పత్తుల్లో అనుబంధ పరిశ్రమల విస్తరణతోనే సాధ్యం. పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నా.. వారికి సరైన సహకారం అందడంలేదు. ఆయా కారణాల వల్ల ఈ రంగంలో ఉపాధి అవకాశాలు నానాటికీ తగ్గిపోతున్నాయి.

**అత్యధిక మరమగ్గాలు ఇక్కడే**

రాష్ట్రంలో అత్యధికంగా మరమగ్గాలు ఉన్నది సిరిసిల్లలోనే. ఇక్కడి వస్త్ర పరిశ్రమకు అయిదు దశాబ్దాలకు పైగా చరిత్ర ఉంది. జిల్లాలో నిత్యం ఆరు లక్షల మీటర్ల వస్త్రోత్పత్తిచేసే సామర్థ్యం ఉంది. కాటన్‌లో కేస్‌మెట్. పాపిలిన్ రకానికి మంచి డిమాండ్ ఉంది. ఈ వస్త్రం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. కానీ ఇక్కడ ఈ వస్త్రం సైజింగ్, ప్రాసెసింగ్, ప్రింటింగ్‌కు ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోంది. జిల్లాలోనే ఔత్సాహిక వస్త్రోత్పత్తిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం అందించాలి. స్థానికంగా పరిశ్రమల కోసం సేకరించిన స్థలంలో భూమి కేటాయిస్తే వస్త్రపరిశ్రమ విస్తరణకు అవకాశం ఉంటుంది. దీంతో ఎగుమతి రకాల వస్త్రోత్పత్తులతోపాటు.. స్థానికంగా ఉన్న నేత కార్మికులకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి. పరిశ్రమలో నిలకడ ఏర్పడుతుంది.

**ఇతర రాష్ట్రాలకు పంపాల్సి వస్తోంది**

జిల్లా మరమగ్గాలపై వస్త్రోత్పత్తులకు అవసరమైన నూలును ఎక్కువగా గుంటూరులోని స్పిన్నింగ్ మిల్లుల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఇక్కడ అద్దకం యూనిట్లు లేవు. ఇందుకోసం మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్‌లకు పంపుతున్నాం. ఎగుమతులు, దిగుమతులకే భారీగా ఖర్చవుతోంది. జిల్లాలోనే ఉమ్మడి వసతుల కేంద్రం ఏర్పాటుకు రూ.55 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశాం. ప్రభుత్వం చొరవ తీసుకుని స్థలం కేటాయిస్తే.. పరిశ్రమల శాఖ ప్రోత్సాహంతో యూనిట్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం.

రిక్కమల్ల శివరామకృష్ణ, ఎంఆర్ టెక్స్‌టైల్స్, అశోక్‌నగర్

ఏడాదిగా ప్రయత్నిస్తున్నా ఫలితంలేదు

సిరిసిల్లలో నైపుణ్యం కలిగిన కార్మికులు ఉన్నారు. ఇక్కడి పరిశ్రమ అయిదు దశాబ్దాలుగా ముడి సరకును దిగుమతి చేసుకుని వస్త్రోత్పత్తులకే పరిమితమైంది. తరాలు మారుతున్నా వస్త్రోత్పత్తుల్లో మార్పు రావడంలేదు. అనుబంధ రంగాల పరిశ్రమల విస్తరణకు మాకు ఆసక్తి ఉన్నా.. దానికి తగిన సహకారం లభించడంలేదు. సిరిసిల్లలో వందల ఎకరాల్లో ప్రత్యేక పరిశ్రమల జోన్ ఏర్పాటు చేశారు. జిల్లాలో టీజీఐఐసీ కార్యాలయంలేదు. ఏడాదిగా ప్రభుత్వ ప్రతినిధులను కలుస్తున్నా ఫలితం లేదు. మ్యాన వేణుగోపాల్, సుభాష్‌నగర్

# ప్రయాణ ప్రాంగణం.. అందని శుద్ధ జలం!



కరీంనగర్ : ఎండలు మండుతున్నా పలు ప్రయాణ ప్రాంగణాల్లో శుద్ధ జలం అందక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.. ఎక్కువ శాతం సీసా నీళ్లనే నమ్ముకుంటున్నారు.. ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నవారు కొందరైతే.. కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నవారు మరికొందరు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 ప్రధాన ప్రయాణ ప్రాంగణాలను పరిశీలించగా ఎనిమిదింటిలో శుద్ధ జలం సౌకర్యం లేదు..

**ఇక్కడ బాగు**

రోజుకు లక్ష మంది రాకపోకలు సాగించే కరీంనగర్ బస్టాండ్‌లో 4 వాటర్ కూలర్లు అందుబాటులో ఉన్నాయి.

70 వేల మంది ప్రతి రోజూ గోదావరిఖని బస్టాండ్ నుంచి ప్రయాణిస్తుండగా ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధ జలం అందుతోంది.

మెట్‌పల్లి బస్టాండు నుంచి నిత్యం 50 వేల మంది ప్రయాణిస్తుంటారు. స్వచ్ఛంద సంస్థ శుద్ధ జలాన్ని అందిస్తోంది.

రోజూ 40 వేల మంది ప్రయాణించే కోరుట్ల బస్టాండ్‌లో శుద్ధ నీటి యంత్రం అందుబాటులో ఉంది.

నిత్యం 25- 30 వేల మంది ప్రయాణికులు వచ్చే వేములవాడ బస్టాండ్‌లో ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధ జలాన్ని అందిస్తున్నారు.

జగిత్యాల బస్టాండ్ ద్వారా నిత్యం 30 వేల మంది ప్రయాణిస్తుండగా పురపాలిక నీటిని నింపి వాటర్ కూలర్ ద్వారా అందించే ఏర్పాటు చేశారు.

**ఇవీ సమస్యలు**

హుజూరాబాద్ బస్టాండ్ నుంచి నిత్యం 35వేల మంది ప్రయాణిస్తుంటారు. ఆర్వో ప్లాంటు నీరు తెచ్చి ఫ్రిజ్ ద్వారా సరఫరా చేస్తున్నారు. ఫ్రిజ్ వద్ద అపరిశుభ్రంత ఇబ్బందిగా ఉంది.

జమ్మికుంట బస్టాండ్‌కు ప్రతి రోజు 10 వేల మంది ప్రయాణికులు వస్తుంటారు. ఆర్వో ప్లాంట్ నీటిని తెచ్చి ఫ్రిజ్‌లో పోసి అందిస్తున్నా సరిపోవడం లేదు.

నిత్యం 3 వేల మంది వచ్చే చొప్పదండి బస్టాండ్‌కు ఓ సంస్థ ఫ్రిజ్ బహూకరించగా బబుల్స్ నీటిని పోస్తున్నారు. ఉదయం పూట మాత్రమే సరిపోతున్నాయి.

సిరిసిల్ల బస్టాండ్ నుంచి నిత్యం 32 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కొత్త బస్టాండ్‌లో తాగునీటి వసతి లేదు. పాత బస్టాండ్‌లో నేరుగా బోరు నుంచి వచ్చే నీటిని ఫ్రిజ్ ద్వారా అందిస్తున్నారు. సుల్తానాబాద్ బస్టాండ్ నుంచి ప్రతి రోజు వెయ్యికి పైగా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. శుద్ధి చేసిన నీటిని కాకుండా నేరుగా బోరు బావి నుంచి వచ్చే నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ ప్రాంతం కూడా అపరిశుభ్రంగా ఉంది.ధర్మపురి బస్టాండ్‌లో పబ్లిక్ నల్లా నీటితో సంపును నింపుతున్నారు. నల్లా కనెక్షన్ ఉన్న ప్రాంతం కూడా అపరిశుభ్రంగా మారింది.

పరిశీలించిన బస్టాండ్‌లు : 14

రోజూ ప్రయాణికుల రాకపోకలు : 3.5 లక్షల మంది

# స్తంభానికో లెక్క.. నాణ్యమైన సరఫరా పక్కా




పెద్దపల్లి : వేసవిలో విద్యుత్తు కోతలు, లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించే దిశగా కార్యాచరణ చేపట్టిన విద్యుత్తు సంస్థ క్షేత్రస్థాయిలో విద్యుత్తు అంతరాయాలను త్వరగా తెలుసుకునేందుకు పోల్‌మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 33 కేవీ, 11 కేవీలతోపాటు ఎల్‌టీ విద్యుత్తు లైన్ల స్తంభాలకు యూనిక్ నంబర్లను రాయిస్తుంది. ఉప కేంద్రాలకు విద్యుత్తు సరఫరా చేసే 33 కేవీ, ఉప కేంద్రాల నుంచి విద్యుత్తు నియంత్రికల వరకు వెళ్లే 11 కేవీ ఫీడర్లకు తాజాగా నంబర్లు కేటాయించారు. జిల్లాలో రెండు రోజులుగా 33 కేవీఏ ఫీడర్లకు 28, 11కేవీఏ పీడర్లకు 158 స్తంభాలకు నంబర్లు కేటాయించారు. వానాకాలం నాటికి జిల్లాలోని అన్ని విద్యుత్తు స్తంభాలకు నంబరింగ్ ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు తయారు చేసుకున్నారు.

**ప్రయోజనాలు ఇవి..**

స్తంభాలకు నంబర్ల కేటాయింపు గ్రామం లేదా పట్టణాలోని ఫీడర్ యూనిట్‌గా జరుగుతుంది.

వివిధ ఫీడర్ల పరిధిలో జరిగిన నంబర్లకు జియో ట్యాగింగ్ చేస్తారు.

విద్యుత్తు తీగలు తెగిపోయినా, స్తంభాలు విరిగినా స్థానికులు సమాచారం ఇవ్వడం ద్వారా కొత్తగా విధుల్లోకి వచ్చిన వారు కూడా నేరుగా అంతరాయం జరిగిన ప్రాంతానికి చేరుకుంటారు.

దీంతో మరమ్మతు ప్రక్రియ వేగంగా పూర్తి చేయడంతో అంతరాయాలకు ముగింపు పడుతుంది.

వేసవిలో లో వోల్టేజీ సమస్యలను నివారించేందుకు విద్యుత్తు అధికారులు నెలరోజులుగా చేపట్టిన విద్యుత్తు ఉపకేంద్రాల నవీకరణ (అప్‌గ్రేడ్షన్) ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.

జిల్లాలో 200 ప్రాంతాల్లో నియంత్రికలను నవీకరణ చేసేందుకు ప్రతిపాదించామని పెద్దపల్లి సర్కిల్ పర్యవేక్షకాధికారి మాధవరావు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో గద్దెల నిర్మాణం పూర్తయిందని.. నియంత్రికలు వచ్చిన వెంటనే బిగిస్తామని పేర్కొన్నారు.

# ఆదాయం ఘనం.. అభివృద్ధి శూన్యం

భువనగిరి : భువనగిరి మార్కెట్ కమిటీ ఆదాయ లక్ష్యం సాధిస్తున్నప్పటికీ అభివృద్ధి అంతంతగానే ఉంది. మూడేళ్లుగా సాధించిన ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకుని దానికి 20 శాతం పెంచి మరో సంవత్సరానికి ఆదాయ లక్ష్యం నిర్ణయిస్తారు. పెంచిన ఆదాయం సైతం సాధిస్తున్నప్పటికి అభివృద్ధిలో ప్రగతి కనిపించకోపోవడం గమనార్హం. కొత్త మార్కెట్ కార్యాలయాన్ని నిర్మించేందుకు రూ.5.20 కోట్లతో పనులు ప్రతిపాదించినప్పటికి నేటికీ నిధులు మంజూరు కాలేదు. అనంతారం శివారులో నిర్మించనున్న కొత్త మార్కెట్ యార్డుకు నేటికీ



పూర్తి స్థాయిలో నిధులు మంజూరు కాలేదు. అరకొర నిధులతో ప్రహరీ పనులు కొనసాగుతున్నాయి.గతంలో మార్కెట్ నిధులతో గ్రామాల మధ్య అంతర్గత రోడ్లు, యార్డు అభివృద్ధి నిర్మాణాలు, గోదాంలు నిర్మించేవారు. ప్రస్తుతం ఆయా పనులు చేపట్టడం లేదు. వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలపై మార్కెట్ కార్యాలయానికి ఒక శాతం పన్ను, ట్రేడ్ లైసెన్స్‌లు, గోదాంల అద్దెతో ఆదాయం లభిస్తుంది. వస్తున్న ఆదాయానికి అనుగుణంగా అభివృద్ధి చేపడితే రైతులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఈ విషయమై ఇన్‌ఛార్జి మార్కెట్ కార్యదర్శి ఎల్లయ్యను వివరణ కోరగా.. నిర్మాణ పనులు ఏవీ ప్రతిపాదించలేదని, కార్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు.

# ఆ ఎనిమిదే టాప్..!

హుజూర్‌నగర్, రాష్ట్రంలో టెండర్ ద్వారా ధాన్యం అమ్మినా.. ఆ ధాన్యం గుత్తేదారుకు ఇవ్వని మిల్లర్లు జిల్లాలో ఎనిమిది మంది ఉన్నారు. అంతేనా అనుకుంటున్నారా..! వారి నుంచి రావాల్సిన ధాన్యం విలువ రూ.273 కోట్లు. ఇదిగో.. అదిగో అంటూ 16 నెలలుగా ఆదేశాలను ఖాతరు చేయని ఆ ఎనిమిది మిల్లులు రాష్ట్రంలోనే టాప్‌లో ఉన్నాయి. వారు ఇవ్వడం లేదా.. లేక వద్దులే అనుకున్నారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉండగా తాజాగా ఆ ధాన్యం అప్పగించేందుకు ప్రభుత్వం తిరిగి వారికి మరో మూడు నెలల గడువు పెంచి మరో అవకాశం ఇచ్చింది. ఇటీవలే రాష్ట్రానికి సంబంధించిన ఒక సంస్థ ధాన్యం అక్రమార్కులపై నేరుగా సీబీఐ డైరెక్టర్ జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది.



**చిక్కుముడి ఇదీ..** ప్రభుత్వం ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం నాణ్యత లేదని మిల్లర్లు గగ్గోలు పెట్టడంతో 2022-23 యాసంగి ధాన్యాన్ని గ్లోబల్ టెండరు ప్రక్రియ ద్వారా అమ్మింది. ధాన్యం అమ్మేనాటికి దాన్ని అప్పటికే మిల్లులకు కేటాయించారు. రకరకాల కారణాలు చెబుతూ వారు ధాన్యాన్ని తమకే అమ్మాలని కోరుతూ వేలంలో దక్కించుకున్న గుత్తేదారుకు అప్పగించలేదు. దీనిపై ప్రభుత్వంలో చర్చలు కూడా జరిగాయి. చివరకు ధర విషయంలో తేడాలు ఉండటంతో ప్రభుత్వం వాటిని వేలం ద్వారా అమ్మకాలు జరిపింది. ఆ తరువాత ధాన్యం అప్పగించకపోవడం వల్ల టెండరుదారు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సొమ్మును ఇవ్వడం లేదు. మిల్లర్లు ధాన్యం ఇవ్వడం లేదు. రకరకాలుగా ఒత్తిడి తీసుకురావడంతో కొందరు మిల్లర్లు అప్పగించారు. 15 నెలలైనా నేటికీ కొందరు అప్పగించని వారున్నారు. అందులో నేరేడుచర్ల, గరిడేపల్లి, కోదాడ, తిరుమలగిరి ప్రాంతాలకు చెందిన మిల్లులు ఉన్నట్లు సమాచారం. గుత్తేదారు నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయి మొత్తం చెల్లించేందుకు, మిల్లర్లు బకాయి ధాన్యం గుత్తేదార్లకు అప్పగించేందుకు తాజాగా గడువు పెంచింది. డిసెంబరు 31తోనే గడువు ముగిసినప్పటికీ మిల్లర్లు మరికొంత సమయం కోరడం వల్ల గడువు పెంచినట్లు విశ్వసనీయ సమాచారం.

# ఇక్కడంతా షరా మామూలే!

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రాలపై ఉన్నతాధికారుల నిఘా కొరవడుతోంది. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ), అసిస్టెంట్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ)ల విధుల నిర్వహణ ఇష్టారాజ్యంగా సాగుతోంది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం భోరజ్, నిర్మల్ జిల్లా బేల్‌తరోడ, కుమురంభీం జిల్లాలోని వాంకిడి చెక్‌పోస్టుల మీదుగా సాగే వాహనాల తాత్కాలిక అనుమతి(టీఆర్), సరకుల రాష్ట్ర పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు చెందాల్సిన ఆదాయాన్ని కొంతమంది అధికారులు కొల్లగొడుతున్నారు.

విచారణ లేక అనిశా అధికారులు గత డిసెంబరు 5న భోరజ్ చెక్‌పోస్టులో చేసిన ఆకస్మిక సోదాల్లో లెక్కల్లోకిరాని నగదు లభ్యమైంది. ఆ తర్వాత ఎలాంటి విచారణ లేకపోవటంతో షరా మామూలుగా మారిపోయింది. ఆదిలాబాద్, భోరజ్, బేల్‌తరోడలోని ఒక్కొక్కరి చొప్పున ముగ్గురు అధికారులు తీసుకునే వ్యక్తిగత నిర్ణయాలకు అనుగుణంగా ఉమ్మడి జిల్లా చెక్‌పోస్టుల్లో విధి నిర్వహణ సాగుతున్నందున ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఉమ్మడి జిల్లా రవాణాశాఖ కార్యకలాపాలపై అజమాయిషీ చేయాల్సిన ఓ అధికారి సైతం అంటీముట్టనట్లు వ్యవహరించటం అక్రమాలను ప్రోత్సహించినట్లవుతోంది.

**విమర్శలకు తావిస్తున్న అనిశా కేసు** భోరజ్ చెక్‌పోస్టులో డిసెంబరు 5న లభించిన రూ.62,500 వ్యవహారం మరుగున పడింది. ఆ రోజు విధుల్లో ఉన్నదెవరు? లెక్కల్లోకి రాని డబ్బులకు కారణాలేమిటి? అనే కోణంలో అనిశా సమగ్ర దర్యాప్తు చేయాల్సి ఉండగా ప్రాధాన్యత లేనట్లు వదిలేయటం విమర్శలకు తావిస్తోంది. ఆ డబ్బులు ఎవరికీ సంబంధం లేదనే రీతిలో మరుగునపడేలా చేయటంలో రవాణాశాఖలోని ఇద్దరు అధికారులు హైదరాబాద్ స్థాయిలో చక్రం తిప్పినట్లు సమాచారం. ఈ విషయమై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అనిశా డీఎస్పీ విజయ్‌కుమార్‌ని ఫోన్‌లో సంప్రదించగా ఆ కేసు వివరాలేవీ తనకు తెలియదని, తాను జనవరిలో విధుల్లో చేరానని చెప్పారు.

## ప్రాణాలు నిలిపే ప్రణాళికే కీలకం

విశాఖపట్నం : గతేడాది ఆగస్టులో అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా' ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృత్యువాత పడ్డారు. మరో 24 మందికి అనకాపల్లి, విశాఖ, అచ్యుతాపురంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. అందులో అధిక శాతం క్షతగాత్రులకు ప్రైవేటు ఆసుపత్రుల్లోనే చికిత్స అందించారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలో జరిగిన బాణాసంచా పేలుడు ఘటనలో గాయపడిన బాధితుల్లో ఆరుగురిని కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. వారిలో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఫార్మా, ఇతర పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా దుర్ఘటనల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను ముందుగా కేజీహెచ్‌కు తీసుకొస్తున్నారు. వారి పరిస్థితి విషమంగా మారినా, కాలిన గాయాలు ఎక్కువగా ఉన్నా ప్రైవేటు ఆసుపత్రులకు తరలించాల్సి వస్తుంది. రసాయన, జీవసంబంధ, రేడియోలాజికల్, న్యూక్లియర్ (అణు) సంబంధిత ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు మెరుగైన వైద్యమందించేందుకు స్థానికంగా ప్రత్యేక సదుపాయాలు లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విశాఖలో సెకండరీ లెవెల్ కెమికల్ బయోలాజికల్ రేడియోలాజికల్ న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని భావించారు. పెరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా కేంద్రం ఏర్పాటును వేగవంతం చేయాలని వైద్య నిపుణులు కోరుతున్నారు.

గతేడాది వైద్యులకు శిక్షణ: సీబీఆర్ఎన్ సెంటర్ కోసం విమ్స్‌లో




రెండెకరాల స్థలం కేటాయించారు. 2024 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, నిపుణులు స్థలాన్ని పరిశీలించారు. గతేడాది అక్టోబరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది. విమ్స్‌లో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులకు తమిళనాడులోని కుడంకుళం అణువిద్యుత్తు ప్లాంటులో శిక్షణ అందజేశారు. తర్వాత ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. కేంద్రం పూర్తయ్యాక అందులో పనిచేసేందుకు పూర్తి సిబ్బందిని కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది. చికిత్సకు వినియోగించే ప్రత్యేక సామగ్రి, పరికరాలు కూడా కేటాయిస్తుంది.

**ఏర్పాటైతే ప్రయోజనాలు..**

కేంద్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హెల్త్ సెక్టర్ డిజాస్టర్ ప్రిపేర్డ్‌నెస్ అండ్ రెస్పాన్స్, ఆయుష్మాన్ భారత్ పథకాల కింద ఈ కేంద్రం నిర్మించాలని భావించారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) తదితర సంస్థల సహకారంతో దీన్ని నిర్మించనున్నారు. రియాక్టర్ పేలుళ్లు, గ్యాస్ లీకేజీలు, రసాయనాల విస్ఫోటనాలు జరిగినప్పుడు తీవ్రంగా గాయపడిన వారికి అత్యాధునిక వైద్యం అందించేలా రెండంతస్తుల్లో తీర్చిదిద్దుతారు. ఎల్జీ పాలిమర్స్‌లో స్టైరీన్ గ్యాస్ లీకేజీ, అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లోని ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు, ఇతర పేలుళ్ల తరహా ఘటన లు జరిగితే బాధితులకు ఒకేచోట మెరుగైన వైద్యం అందించొచ్చు. క్షతగాత్రులను ప్రైవేటు ఆసుపత్రులకు తరలించాల్సిన అవసరం లేకుండా తక్షణ, ప్రత్యేకమైన వైద్యం అందించేందుకు వీలుంటుంది. బాధితులకు అత్యవసర చికిత్స చేయడానికి 20 పడకల ఐసీయూ, ఐసోలేషన్ పడకలు తదితర ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

## అమ్మలకు అండగా.. వసతులు మెండుగా

నర్సీపట్నం : నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రి ప్రసూతి విభాగంలో ఒకప్పుడు నెలకు 400 నుంచి 500 వరకు ప్రసవాలు జరిగేవి. రాష్ట్రంలో అత్యధిక ప్రసవాలు జరిగే ఆసుపత్రుల్లో ముందు వరసలో ఉండి అవార్డులు అందుకున్న ఘనత ఈ ఆసుపత్రిది. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఈ ప్రతిష్ఠ మసకబారింది. నెలకు 300 ప్రసవాలు జరగడం గగనమైపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా ఉన్న స్థానిక ఎమ్మెల్యే, సభాపతి అయ్యన్నపాత్రుడు ప్రసూతి సేవల మెరుగుకు చర్యలు చేపట్టారు. గడిచిన నాలుగు నెలల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వెయ్యి సాధారణ ప్రసవాలు, 300 శస్త్రచికిత్సలు చేశారు. గతంతో పోలిస్తే శస్త్రచికిత్సలు 30 శాతం తగ్గాయి. శస్త్రచికిత్స అవసరమైతే సీనియరు వైద్యులను సంప్రదించి ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటున్నారు. గతంలో ఇక్కడి నుంచి అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి కొన్ని కేసులను పంపేవారు. ఇప్పుడిలా తరలించడం లేదు. అర్ధరాత్రి అయినా అప్పటికప్పుడు వైద్యులు వచ్చి అవసరమైతే శస్త్రచికిత్సలూ చేస్తున్నారు. గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఆసుపత్రి నుంచి ఒక్క గర్భిణినీ బయటకు పంపలేదు. వైద్యుల సేవలు మెరుగుపడ్డాయి. శస్త్రచికిత్సలు జరిగిన బాలింతలను వైద్యులు రోజుకు రెండు మూడుసార్లు పలకరిస్తున్నారు. ఆసుపత్రిలోనే అవసరమైన ఫొటోథెరపీ యూనిట్లు అందుబాటులో ఉ



న్నాయి. కామెర్లు ఉన్న పిల్లలను గతంలో ప్రైవేటు ఆసుపత్రులకు పంపేవారు. కుటుంబ సభ్యులు అక్కడ రూ.3 వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఇక్కడే ఉంచుతున్నారు. బరువు తక్కువ పిల్లల కోసం ఎస్ఎన్‌సీయూలో వార్మర్లు ఉన్నాయి. పీజీ వైద్య విద్యార్థులతో కలిసి ముగ్గురు పిల్లల వైద్యులు, నలుగురు ప్రసూతి వైద్య నిపుణులు ఆసుపత్రిలో ఉన్నారు. మందులు కొరత తలెత్తకుండా అవసరమైతే ఆసుపత్రి నిధులతోనే బయటి నుంచి కొనుగోలు చేసి ఇస్తున్నారు.

ఓపీ విభాగంలో సీనియర్ గైనకాలజిస్టు, ఆసుపత్రి సూపరింటెండెంట్ సుధాశారద రోగులను పరీక్షిస్తున్నారు. తాజాగా ఓపీ విభాగంలో ఏసీ సదుపాయం కల్పించారు. ప్రసూతి విభాగం వద్ద శుద్ధజలం అందుబాటులో ఉంచారు. డాక్టర్ సుధాశారద మాట్లాడుతూ.. 'నాలుగు నెలలుగా వైద్యులందరి సమష్టి కృషితో ప్రసవాల సంఖ్య పది నుంచి 40 వరకు పెరిగాయి. నెలకు నాలుగైదు వందల ప్రసవాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రస్తుతం 150 పడకలు ఉన్న ఆసుపత్రిని 200 పడకలకు పెంచేందుకు ప్రతిపాదనలున్నాయి. త్వరలోనే ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడే అవకాశముంద'న్నారు.

## జగనన్న ఇళ్లకు 'కూటమి' సొమ్ములు



హిందూపురం : గత వైకాపా ప్రభుత్వ హయాంలో 'అందరికీ ఇళ్లు.. జగనన్న కాలనీలు' అంటూ ప్రచారం హోరెత్తించారు. ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల్లో అంతా వైకాపా వారే అయినా బిల్లులు మాత్రం మంజూరు చేయలేదు. అష్టకష్టాలు పడి నిర్మాణాలు చేసుకొన్న వారు అప్పులపాలయ్యారు. ఇళ్లు అవసరం లేని వారు అరకొరగా నిర్మించుకొని వదిలేశారు. గతంలో 2014–19 మధ్య కాలంలో ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద ఇళ్లు నిర్మించుకొన్న వారంతా తెదేపా మద్దతుదారులని వారికి గత ఐదేళ్లలో బిల్లులు మంజూరు కాలేదు. కాని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పోకుండా జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడమే కాకుండా, నిర్మాణాలకు మంజూరు చేసిన రూ.1.80 లక్షల సొమ్ము చాలదని అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు మంజూరు చేసింది. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందితో సంప్రదించకుండా నేరుగా రాష్ట్ర స్థాయి నుంచే లబ్ధిదారుల ఖాతాల్లో ఉగాది పండగకు వారం రోజుల ముందు రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.15 వేల చొప్పున జమ చేశారు. పండగ సమయంలో డబ్బులు రావడంతో చాలా మంది సొంత అవసరాలకు ఖర్చు పెట్టేశారు.

**అధికారులకు తలనొప్పులు**

డబ్బులు జమ అయిన వారి వివరాలను తీసుకొని గృహ నిర్మాణ శాఖ అధికారులు ఇంటింటికీ తిరుగుతున్నారు. లబ్ధిదారుల్లో కొందరు మాత్రమే స్పందిస్తున్నారు. మిగిలిన వారు ముందుకు రాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అనేకమంది వైకాపా కార్యకర్తలకు ఇప్పటికే ఒక్కో ఇల్లు ఉండగా, ఇది రెండోది కావడంతో పూర్తిచేసేందకు ఇష్టపడటం లేదు.

**ఇష్టారాజ్యంగా జమ!**

ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల్లో చనిపోయిన వారి ఖాతాల్లోనూ సొమ్ము జమ చేశారు. హిందూపురం మండలంలో కొటిపి, గోళ్లాపురం తదితర గ్రామాల్లో ఇలాంటి వారి సంఖ్య ఆరుకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. హిందూపురం– గోరంట్ల జాతీయ రహదారికి, సోమందేపల్లి రైల్వే లైన్ నిర్మాణానికి పోయే స్థలాల్లోనూ గతంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో గతంలో ఇచ్చిన సొమ్మే వృథా అయింది. రహదారి ఏర్పాటు విషయం తెలుసుకొని హిందూపురం మండలం బాలంపల్లి తదితర గ్రామాల్లో ఇప్పటికే ఇళ్ల నిర్మాణం ఆపివేశారు. అలాంటి వారికి ఒక్క గ్రామంలోనే ఐదుగురికి జమ అయింది. మిగిలిన గ్రామాల్లో వివరాలు సేకరిస్తే, మరింత మందికి జమ అయిన విషయం బయట పడే అవకాశం ఉంది.

హిందూపురం మండలంలో 211 మందికి సొమ్ము జమ అయితే, కేవలం నలుగురు మాత్రమే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవడానికి ముందుకు వచ్చారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

జులై నాటికి పూర్తయ్యేలా చూస్తాం

– వెంకటనారాయణ, పీడీ, గృహనిర్మాణ శాఖ.

జిల్లాలో 4,788 ఇళ్ల నిర్మాణాలను జులై ఆఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకొంటాం. నేరుగా ఖాతాల్లో సొమ్ము జమ కావడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని అధిగమించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

జిల్లాలో అదనపు సొమ్ము మంజూరు వివరాలు

మొత్తం లబ్ధిదారులు: 4,788 మంది

బీసీలు: 2137

ఎస్సీలు: 1356

ఎస్టీలు: 1295

జమ అయిన సొమ్ము: రూ.10.64 కోట్లు

## శివం.. భక్తజన సుందరం



శ్రీకాళహస్తి : వైకాపా హయాంలో ఐదేళ్లు అదిగో.. ఇదిగో అంటూ కాగితాలకు.. హామీలకు పరిమితమమైన 'శివం టు శివం' రోడ్డు కూటమి ప్రభుత్వం వచ్చాక కార్యాచరణలోకి వచ్చింది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం, ట్రాఫిక్ సమస్యల నియంత్రణ ప్రధానాంశంగా గతంలో తెదేపా హయాంలోనే రోడ్డు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. వైకాపా హయాంలో పట్టిన గ్రహణం వీడి రూ.29 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి.

వైకాపా అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి అలైన్‌మెంట్ మార్చారు. తొలుత రామసేతు వంతెన నుంచి బైపాస్ వంతెన వరకు రూ.25 కోట్లతో ప్రతిపాదనలు ఉండగా.. దాన్ని గత పాలకులు అర్ధనారీశ్వరస్వామి ఆలయం వరకు పెంచారు. దీంతో నిర్మాణ వ్యయం రూ.40 కోట్లకు చేరింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి.

**కూటమి నియంత్రించిందిలా..**

కూటమి ప్రభుత్వం వచ్చాక దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఈ అంశాన్ని ఆర్‌అండ్‌బీ విభాగానికి మళ్లించారు. వారు పలు దఫాలు పరిశీలించి 2.75 కిలోమీటర్లు పొడవుతో రూ.29 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి ఆమోదం ఇచ్చారు. ఆర్‌అండ్‌బీ, ఆలయ ఉన్నతాధికారుల పరిశీలనలతో దాదాపు రూ.11 కోట్లు నిధులు మిగిలినట్లయింది. ప్రస్తుతం టెండర్ పూర్తికావడంతో పనులు ప్రారంభమయ్యాయి. సువర్ణముఖి ఆనకట్ట వద్ద మాత్రం వంతెన ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక జలవినాయకుని ఆలయం నుంచి అర్ధనారీశ్వరస్వామి ఆలయం వరకు నదికి కుడివైపున ఈ రోడ్డు నిర్మాణం జరగనుంది. ఇక్కడున్న పురాతన కాలం నాటి హస్తితీర్థం ఆనవాళ్లు దెబ్బతినకుండా పనులు నిర్వహణ చేపట్టాలంటూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించడం జరిగింది.


**ప్రయోజనాలు మెండు** సువర్ణముఖి నదిని ఆనుకుని ఏర్పాటయ్యే ఈ రోడ్డు ద్వారా శ్రీకాళహస్తి పట్టణానికి కొత్త హంగులు సంతరించుకోనున్నాయి. భక్తులు పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు పడకుండా నేరుగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరుకోవచ్చు. రోడ్డు నిర్మాణం పూర్తయితే సువర్ణముఖి మరింత సుందరంగా కన్పించే అవకాశాలున్నాయి. ఇన్ని ప్రయోజనాలున్న రోడ్డు పనులు ప్రారంభం కావడంతో పట్టణ ప్రజలతో పాటు ముక్కంటి భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మాన్యం సొమ్ము మాయం

కర్నూలు : తుగ్గలి మండలం పగిడిరాయిలో చెన్నకేశవ స్వామి మాన్యం సొమ్మును కొందరు మాయం చేశారు.. విషయం తెలిసినా దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.. ఆలయానికి సర్వే నంబరు 171లో 31.67 ఎకరాల పొలం ఉంది. ఆ భూమిని కౌలుకిచ్చి వచ్చిన ఆదాయంతో ఆలయ నిర్వహణ చేపట్టాలి. ఆ భూములు ఏళ్లుగా కొందరి ఆధీనంలోనే ఉన్నాయి. గ్రామ పరిసర ప్రాంతాల్లో బంగారం గనులున్నాయని భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు గతంలో తేల్చారు. ఈ నేపథ్యంలో బంగారం గనులు తవ్వడానికి వీలుగా 'జియో మైసూర్' సంస్థ ఆ భూమిని లీజుకు తీసుకుంది. సదరు సంస్థ ఎకరానికి ఏటా రూ.15 వేల చొప్పున లీజు చెల్లిస్తోంది. ఆ లెక్కన ఆలయానికి ఏటా రూ.4.75 లక్షల ఆదాయం రావాలి. గత పదేళ్లలో రూ.47.50 లక్షలు ఆదాయం సమకూరాలి... నేటికీ ఒక్క రూపాయి ఆలయ ఖాతాలో జమకాలేదు.

**పెద్దలు పంచేసుకొన్నారు**

సంస్థ ఇచ్చిన లీజు సొమ్మును గ్రామ పెద్దలు కొందరు కలిసి స్వాహా చేసినట్లు తెలుస్తోంది. లీజు సొమ్మును సదరు సంస్థ అధికారిక ఖాతాలో జమ చేయాలి.. ఈ విషయంపై సంస్థకు అధికారికంగా లేఖలు రాశారు. లీజు సొమ్మును ఏ ఖాతాకు చెల్లించాలో వివరాలు పొందుపరిచారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. 31.67 ఎకరాల భూములున్నా ఆలయం శిథిలావస్థలో ఉంది. చిన్న గదిలో కొనసాగుతోంది.



**అనధికారికంగా వేలంపాటలు**

జియో మైసూర్ సంస్థ తవ్వకాల్లో భాగంగా అక్కడక్కడా డ్రిల్లింగ్ చేస్తుంటారు. ఆ ప్రాంతం మినహా మిగిలిన భాగం ఖాళీగానే ఉంటుంది. మిగిలిన భూములను కొందరు అనధికార వ్యక్తులు వేలం వేశారు. ఆ ఆలయ భూములకు ఏటా రూ.1.50 లక్షల కౌలు చెల్లించేందుకు ఇద్దరు ముందుకొచ్చారు. ఆలయ భూములను అడ్డంపెట్టుకుని అనధికార వ్యక్తులు లబ్ధి పొందుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

## ఆపత్కాలం.. విద్యుత్తుతో జరభద్రం

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు, వీస్తున్న ఈదురుగాలులకు విద్యుత్తు స్తంభాలు, తీగలు, నియంత్రికలు నేల వాలుతుండటంతో తరచూ విద్యుత్తు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్తు శాఖాధికారులు సూచిస్తున్నారు. తడిసిన స్తంభాలు, స్టేవైర్లు, సపోర్టింగ్ తీగలు, ఇతర పరికరాలను తాకితే ప్రాణాపాయం కలుగుతుందని చెబుతున్నారు. ఇళ్లల్లో వేలాడుతున్న తీగల కారణంగా పైపులకు, గోడలకు విద్యుత్తు సరఫరా జరిగి మరణాలు సంభవిసున్నాయంటున్నారు. రైతులు మెలకువలు పాటించకపోవడంతో వ్యవసాయ మోటార్లు, పొలాలకు రక్షణగా ఉంచిన విద్యుత్తు తీగల్ని తాకి మూగజీవాలు పెద్దఎత్తున మృత్యువాత పడుతున్నాయి. కొద్దిపాటి జాగ్రత్తలు, మెలకువలతో ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని అవగాహన కల్పిస్తున్నారు.

**ఇవిగో సూచనలు**

వర్షాలు కురిసే సమయంలో స్తంభాలు, స్టేవైర్లు, సపోర్టింగ్ తీగలు, ఇతర విద్యుత్తు పరికరాలను చేతితో ముట్టుకోరాదు. తడిసిన, తక్కువ ఎత్తులో వేలాడుతున్న తీగలు శరీరానికి తగలకుండా జాగ్రత్త పడాలి. ఇళ్ల ముందు, ఇళ్ల పైన బట్టలు ఆరవేసేందుకు ఇనుప తీగల బదులు నైలాన్ తాళ్లను ఉపయోగించుకుంటే మంచిది. ఇళ్లలో ఐఎస్ఐ నాణ్యత గల తీగలను, పరికరాలను వాడుకుంటే మంచిది. ఇళ్లలో ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలకు ఇన్సులేషన్(పైపొర) దెబ్బతిన్నట్లు గుర్తిస్తే.. తక్షణమే వాటిని మార్చుకోవాలి. రైతులు తమ పొలాల్లోని వ్యవసాయ మోటార్లకు ఎర్తింగ్ చేయించుకుంటే మంచిది. ఒకవేళ మోటార్లు మరమ్మతులకు గురైతే నైపుణ్యం గల ఎలక్ట్రీషియన్లతో మరమ్మతులు చేయించుకోవాలి. పశువులను మేతకు తీసుకెళ్లేప్పుడు అవి నియంత్రికలు, స్తంభాల దగ్గరకు వెళ్లకుండా చూడాలి. ఈదురుగాలులకు ఎక్కడైనా స్తంభాలు, తీగలు తెగిపడి ఉంటే అటువైపు వెళ్లకుండా చూసుకోవాలి.

వ్యవసాయ మోటార్లు, స్టాటర్లను నేరుగా చేతితో ముట్టుకోవద్దు. మోటారు, ఫుట్‌వాల్వ్‌లకు సర్వీసువైర్లు తగలకుండా చూసుకోవాలి. ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజులు మార్చడం, ఏబీ స్విచ్‌లు నియంత్రించడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం. సమస్యలు ఏర్పడినప్పుడు స్థానిక లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వాలి.

ఎవరైనా, ఎక్కడైనా విద్యుదాఘాతానికి గురైతే వెంటనే అప్రమత్తమై ప్లాస్టిక్ పైపు లేదా ఎండిన కర్రతో రక్షించే ప్రయత్నం చేయాలి. చేతులతో పట్టుకోరాదు.

**అప్రమత్తత అవసరం :** ఎం.ఉమాపతి, ఎస్ఈ, విద్యుత్తుశాఖ, కర్నూలు

అకాల వర్షాలు కురిసేటప్పుడు విద్యుత్తు వినియోగదారులు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి విద్యుత్తు సమస్యలు ఉన్నా వినియోగదారులు, రైతులు సొంతంగా మరమ్మతులు చేసుకోవద్దు. ఏపీఎస్పీడీసీఎల్ వారి 1912 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారమివ్వాలి. విద్యుత్తు విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం తగదు. ముఖ్యంగా అకాల వర్షాలు కురిసినప్పుడు, ఈదురు గాలులు వీచినప్పుడు ఏమాత్రం ఏమరపాటుగా వ్యవహరించినా ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంది. ఎక్కడ విద్యుత్తు సమస్యలు తలెత్తినా సంబంధిత లైన్‌మెన్‌కు, ఏఈ, ఏడీఈలకు సమాచారమివ్వాలి. స్థానిక ఎలక్ట్రీషియన్లతో ఎల్‌సీ(లైన్ క్లియర్) తీసుకోకుండా సొంత ప్రయోగాలను ఎట్టిపరిస్థితుల్లోనూ చేయొద్దు.

## కస్తూర్బాలో సీటు.. దొరికితే అదృష్టం

కర్నూలు : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో చేరేందుకు అమ్మాయిలు పోటీ పడుతుండటంతో 'సీటు' దక్కడం కష్టంగా మారింది. నాణ్యమైన భోజనం, విద్య, స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ, స్వీయరక్షణకు పెద్దపీట వేస్తుండటంతో చేరే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిలు మెరుగైన ఫలితాలు సాధించడంతో మరింత ఆసక్తి పెరిగింది. రాష్ట్రస్థాయి సన్‌షైన్ స్టార్ పురస్కారానికి ఏడుగురు ఎంపికైతే..ఇందులో ముగ్గురు కర్నూలు జిల్లాకు చెందిన వారే కావడం విశేషం. ఆరోతరగతిలో ప్రవేశానికి సంబంధించిన సీట్ల సంఖ్యను రెట్టింపు చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఏటా మూడు వేల మంది పోటీ**

కర్నూలు జిల్లాలోని 26 కస్తూర్బాల్లో 1040 సీట్లున్నాయి. ఒక్కో దాంట్లో 40 సీట్లు అందుబాటులో ఉంటాయి. ఏటా 3 వేల మంది విద్యార్థినులు కస్తూర్బాల్లో చేరేందుకు పోటీపడుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి 3,123 దరఖాస్తులు వచ్చాయి. నంద్యాల జిల్లాలో 27 కేజీబీవీలు ఉండగా, 1080 సీట్లు ఉన్నాయి. ఇప్పటికి 2800 దరఖాస్తులు వచ్చాయి. చాలాచోట్ల రక్షణ గోడలు లేకపోవడంతో రాత్రిపూట ఆకతాయిల బెడద ఎక్కువగా ఉందని కేజీబీవీ ప్రిన్సిపాళ్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. కొన్నింటిలో మరుగుదొడ్లు, నీటి సమస్య వేధిస్తోంది. వాటిని పరిష్కరిస్తే మరింత బాగుంటుందని విద్యార్థినులు విన్నవిస్తున్నారు. సమస్యలు పరిష్కరించి విద్యార్థినులకు



నాణ్యమైన బోధన అందిస్తామని సమగ్ర శిక్షా ఏపీసీ శ్రీనివాసులు పేర్కొన్నారు.

**స్ఫూర్తి నింపిన ఇంటర్ ఫలితాలు**

కార్పొరేట్ కళాశాలలకు దీటుగా కస్తూర్బాల్లో బోధిస్తుండటంతో విద్యార్థినులు 900కు పైగా మార్కులు సాధించారు. అకౌంట్స అండ్ ట్యాక్సేషన్‌లో 17 మంది, బైపీసీలో 26 మంది, సీఈసీలో 8, ఎంఈసీలో ఒకరు, ఎంఎల్‌టీలో ఇద్దరు, ఎంపీసీలో 18, రిటైల్ మేనేజ్‌మెంట్లో ఇద్దరు అమ్మాయిలకు 900 మార్కులకు పైగా వచ్చాయి. నంద్యాల జిల్లాలో అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్‌లో 16 మంది, బైపీసీలో 17, సీఈసీలో ఒకరు, ఎంపీసీలో ముగ్గురు విద్యార్థినులు 900 పైగా మార్కులు సాధించారు. గూడూరు నుంచి ఎంపీసీ విద్యార్థిని ఉప్పరి సునీత 983 మార్కులు, ఓర్వకల్లు నుంచి బోయ హరిత 913 మార్కులు, కర్నూలు మండల పరిధిలోని పంచలింగాల నుంచి టి.మానస ఒకేషనల్‌లో 992 మార్కులు సాధించారు.

# హామీలు నెరవేర్చేలా.. కుప్పానికి కృష్ణాజలాలు

చిత్తూరు : చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఏటా కరవు కరాళ నృత్యం చేస్తోంది.. చెరువులు నిర్జీవంగా కనిపిస్తాయి.. పొలాలు బీడువారి ఆశగా ఆకాశం వైపు చూస్తుంటాయి.. పంటలు బతికించుకునేందుకు అన్నదాతలు వెయ్యి- 1,500 అడుగుల లోతు వరకు పదుల సంఖ్యలో బోర్లు వేసినా పాతాళం నుంచి గంగ పైకి వస్తుందన్న నమ్మకం లేదు.. హంద్రీ- నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు ఒక్కటే ఈ దుర్భర పరిస్థితిని తప్పించగలదని భావించి 2014- 19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం కృష్ణా జలాలను వి.కోట మండలం కృష్ణాపురం వరకు తెప్పించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హెచ్ఎన్ఎస్ఎస్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మే నెల చివరికి లేదంటే జూన్ నాటికి పనులు పూర్తి చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పట్టుదలగా ఉన్నారు.

**కూటమి ఆచరణ ఇలా..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే అంటే ఖరఫ్ నాటికి చివరి ఆయకట్టుగా ఉన్న కుప్పానికి సాగునీరు అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. చెప్పినట్టుగానే పది నెలల్లో లైనింగ్, పలుచోట్ల విస్తరణకు కలిపి రూ.650 కోట్లు ఖర్చు చేసి ఈ ప్రాజెక్టుపై చిత్తశుద్ధి చాటుకున్నారు.



**వైకాపా నాటకాలిలా..**

వైకాపా హయాంలో ఐదేళ్లలో పుంగనూరు బ్రాంచ్ కాలువ (పీబీసీ), కుప్పం బ్రాంచ్ కాలువ (కేబీసీ)కి కలిపి రూ.60 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు డ్రామాకు తెరలేపారు. కుప్పానికి నీరు అందిస్తున్నామంటూ గతేడాది ఫిబ్రవరి 26న నాటి ముఖ్యమంత్రి జగన్ అట్టహాసంగా కార్యక్రమం చేపట్టారు. ఆయన అటు వెళ్లగానే షట్టర్లు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అరకొరగా వదిలిన కృష్ణా జలాలను ఆపేసి నవ్వులపాలయ్యారు.

ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత పలుమార్లు అధికారులతో సమీక్షించారు. పనులు పూర్తయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చే 0.8 టీఎంసీల నీటితో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 110 చెరువులను నింపేందుకు సమాయత్తమవుతున్నారు. ఇందుకు దాదాపు నెల రోజులు పట్టే అవకాశం ఉంది. తద్వారా వచ్చే ఖరీఫ్‌లో 6,300 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. ఇవి జలకళ సంతరించుకున్న తర్వాత పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని చెరువులకు కృష్ణా జలాలు వదులుతారు. కేబీసీ సామర్థ్యం 216 క్యూసెక్కులు కాగా వైకాపా హయాంలో కేవలం 10- 15 క్యూసెక్కులే ప్రవహించాయి. ప్రస్తుతం 200 క్యూసెక్కులు ప్రవహించేలా పనులు చేస్తుండటం గమనార్హం.

**బోర్లు వేసే బాధ తప్పుతుంది**

గతంలో తెదేపా హయాంలో ఒకసారి మా ప్రాంతానికి కృష్ణా జలాలు వచ్చాయి. అప్పట్లో భూగర్భ జలమట్టం పెరిగింది. వైకాపా హయాంలో ఎన్నికలకు ముందు అరకొరగా వదిలారు. ప్రస్తుతం వేగంగా లైనింగ్ పనులు జరుగుతున్నాయి. వీలైనంత త్వరగా నీరు విడుదల చేస్తే లక్షలాది రూపాయలు వెచ్చించి బోర్లు వేసే బాధ తప్పుతుంది.

సుబ్రహ్మణ్యం, రైతు, రామసముద్రం గ్రామం, బైరెడ్డిపల్లె మండలం

## చేసుకోండిలా ఈకేవైసీ

చిత్తూరు : ఈకేవైసీ చేయించుకోవాలి.. లేకుంటే బియ్యం పంపిణీ నిలుపుదల చేస్తారు. ఇది రెండు నెలలుగా ఎక్కడ విన్నా వినపడుతున్న మాటలు. అయితే అసలు తాము ఈకేవైసీ చేయించుకోవాలో లేదో.. లేకపోతే ఎక్కడ చేయించుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల 30 వరకు ఉన్న గడువును ఈ నెలాఖరు వరకు పెంచారు. జిల్లాలో 1379 చౌక దుకాణాలుండగా.. అందులో 5.36 లక్షల కార్డులు, 16.70 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీటిలో ఇంకా 1.12 లక్షల మంది 8-9 శాతం మంది వరకు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఇలాంటి వారు ఆన్‌లైన్‌లో ఈకేవైసీ స్టేటస్ సొంతంగా తెలుసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

**ఆన్‌లైన్‌లో ఇలా:** గూగుల్ వెబ్ బ్రౌజర్‌లో ఈపీడీఎస్-1 అని నమోదు చేసి ఎంటర్ నొక్కాలి. అప్పుడు 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్స్యూమర్ ఎఫైర్స్ అండ్ సివిల్ సప్లయిస్ ఏపీ' అనే వెబ్‌సైటు తెరుచుకుంటుంది. దానిలో డాష్ బోర్డు ఐచ్ఛికాన్ని ఎంపిక చేసుకోవాలి. దానిలో బియ్యం కార్డు విభాగంలో ఆరు రకాల ఆప్షన్లు 'న్యూ' అనే పేరుతో కనిపిస్తాయి. ఈపీడీఎస్ అప్లికేషన్ సెర్చ్ లేదా రైస్ కార్డు సెర్చ్ అనే ఐచ్ఛికాల్లో ఒకదానిని క్లిక్ చేసి బియ్యం కార్డు నంబరు నమోదు చేస్తే అందులో ఉన్న పేర్లు వస్తాయి. ఆయా పేర్ల ఎదురుగా సక్సెస్ లేదా ఎస్ అని ఉంటే ఈకేవైసీ అయినట్లే అలా కాకుండా ఇంకా ఏమైనా ఉంటే ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంది. డీలరు లేదా ఎండీయూ వాహనం వద్ద ఈపోస్ యంత్రంలో వేలిముద్ర వేసి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్ తెలిపారు. అయిదు సంవత్సరాల లోపు, 80 ఏళ్లు పైబడినవారికి ఈకేవైసీ అవసరం లేదన్నారు. మిగిలిన వారంతా విధిగా చేసుకోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. **ఈ నెల 30 వరకే గడువు**

జిల్లాలో బియ్యం కార్డులు : 5.36 లక్షలు
సభ్యుల(యూనిట్లు) సంఖ్య : 16.70 లక్షలు
ఈకేవైసీ పూర్తికాని సభ్యులు : 1.12 లక్షలు

# గ్రాసం అందేనా..కడుపు నిండేనా?



అనంతపురం : పశుసంపదకు సరిపడా గ్రాసం దొరకడం లేదు. ఈ పరిస్థితుల్లో వచ్చే ఖరీఫ్ దాకా ఎలా నెట్టుకురావాలన్నది రైతులకు, ప్రభుత్వానికి సవాలుగా మారింది. గతంలో రైతులు ధాన్యంతోపాటు ఎండుగడ్డిని భద్రపరుచుకునేవారు. ఒక ప్రాంతంలో కొరత ఏర్పడినా సమీప ప్రాంతంలో అందుబాటులో ఉండేది. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. వెరసి పశు గ్రాస కొరతకు దారి తీస్తోంది. ఎండుగ్రాసం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

**సాంకేతికత అందుబాటలోకి..**

వరికోత యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో నూర్పిళ్లు చేయడానికి ఎక్కువ సమయం పట్టడంతో రానురాను రైతులు ఆ పద్ధతికి స్వస్తి పలికారు. తక్కువ ఖర్చు, కొద్దిపాటి సమయంలో ధాన్యం ఇంటికి చేరిపోతుందనే భావనతో వరికోత యంత్రాలపై ఆధారపడుతున్నారు. ఏ ప్రాంతంలో చూసినా 80 శాతానికిపైగా యంత్రాల సాయంతోనే కోతలు కోస్తున్నారు. యంత్రంతో కోత కోసేటప్పు ఓడు గడ్డి ముక్కలుగా అవడం వల్ల దాన్ని పొలంలోనే వదిలేస్తున్నారు. మిగిలిన 20 శాతం మాత్రమే నూర్పిళ్లు అవకాశం ఉంటోంది. దీంతో రైతుకు నామమాత్రంగానే ఎండుగడ్డి లభ్యమవుతోంది. జిల్లాలో ఈసారి తక్కువ విస్తీర్ణంలో సాగు చేయడంతో కొరత మరింత తీవ్రంగా ఉంది.

**ప్రత్యామ్నాయం..**

ఒక పశువుకు రోజుకు కనీసం 15-20 కిలోల ఎండుగడ్డి అవసరం. పచ్చిగడ్డి అయితే 20-40 కిలోలు వరకు కావాలి. వరిగడ్డిలో ఫైబర్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల అరుగుదల బాగుంటుంది. పశువుకు మేత సంతృప్తిగా తిన్న భావన కలుగుతుంది. వరిగడ్డి బండి అయితే రూ.6 వేలు, ట్రాక్టర్ అయితే రూ.12 వేలు ధర పలుకుతోంది. అయితే గడ్డికొని పశువులకు మేపలేని పరిస్థితి.

పాతరగడ్డి :- ఎండుగడ్డి కొరతను అధిగమించడానికి గతంలో సైలేజ్ (పాతరగడ్డి)ను బేళ్ల రూపంలో తయారు చేసి తెదేపా ప్రభుత్వం రాయితీతో కిలో రూ.2 చొప్పున అప్పట్లో రైతులకు సరఫరా చేసింది. మందం ఉంటే పాలిథిన్ కవరులో గాలి దూరకుండా గడ్డిచుట్టి ఉంచుతారు. దాన్ని మూడేళ్ల వరకు వాడుకోవచ్చు.

వీటితోపాటు రాయితీ గడ్డి విత్తనాలు ప్రభుత్వం ఇస్తోంది. నీటి ఆధారం ఉన్న రైతులు కొంత పొలంలో పచ్చిగడ్డి పెంచుకుంటే కొరత తీరుతుంది. 1,39,630 మెట్రిక్ టన్నులు అవసరం

ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల కాలానికి గడ్డి కొరత ఉందని గుర్తించింది. అందుకు జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించింది. జిల్లాలో మొత్తం పశువుల యూనిట్లు సంఖ్య 9,47,618 ఉన్నాయి. 1,39,630 మెట్రిక్ టన్నుల గడ్డి కొరత ఉందని గుర్తించారు. పాతరగడ్డి (సైలేజ్) 3 వేల మెట్రిక్ టన్నులు, దాణా 6 వేల మెట్రిక్ టన్నులు, గడ్డి విత్తనాలు 100 మెట్రిక్ టన్నులు, గడ్డి కత్తిరించే యంత్రాలు 300 కావాలని నివేదికలు ప్రభుత్వానికి పంపామని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వెంటస్వామి తెలిపారు.

# ఇసుక దిబ్బల్లో ఉద్యాన పంటలు



అనంతపురం : సాధారణ నేలల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తుంటారు. ఇందుకు భిన్నంగా ఇసుక దిబ్బల్లో పండిస్తున్నారు కొందరు రైతులు. ప్రభుత్వ చేయూతను అందిపుచ్చుకుని దిగుబడులు సాధిస్తున్నారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లోని దర్గాహొన్నూరు, గోవిందవాడ, మీనహళ్లి, గరుడచేడు, తుంబిగనూరు, మాల్యం, కళేకుర్తి, బొల్లనగుడ్డం, కల్‌హొళ తదితర గ్రామాల పరిధి.. వేదవతి హగరి పరివాహక ప్రాంతంలోని 4,500 ఎకరాల్లో ఇసుక దిబ్బలు విస్తరించాయి. ఇక్కడ ఖరీఫ్‌లో మాత్రం వేరుసెనగ, కంది అతికష్టం మీద పండిస్తారు. ఈ నేపథ్యంలో 2018-19లో తెదేపా ప్రభుత్వం... రెండు మండలాల్లోని ఇసుక దిబ్బల్లో ఉద్యాన పంటల సాగుకు చేయూత అందించింది. ఉపాధి హామీ పథకం కింద సపోటా, మామిడ, మునగ మొక్కలను అందజేయడంతోపాటు బోర్లను తవ్వించింది. దీంతో కొందరు రైతులు సపోటా, మామిడి...అంతర్ పంటగా మునగ సాగు చేపట్టారు. ప్రధానంగా దర్గాహొన్నూరు చెందిన రైతులు 12 ఎకరాల్లో సపోటా సాగు చేసి అధిక దిగుబడి సాదిస్తున్నారు. బోర్లకు ఆయిల్ ఇంజన్లను ఏర్పాటు చేసుకుని నీరందిస్తున్నారు. పంటను వారాంతపు సంతలకు తరలించి కిలో రూ.30 నుంచి రూ.40 వరకు అమ్ముకుంటున్నారు. ఎకరానికి 10 టన్నుల వరకు దిగుబడి రావచ్చు అంచనా వేస్తున్నారు. ఆరేళ్లు కష్టపడితే ప్రస్తుతం పంట చేతికి వస్తున్నట్లు చెబుతున్నారు.

**విద్యుత్తు సౌకర్యం కల్పించాలి** పార్వతి, దర్గాహొన్నూరు, రైతు

బోరు వేయించి... ఆయిల్ ఇంజన్ ద్వారా సపోటా మొక్కలకు నీరు అందించి కాపాడుకున్నాం. ప్రస్తుతం కోతకు వచ్చాయి. పండ్ల తోటలను పెంచే రైతులకు ఉచితంగా మోటార్లు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలి.

**మార్కెట్ సదుపాయం లేక అవస్థలు: కొత్తపల్లప్ప**

సపోటా పంటను అమ్ముకోవడానికి మార్కెట్ సదుపాయం కల్పించాలి. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటలను విక్రయించడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఇసుక నేలల్లో పంటలు సాగు చేసే రైతులకు వంద శాతం రాయితీతో బిందు, తుంపర సేద్య పరికరాలు పంపిణీ చేయాలి.

# కబ్జాలు కనిపించవా?

ధర్మవరం : ఇది ధర్మవరంలోని లక్ష్మీచెన్నకేశవపురం కాలనీలో పురపాలక రిజర్వ్ స్థలంలో ఏర్పాటు చేసిన షెడ్డు. వైకాపా నాయకుడు తన ఇంటి ముందు ఉన్న రిజర్వ్ స్థలాన్ని ఆక్రమించేశాడు. ఇక్కడ సెంటు స్థలం విలువ రూ.10 లక్షల పైమాటే. పురపాలక అధికారులకు తెలిసినా కనీసం నోటీసులు ఇచ్చేందుకు సాహసం చేయలేదు. స్థానిక వార్డు సచివాలయ ఉద్యోగి ఒకరు ఆక్రమణపై ప్రశ్నించి నోటీసు ఇవ్వడంతో ఏకంగా సచివాలయంలోకి వెళ్లి సదరు ఉద్యోగిపై ఆక్రమణదారుడు దాడి చేశాడు. అప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ధర్మవరం పట్టణంలో రూ.కోట్ల విలువ చేసే పురపాలిక రిజర్వ్ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. కబ్జాదారులు ఏకంగా నిర్మాణాలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొందరు వైకాపా నాయకులు ఎక్కడ రిజర్వ్ స్థలాలు కనిపించినా వాటిలో పాగా వేశారు. కొత్తగా ఏర్పాటైన కాలనీలను వదల్లేదు. పురపాలక శాఖకు చెందిన ఐదెకరాల రిజర్వ్ స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయి. వాటి విలువ రూ.50 కోట్లకు పైగానే ఉంటుంది. వైకాపా పాలనలో వాటిని కాపాడే యత్నం అప్పటి అధికారులు ఏమాత్రం చేయలేదు. కనీసం నోటీసులు ఇచ్చేందుకు వెనుకాడారు. నేటికీ వాటిని స్వాధీనం చేసుకునేందుకు యంత్రాంగం ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా రాజేంద్రనగర్, లక్ష్మీచెన్నకేశవపురం, ఇందిరమ్మ కాలనీ, సుందరయ్యనగర్, పోతులనాగేపల్లి కాలనీల్లో కబ్జాకు గురయ్యాయి. ఆక్రమించిన స్థలాల్లో ఇంటి నిర్మాణాలు, షెడ్లు, ఇటుకల తయారీ యూనిట్లు పెట్టారు.



**ఆక్రమణ స్థలాలను స్వాధీనం చేసుకుంటాం**

– ప్రమోద్‌కుమార్, పురపాలిక కమిషనర్, ధర్మవరం

రిజర్వ్ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. వాటిని గుర్తించి కంచె ఏర్పాటు చేయిస్తాం. అవసరమైన నిధులను కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. కబ్జాకు గురైన వాటిని స్వాధీనం చేసుకుంటాం.

# పనుల్లో వేగమే మహా'ప్రసాదం'

విశాఖపట్నం : చందనోత్సవం నిర్వహణకు సింహాచలం దేవస్థానం ముస్తాబవుతోంది. పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా. వీఐపీ, వీవీఐపీల తాకిడి అధికంగానే ఉండనుంది. ప్రత్యేక దర్శన టికెట్లకు డిమాండు ఉండొచ్చంటున్నారు. ఈ నేపథ్యంలో కొండమీద చేపడుతున్న 'ప్రసాద్' పథకం పనులు కొంత ఆటంకంగానే కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటిగా జరుగుతున్న కార్యక్రమం కావడంతో ప్రాధాన్యంగా తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా కనీసం చివరి దశలో ఉన్న పనులైనా పూర్తి చేస్తే మేలని పలువురు పేర్కొంటున్నారు. **ప్రాజెక్టు పనులతో..:** కేంద్ర పర్యాటక శాఖ నిధులు రూ.54 కోట్లతో సింహాచలం కొండ మీద, దిగువన ప్రసాద్ పథకం పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. అయితే కొన్నిచోట్ల పనులు నత్తనడకన సాగడంతో భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

గతంలో ప్రొటోకాల్ వాహనాలు, విధులకు హాజరయ్యే అధికారుల వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ కోసం వినియోగించే స్థలంలో ప్రస్తుతం వాణిజ్య దుకాణాలను తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. బస్టాండ్ వద్ద నిలిపేందుకు కూడా పూర్తిగా ఖాళీ స్థలం లేదు. కొత్తగా నిర్మిస్తున్న వాణిజ్య దుకాణ సముదాయం చివరి దశలో ఉన్నా.. ఈ నెలాఖరులోగా దాన్ని అందుబాటులోకి తీసుకురావడం అనుమానంగానే ఉంది. దీంతో పార్కింగ్ సమస్య వెంటాడుతోంది.



**క్యూలైన్ల కోసం..:** ఉచిత దర్శనాలకు గతంలో నృసింహ మండపం లోపల నుంచి క్యూలైన్లను వదిలేవారు. ప్రస్తుతం ఆ మండపాన్ని కొన్నిచోట్ల కూలగొట్టి పనులు చేపడుతుండటంతో దీని లోపల నుంచి క్యూలైన్లను పంపించడం ఈసారి కుదరదు. ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం నిర్మించిన క్యూకాంప్లెక్సు భవనాన్ని వినియోగించుకోవాలని చూస్తున్నారు. అయితే దీనికి తుది మెరుగులు దిద్దాల్సి ఉంది.

**నకిలీ పాసులతో బురిడీ..**

గతంలో కొందరు భక్తులు నకిలీ పాసులతో వచ్చినట్లు గుర్తించి గతేడాది క్యూఆర్ కోడ్‌తో పాసులను ఇచ్చారు. అలాగే కొందరు భక్తుల వద్ద టికెట్లు చించకపోవడంతో వాటినే మళ్లీమళ్లీ కొందరు వినియోగించారు. ఇటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కలప కలిపేశారు.. కలిసి దోచేశారు!

అచ్యుతాపురం : రహదారి పొడవునా ఉన్న భారీ వృక్షాలు, విలువైన చెట్లను తొలగించి, సొమ్ముచేసుకునేలా ఆ రహదారి పనుల గుత్తేదారుకే కారుచౌకగా కట్టబెట్టేశారు. వైకాపా హయాంలో ఈ రోడ్డు విస్తరణకు టెండర్లు పిలవగా అందులోనే చెట్ల కలప అంశాన్ని చేర్చి గుత్తేదారుకే మేలు చేకూర్చేలా అప్పటి నాయకులు వ్యవహరించారు. మార్కెట్‌లో కలప ధర కంటే అతితక్కువ ధరకే అప్పగించడంపై విమర్శలు వస్తున్నాయి. పనులు ఆలస్యమైనప్పుడు వాటి అంచనా విలువలు పెంచుతుంటారు. ఈ చెట్ల విషయంలో కూడా ప్రస్తుత ధరలను లెక్కగట్టి ఆ మేరకు సొమ్మును కూటమి సర్కారు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**కోల్పోయింది.. రూ.కోటి పైనే**

అనకాపల్లి జాతీయ రహదారిని అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిని (సెజ్) అనుసంధానించేలా 13.75 కిలోమీటర్ల పొడవైన రహదారిని వంద అడుగుల మేర విస్తరించనున్నారు. ఈ పనులకు 2023లో టెండర్లు పిలిచి రెండేళ్లలో రూ. 243 కోట్లతో రెండు చిన్న వంతెనలు, 47 కల్వర్టులను నిర్మించే బాధ్యతను విజయవాడకు చెందిన ఓ సంస్థకు అప్పగించారు. ఇంతవరకు బాగానే ఉన్నా రోడ్డుకు ఇరువైపులా పెరిగిన 407 భారీ వృక్షాలను తొలగించి వాటిని అమ్ముకునే అవకాశాన్ని పని ఒప్పందంలో కలిపి గుత్తేదారు సంస్థకే అప్పగించారు. అటవీశాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి వందల సంఖ్యలోని చెట్ల విలువ కేవలం రూ. 12.5 లక్షలుగానే లెక్కగట్టించారనే ఆరోపణలున్నాయి. మార్కెట్‌లో ఎందుకు పనికిరాని చెట్లు, కొమ్మల కలప టన్ను రూ. 3,500 పైనే పలుకుతుంది. ఆ లెక్కన ఒక్కో చెట్టు నుంచి కనీసం ఆరు నుంచి ఎనిమిది టన్నులు కలప దిగుబడి వచ్చినా వీటి విలువ రూ. కోటి పైనే దాటుతుందని కర్రల మిల్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ రోడ్డులో వందేళ్ల వయస్సు దాటిన వృక్షాలే అధికంగా ఉన్నాయి. వీటితోపాటు విలువైన టేకు, నల్లమద్ది, వేప, నేరేడు చెట్లు అధికంగా కనిపిస్తున్నాయి. తక్కువ ధర నిర్ణయించడం వల్ల ఆ మేరకు ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోనుంది.



**వేలం వేస్తే పోటీ పెరిగేది..**

సాధారణంగా ఏదైన రహదారి నిర్మాణంలో చెట్లను తొలగించాల్సి వస్తే ప్రత్యేకంగా వాటి కోసం బహిరంగ ప్రకటన జారీచేయాలి. తొలగించిన కలపను వేలం వేసి వచ్చిన సొమ్ము సర్కారు ఖజానాకు జమచేయాలి. అప్పుడే పోటీ పెరిగి కలప ద్వారా వచ్చే ఆదాయం పెరగడానికి అవకాశం ఉంటుంది. ఈ రోడ్డు విస్తరణ విషయంలో అవేవీ పట్టించుకోలేదు. గుత్తేదారుకు తక్కువ ధరకే అప్పగించడానికి ఆసక్తి చూపించారు నాటి ప్రభుత్వ పెద్దలు. వారి చర్యలు తెలిసినా కూటమి పెద్దలు మౌనం దాల్చడం విశేషం. **ప్రాజెక్టు త్వరగా పూర్తిచేయాలనే....**

ప్రాజెక్టును త్వరగా పూర్తిగా చేయాలనే ఉద్దేశంతోనే గుత్తేదారునికే ఈరోడ్డులో ఉన్న చెట్లును తొలగించే బాధ్యతను అప్పగించారు. అప్పట్లో అటవీశాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగానే రూ. 12.5 లక్షల ధరను నిర్ణయించారు. ఇప్పుడు ఎంతధర ఉందో తెలియదు. రాధాకృష్ణ, డీఈ, ఆర్అండ్‌బీ, ఎలమంచిలి

# తవ్వేయ్.. అమ్మేయ్.. అడిగేదెవరు..?

కార్వేటినగరం: ప్రభుత్వం మారినా గంగాధరనెల్లూరు నియోజకవర్గం లో కొందరు ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో మట్టి మాఫియా చెలరేగిపోతోంది.. పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది.. ప్రభుత్వ భూములు, అటవీ భూములు, చెరువులు, కుంటలు, కాలువల్లో ఇష్టారాజ్యంగా జేసీబీలతో మట్టి తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు.

కార్వేటినగరం మండలం విజయమాంబపురం, కార్వేటినగరం, నిశ్శంకదుర్గం, ఎల్ఆర్పేట నుంచి తమిళనాడుకు మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన స్థలాలు చదును చేయడానికి అవసరమైన మేర తరలించి లక్షల రూపాయలు దండుకుంటున్నారు. మట్టి మాఫియా కొండలు తవ్వుతుంటే.. ఆ ప్రాంతాలను కబ్జాదారులు దర్జాగా ఆక్రమించేసి పంటలు సాగు చేసుకోవడం గమనార్హం. మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో రెండు



కిలో మీటర్లకు లోపల ఉన్న భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో మట్టి మాఫియా, కబ్జాదారులు కలిసి కోట్ల రూపాయల విలువైన భూములు ఆక్రమిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఓ వ్యక్తి మట్టిని స్థిరాస్తి పనులకు తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోక పోవడం దారుణమని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. స్థానికులు ఎవరైనా మట్టి మాఫియాను ప్రశ్నిస్తే అధికారులందరికీ నగదు చెల్లించి అనుమతులు తీసుకుంటున్నామని చెబుతుండటం గమనార్హం. మండలంలో ఇంత భారీ స్థాయిలో జరుగుతున్న మట్టి తవ్వకాలపై జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**అనుమతులు లేవు..**మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. ఎవరైనా మట్టి తరలిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. కొండల్ని తవ్వితే సంబంధిత యంత్రాలు సీజ్ చేస్తాం. మండలంలో అక్కడక్కడా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వెళ్లి పనులు నిలిపేశాం. అనుమతి లేకుండా తరలిస్తే చర్యలు కఠినంగా ఉంటాయి. నాగరాజు, తహసీల్దార్, కార్వేటినగరం

# అవిశ్వాసం తీర్మానానికి రంగం సిద్ధం!

వెంకటగిరి : వెంకటగిరి పుర అధ్యక్షురాలు నక్కా భానుప్రియపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైంది. నాలుగేళ్లు పూర్తి కావడంతో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. గత ఎన్నికల్లో మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో వైకాపా కౌన్సిలర్లు గెలిచారు. వీరిలో 3, 5, 7 వార్డులకు చెందిన ప్రభావతి, నారిశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి అప్పట్లో తెదేపాలో చేరారు. మిగిలిన 22 మంది వైకాపా కౌన్సిలర్ల మధ్య సయోధ్య లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. కొంత కాలంగా పుర అధ్యక్షురాలు భానుప్రియ మేనమామ నక్కా వెంకటేశ్వర్లు తీరుపై వారు అసంతృప్తితో ఉన్నారు. వీరిని ఏకతాటిపైకి తెచ్చేందుకు పుర మాజీ అధ్యక్షురాలు దొంతు శారద వర్గం శ్రమిస్తోంది. ఓ నేత తీరుతో శారద వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. 2019లో పుర అధ్యక్షురా




లి పదవి దక్కుతుందని ఆమె భావించగా.. అప్పటి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అనూహ్యంగా నక్కా భానుప్రియను తెరపైకి తెచ్చారు. నాటి నుంచి శారద వర్గం అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో అవిశ్వాసం తీర్మానానికి సిద్ధం కావడంతో శారదకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఇచ్చారంటూ ప్రచారం సాగుతోంది.

**వైకాపాలో ముందే సందేహం**

అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఇటీవల ఓ సమావేశంలో వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని, కౌన్సిలర్లు పార్టీ మారాలనుకుంటే ఏమీ చేయలేమన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే వైకాపాలో అంతర్గత విభేదాలు బయట పడే అవకాశాలున్నాయి.

# ఎస్వీ జూపార్కులో పునుగుపిల్లుల నివాస స్థావరం

తిరుపతి : శ్రీవారి అభిషేకంలో ఉపయోగించే పునుగు తైలం కోసం శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో పెంచుతున్న పునుగు పిల్లుల నివాస స్థావరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జూపార్కులో ఇప్పటికే వాటి సంరక్షణకు ప్రత్యేకంగా భవనాలు (నాక్టనల్ హౌస్) నిర్మించారు. ఇంటీరియర్ అభివృద్ధిలో భాగంగా గుహలు, గబ్బిలాల స్థావరాలు, ప్రదర్శన బోర్డుల ఏర్పాటు, వాల్ పెయింటింగ్ వంటివాటి కోసం జూ అధికారులు పంపిన ప్రతిపాదనలకు 2024 డిసెంబరు 24 తేదీన జరిగిన సమావేశంలో తితిదే బోర్డు అంగీకారం



తెలిపింది. రూ.1.97 కోట్లతో కూడిన సదరు ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పునుగు పిల్లులను గతంలో తితిదే గోశాలలో, పూజార్ల ఇళ్లలో పెంచేవారు. అటవీ చట్టం ప్రకారం వాటి పెంపకంపై నిషేధం ఉండటంతో గతంలోనే జూపార్కుకు వాటిని తరలించారు. అప్పటి నుంచి అరకొర వసతుల మధ్య అక్కడే సంరక్షిస్తూ వస్తున్నారు. వాటి మరణాలు తగ్గించి సంతానోత్పత్తిని పెంచేందుకు కొత్తగా అత్యాధునిక సౌకర్యాలతో సముదాయాన్ని నిర్మించాల్సి ఉంటుందని జూ అధికారులు తితిదేకు వివరించారు. ఇందులో భాగంగానే సెంట్రల్ జూఅథారిటీ అనుమతులతో జూపార్కులో ఏర్పాట్లు చేయనున్నారు.

# అమరావతికి జీవీఎంసీ రాజకీయం



విశాఖపట్నం : మహా విశాఖ నగరపాలక సంస్థ రాజకీయం అమరావతికి చేరింది. వైకాపాకు చెందిన 9 మంది కార్పొరేటర్లు రాత్రి బయల్దేరి వెళ్లారు. వీరంతా తెదేపాలో చేరనున్నారు. ఇప్పటికే పన్నెండు మంది వైకాపా కార్పొరేటర్లు కూటమి చెంతకు చేరగా, మరికొందరు తాజాగా జై కొట్టనున్నారు. దీంతో తిరుగులేని ఆధిపత్యాన్ని కూటమి దక్కించుకోనుంది. అమరావతి బయలుదేరిన కార్పొరేటర్లలో చల్లా రజని, గేదెల లావణ్య, కెల్ల సునీత, భూపతిరాజు సుజాత, ముర్రు వాణితో పాటు మరో నలుగురు కార్పొరేటర్లున్నట్లు తెలిసింది. జనసేనలోకి వెళ్లడానికి మరో ముగ్గురు సిద్ధంగా ఉన్నప్పటికీ, సోమవారం వారు అమరావతి వెళ్లలేదు.

**75కు చేరిన బలం:** 98 కార్పొరేటర్ స్థానాలున్న నగరంలో...ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వంశీకృష్ణ ఎమ్మెల్యేగా ఎన్నికైన స్థానం ఖాళీగా ఉంది. గత ఎన్నికల్లో తెదేపా తరఫున 29 మంది కార్పొరేట్లు గెలిచారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వైకాపా కార్పొరేటర్లు 11 మంది నేరుగా తెదేపాలో చేరారు. జనసేనకు ముగ్గురు కార్పొరేటర్లుండగా, వైకాపా, స్వతంత్రులుగా గెలిచిన ఏడుగురు జనసేనలో చేరారు. భాజపా తరఫున ఒక కార్పొరేటర్ గెలుపొందగా, ఇటీవల వైకాపా నుంచి మరొకరు చేరారు. దీంతో కూటమి బలం 52కు చేరింది. మరో తొమ్మిది మంది కార్పొరేటర్లు తెదేపాలో చేరడానికి సిద్ధమయ్యారు. వారితో పాటు విశాఖపట్నం, అనకాపల్లిలో కూటమి తరఫున ఎమ్మెల్యేలు 8 మంది, ఇద్దరు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్సీలు గెలుపొంది జీవీఎంసీ ఎక్స్ అఫీషియోలు కావడంతో మొత్తం 109 ఓట్లకుగాను కూటమి బలం 73కు చేరింది. సీపీఐకు చెందిన స్టాలిన్, ఇటీవల వైకాపాకు రాజీనామా చేసిన మాజీ మంత్రి ముత్తంశెట్టి కుమార్తె కూటమికి మద్దతు ఇచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అవిశ్వాస ప్రక్రియ అంతా వారంలో పూర్తి చేయాలని కూటమి నాయకులు భావిస్తున్నారు. ముందుగా మేయరును ఎన్నుకున్న తరువాత ఉప మేయర్లు, ఫ్లోర్ లీడర్లను ఎంపిక చేయనున్నారు

**19న అవిశ్వాస తీర్మానం:** వైకాపా కార్పొరేటర్లు కూటమిలోకి చేరాక... ఈ నెల 19న మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. కూటమి బలం వివరాలతో జీవీఎంసీ ఇన్‌ఛార్జి కమిషనర్, కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిసి లేఖ సమర్పించనున్నారు. ఇప్పటికే మేయరుపై అవిశ్వాసం పెట్టడానికి కార్పొరేటర్ల నుంచి సంతకాలు సేకరించిన తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు.. తమ బలం ఇంకా పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. జీవీఎంసీ మేయరు పీఠాన్ని దక్కించుకోవడానికి కార్పొరేటర్లను సిద్ధం చేయాలన్న బాధ్యతలను నగర ఎమ్మెల్యేలకు తెదేపా అధిష్ఠానం అప్పగించడంతో వారు కూడా వ్యూహాత్మకంగా చర్చలు జరిపారు.

# 'రుషికొండ'లో శంఖం 'పూరించాల్సిందే!



విశాఖపట్నం : రుషికొండ బీచ్‌లో గుర్తించిన నిర్వహణ లోపంతో అంతర్జాతీయ బ్లూఫ్లాగ్ గుర్తింపును తాత్కాలికంగా కోల్పోవాల్సి వచ్చింది. వస్తున్న సందర్శకులకు అనుగుణంగా తగిన సౌకర్యాలను కల్పించకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఒడిశాలో బ్లూఫ్లాగ్ అర్హత సాధించిన పూరీ బీచ్ ఆదర్శంగా ఉంటోంది. అక్కడ అనుసరిస్తున్న కొన్ని విధానాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. ఆ తరహా నిర్వహణ మన దగ్గర చేపడితే ఆదాయం పెరగడంతో పాటు సమర్థ నిర్వహణ సాధ్యమవుతుందని నిపుణులు భావిస్తున్నారు. దేశంలో ఈ రెండు బీచ్‌లకు బ్లూఫ్లాగ్ గుర్తింపు ఒకేసారి వచ్చింది.

**అక్కడ అటవీశాఖ ఆధ్వర్యంలో...**

పూరీలో బ్లూఫ్లాగ్ బీచ్ నిర్వహణ ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అటవీశాఖ చేపడుతోంది. ఓ ప్రైవేటు ఏజెన్సీ నిర్వహణ బాధ్యత చూస్తోంది. అనధికార వ్యక్తులు రాకుండా ఆ బీచ్ చుట్టూ వెదురుతో కంచె నిర్మించారు. ఆహ్లాదకరంగా కనిపించేలా సరుగుడు చెట్లు బీచ్ మొత్తం పెంచుతున్నారు. సేద తీరే బల్లలు, పైకప్పుతో చిన్నచిన్న నిర్మాణాలను ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారు. మధ్యమధ్యలో పచ్చికబయళ్లను అభివృద్ధి చేశారు. సముద్ర ఇసుక మేటలకు సమాంతరంగా నడకదారులు నిర్మించారు. సందర్శకులు తప్ప ఇతరులెవర్నీ లోపలికి రానీయరు. మరమ్మతుకు గురైన వాటిని ఎప్పటికప్పుడు మార్చేస్తున్నారు.

బ్లూఫ్లాగ్ బీచ్‌లో ఎక్కడా దుకాణాలను ఉండనీయరు. నిర్దేశిత పార్కింగు ప్రదేశాల్లోనే వాహనాలు నిలుపుతారు.

**రుషికొండలో ..**

రుషికొండ బీచ్‌ను ఏపీ పర్యాటకాభివృద్ధి (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ బ్లూఫ్లాగ్ గుర్తింపొచ్చిన కొన్నేళ్ల పాటు సక్రమంగా నిర్వహించారు. మొదట్లో ఏపీటీడీసీ నిర్వహణ చూసింది, ఆ తర్వాత ప్రైవేటుకు అప్పగించారు, మళ్లీ ఏపీటీడీసీ చూస్తోంది. గతంలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి యంత్రం, సౌరవిద్యుత్తు వ్యవస్థ, కంట్రోల్ రూం వంటివి మూలకు చేరాయి.

దుకాణదారులు బీచ్‌కు సమీపంలోనే విక్రయాలు చేపట్టడంతో పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. బీచ్‌లోకి ఇష్టానుసారంగా వాహనాలను వదిలేస్తున్నారు.ముఖ్యంగా బ్లూఫ్లాగ్ బీచ్ అని హద్దు ఉండేలా ప్రత్యేక నియంత్రణేది ఇక్కడ లేదు. వెదురుతో ప్రత్యేకంగా నిర్మించాల్సిన అవసరముంది.

# కుట్టు ఉపాధి మెట్టు

కర్నూలు : మహిళా సంఘాల సభ్యుల సంక్షేమంపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది. వారికి జీవనోపాధి కల్పించే ఉద్దేశంతో శిక్షణ ఇవ్వడంతోపాటు కుట్టు మిషన్లు ఇవ్వాలని నిర్ణయించింది. బీసీ కార్పొరేషన్‌కు బాధ్యత అప్పగించారు.. ఒక్కో నియోజకవర్గ పరిధిలో 500 మంది చొప్పున మొత్తం 7 వేల మందికి మొదటి విడతలో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. సెంటర్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కోర్సు మొత్తం వ్యవధి 360 గంటలు. ఒక్కో మహిళ టైలరింగ్‌లో శిక్షణ పొందేందుకు ప్రభుత్వం రూ.21 వేలు ఖర్చు చేయనుంది.

**360 గంటల పాటు శిక్షణ**

ఈనెలాఖరు లేదా వచ్చే నెల నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. 45 (రోజుకు 8 గంటలు), 60 (రోజుకు 6 గంటలు), 90 రోజుల (రోజుకు 4 గంటల) పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో మహిళ 360 గంటలపాటు శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. నిత్యం ఉదయం, సాయంత్రం ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి చేశారు. 75 శాతం హాజరును ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా (ముఖ ఆధారిత హాజరు) పరిగణనలోకి తీసుకుంటారు. జిల్లా, డివిజన్ కేంద్రాలతో పాటు, మండల కేంద్రాల్లోనూ శిక్షణ తరగతులు నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఒక్కో కేంద్రం పరిధిలో తొలివిడతగా 40-50 మందిని ఎంపిక చేయనున్నారు.

**ఆన్‌లైన్‌లో స్వీకరణ**

స్వయం సహాయక సంఘాల పొదుపు మహిళలు, సాధారణ వనితలు ఎవరైనా అర్హులే. అభ్యర్థుల వయస్సు పరిమితి 18 నుంచి 50 ఏళ్ల



మధ్య ఉండాలి. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు, చరవాణి నంబరుతో సమీపంలోని సచివాలయం, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాలి. అక్కడ %https://apobmms.apcfss.in% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. బీసీ, కాపులతోపాటు అగ్రవర్ణాల్లోని పేదల కోటాలో కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ తదితరులు శిక్షణకు అర్హులు. లక్ష్యానికి మించి దరఖాస్తులు వస్తే తదుపరి దశలో శిక్షణకు వారిని పరిగణిస్తారు.

**ధ్రువీకరణ పత్రం ఇస్తారు**

శిక్షణ పూర్తయ్యాక పరీక్ష నిర్వహించి ఉచితంగా కుట్టు యంత్రాలు అందజేస్తారు. ఒక్కో కుట్టు యంత్రం విలువ రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఉంటుందని అంచనా.

శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తారు. నైపుణ్యాల స్థితిని తెలుసుకొనేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులో అధునాతన శిక్షణ కోసం.. వారికి స్పాన్సర్ చేసేందుకు అర్హులైన అభ్యర్థులను గుర్తించనున్నారు.

# వినూత్న ఆలోచనలు.. విభిన్న ఆవిష్కరణలు

శ్రీకాళహస్తి : పోటీ ప్రపంచంలో యువత ఉన్నత శిఖరాల్లో నిలవాలని నిత్యం కసరత్తు చేస్తున్నా.. ఎన్నో అవరోధాలు, వైఫల్యాలే ఎదురవుతున్నాయి. వాటిని అధిగమించేందుకు తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్) నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. న్యూఢిల్లీకి చెందిన ఏఐసీటీఈ, ఎంవోఈ సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)పై ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించడమే కాకుండా వారి ఆలోచనలు గుర్తించి వివిధ ప్రాజెక్టులను కార్యశాలను రూపొందించే దిశగా అడుగులేటస్తోంది.

**దరఖాస్తు, శిక్షణ ఎలాగంటే..**

అధ్యాపకులు, ఇంక్యుబేషన్ మేనేజర్లు, ఇన్నోవేషన్ అంబాసిడర్లు, ప్రముఖ ఇన్నోవేషన్ కౌన్సిల్స్ ఇలా.. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లు, విద్యార్థులకు మార్గదర్శకం వహించే వ్యక్తులు, వివిధ ఉత్పత్తుల రూపకల్పన, వ్యాపార వ్యూహం, సాంకేతిక అభివృద్ధి, మేధో సంపత్తి, సాంకేతిక ఆవిష్కరణల్లో నైపుణ్యం కలిగిన అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలి. కేవలం 50 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. అర్హత సాధించిన అభ్యర్థులకు ఏర్పేడు మండలంలోని తిరుపతి ఐసర్





ప్రాంగణంలో ఈ నెల 24 నుంచి 28 వరకు ప్రముఖ ఆచార్యులతో శిక్షణ కల్పిస్తారు.

**ఉచితమే**

తరగతులకు హాజరయ్యే అభ్యర్థుల ఆలోచనలకు పదును పెట్టడమే కాకుండా నూతన ఆవిష్కరణలు చేపట్టాల్సిన విధానం, నాయకత్వ లక్షణం, సంయుక్తంగా పనిచేసేలా మార్గదర్శకాలపై శిక్షణ ఇవ్వనున్నారు. వీరికి ఐసర్ ప్రాంగణంలోనే ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించారు. ప్రయాణ ఖర్చులు నిమిత్తం ఒక్కొక్కరికి రూ.వెయ్యి అందజేయనున్నారు.

**వేలాది విద్యార్థులకు అవగాహన** ఐసర్‌కి చెందిన డా.అంబారీస్ సక్సేనా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహి స్తున్నాం. అధ్యాపకులు, ఇన్నోవేషన్ అంబాసిడర్లు వంటి వారికి శిక్షణ కల్పించడంతో వారు తరగతి గదుల్లోని విద్యార్థులతో పాటు వివిధ ప్రత్యేక సభల్లోనూ అవగాహన కల్పిస్తారు. దీంతో వేలాది విద్యార్థులకు ఉపయోగకరంగా ఉత్తమ ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలు చేపట్టేం దుకు దోహదపడుతుంది. ప్రొఫెసర్ భానుశ్రీరెడ్డి. ఎఫ్‌డీపీ నిర్వాహకురాలు

# మాన్యం.. 'భూ'తాలకు నైవేద్యం

నంద్యాల : ఆలయ మాన్యాలు అక్రమార్కులకు ఆదాయ వనరులుగా మారాయి. ఆలయాల నిర్వహణ కోసం పూర్వం దాతలు సమర్పించిన భూములను కౌలు పేరుతో కొందరు కబ్జా చేశారు. దశాబ్దాలుగా తమ ఆధీనంలోనే పెట్టుకుని బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలూ తీసుకున్నారు. గత ఐదేళ్ల పాలనలో వైకాపా 'భూ'తాలు మరింత రెచ్చిపోయాయి. వందలాది ఎకరాలు కాజేశారు. ఆక్రమణకు గురైన ఆలయ మాన్యంపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది. ఎక్కడెక్కడ ఎంత ఆక్రమణకు గురైందో వివరాలు సేకరిస్తున్నారు.

ఓర్వకల్లులో పారిశ్రామిక వాడ ఏర్పాటైంది. సమీపంలోనే విమానాశ్రయం ఉంది. ఇక్కడ భూముల విలువ అమాంతం పెరిగింది. స్థిరాస్తి వ్యాపారం కూడా పెద్ద ఎత్తున జరుగుతోంది. ఇక్కడ ఎకరం భూమి విలువ రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంది.

ఖనిజ సంపదకు నిలయమైన బేతంచెర్ల మండలంలో ఎకరం రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన ఇప్పటి వరకు ఆక్రమణకు గురైన మాన్యం భూముల విలువ రూ.350 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా.

**రాజకీయ అండ.. అధికారుల సహకారం**

ప్యాపిలి మండలం రాచెర్ల గ్రామంలోని సర్వే నంబరు 32లో ఉన్న 34.49 ఎకరాల ఆలయ భూమిని కొందరు ఆక్రమించి పంచుకున్నారు. నకిలీ పాసు పుస్తకాలూ సృష్టించారు.

ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామంలో సర్వే నంబరు 66లో 17.32 ఎకరాలు ఉన్న మాన్యం భూమిని కౌలు పేరుతో ఆక్రమించారు. ఆర్ఎస్ఆర్‌లో స్పష్టంగా భూమి వివరాలు ఉన్నా.. అక్రమార్కులు ఏళ్లుగా వేలం పాటలు జరగనీయకుండా తమ ఆధీనంలోనే పెట్టుకున్నారు. వారు కౌలు చెల్లించకున్నాసరే అధికారులు పట్టించుకోవడం



లేదు. ఓర్వకల్లు, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో అక్రమాలకు గతంలో పనిచేసిన కొంతమంది రెవెన్యూ ఉద్యోగులు సహకరించారు.

బేతంచెర్లలో భూ మాయ

బేతంచెర్ల మండలంలో ఆలయ మాన్యంపై అక్రమార్కులు కన్నేశారు. బడా నాయకుల అండతో పెద్దఎత్తున ఆక్రమించారు. వాటికి రికార్డులూ పుట్టించారు. గుట్టపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన సుమారు 60 ఎకరాలను కబ్జా చేశారు. కొలుములపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయ భూమి 30 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. బుగ్గానపల్లిలో రామాలయానికి చెందిన 11.64 ఎకరాల భూమి అన్యాక్రాంతమైంది. ఇదే గ్రామంలో ఆంజనేయస్వామి కల్యాణం కోసం కేటాయించిన 20.04 ఎకరాల భూమిని కూడా అక్రమార్కులు వదల్లేదు. దీనిని కొంతమంది నాయకులు ఆక్రమించి దస్త్రాల్లో పేర్లు నమోదు చేసుకున్నారు.

**ఓర్వకల్లులో ఇష్టారాజ్యం**

పారిశ్రామిక వాడగా గుర్తించిన ఓర్వకల్లు మండలంలో ఆలయ భూములు పెద్దఎత్తున ఆక్రమణకు గురయ్యాయి. ఓర్వకల్లులోని చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన 77.92 ఎకరాలు పరాధీనమైంది. హుస్సేనాపురంలోని రామాలయ మాన్యం 36.51 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. కాల్వ గ్రామంలో సైతం రామాలయ భూమి 27 ఎకరాలు ఆక్రమణలో ఉంది. బ్రాహ్మణపల్లి గ్రామంలో 6.40 ఎకరాల రామాలయం మాన్యం పరుల సొంతమైనా పట్టించుకునే వారు కరవయ్యారు.

## అయిదేళ్లూ అసంపూర్తిగా.. వారధుల పనుల్లో కదలిక

అనకాపల్లి: బటన్ నొక్కడమే గొప్ప అని భుజాలు చరుచుకున్నారు తప్ప క్షేత్రస్థాయిలో ప్రజల బాధలు పట్టించుకోలేదు నాటి పాలకులు. చిన్నచిన్న పనులు కూడా చేయలేక చేతులెత్తేశారు. దాదాపు పూర్తయిన వంతెనలను సైతం ఐదేళ్లలో వినియోగంలోకి తేలేకపోయారు. ప్రభుత్వం మారిన తర్వాత గాని ఈ వారధుల నిర్మాణాల్లో కదలిక రాలేదు. కూటమి నేతల చొరవతో పాయకరావుపేట నియోజకవర్గంలోని రెండు ప్రధాన వంతెనలను పూర్తిచేసేలా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే తాత్కాలిక పనులతో ఒక వారధిపై రాకపోకలకు అవకాశం కల్పించారు. మరో బ్రిడ్జి పనులకు సైతం నిధులు కేటాయించి పనులకు టెండర్లు పిలిచారు. నదీ పరీవాహక గ్రామాల మధ్య రాకపోకల సమస్యకు పరిష్కారం చూపబోతున్నారు. కోటవురట్ల మండలం జల్లూరు వద్ద వరహానదిపై 2014-19లో నాబార్డు నిధులు రూ.4.5 కోట్లతో వంతెన నిర్మించారు. 90 శాతం పనులు పూర్తిచేశారు. అప్రోచ్ వేసే సమయంలో ప్రభుత్వం మారి వైకాపా అధికారంలోకి వచ్చింది. అంతే అయిదేళ్లలో 10 శాతం పనులు చేయకుండా వదిలేశారు. శిథిలావస్థలో ఉన్న పాత బ్రిడ్జిపై కోటవురట్ల, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు ప్రయాణించడానికి సాహసాలు చేయాల్సి వచ్చేది. అయిదు నెలల్లోనే వినియోగంలోకి..వైకాపా పాలనలో అయిదేళ్ల పాటు నిర్లక్ష్యం చేసిన జల్లూరు వంతెనను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అయిదు



నెలలకే వినియోగంలోకి తెచ్చింది. ఎన్నికల ముందు అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీచేసిన సి.ఎం.రమేశ్ ఈ వంతెన పూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన అన్నట్లుగానే గెలిచిన కొద్ది రోజుల్లోనే ఓ గుత్తేదారుకు ముందుగా తన డబ్బు కొంత ఇచ్చి వంతెనకు ఇరువైపులా తాత్కాలికంగా అప్రోచ్ నిర్మింపజేశారు. ఇన్నాళ్లు నిరుపయోగంగా ఉన్న జల్లూరు వంతెన వినియోగంలోకి రావడంతో వాహన రాకపోకల కు ఇబ్బందులు తీరిపోయాయి. శాశ్వత అప్రోచ్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ర.భ.శా ఎస్ఈ విద్యాసాగర్ తెలిపారు.

కోటవురట్ల మండలంలోనే వరాహ నదిపై పందూరు బ్రిడ్జి నిర్మాణాన్ని గత తెదేపా ప్రభుత్వంలోనే సుమారు రూ.9 కోట్లతో మొదలుపెట్టారు. పిల్లర్లు నిర్మాణాలన్నీ పూర్తయ్యాయి. మిగతా పనులు చేసేలోగా వైకాపా గద్దెనెక్కింది. అ తర్వాత వంతెనను పట్టించుకున్న పాపాన పోలేదు. నదిలో నీటి ప్రవాహం ఉన్న రోజుల్లో పందూరు నుంచి ఎనిమిది కి.మీ చుట్టూ తిరిగి గొట్టివాడ కూడలికి చేరుకోవాల్సి వస్తోంది. అదే బ్రిడ్జి పూర్తయితే పందూరు, బంద, ములగల్లోవ, గొట్టివాడ గ్రామస్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ సమస్యపై వరుస కథనాలు ప్రచురించి పాలకుల దృష్టికి తీసుకొచ్చింది. దీంతో ఈ వంతెన పనులకు రూ.5.5 కోట్లు కేటాయించారు. ఇటీవలే రూ.4.7 కోట్ల అంచనా విలువ పనులకు టెండర్లు పిలిచారు. త్వరలోనే ఈ పనులు కార్యరూపంలోకి రానున్నాయి. అప్పుడు.. ఇప్పుడు ఈ వారధుల ప్రాధాన్యం గుర్తించింది కూటమి నేతలే కావడం విశేషం.

## మహిళకు.. మరింత శక్తి

తిరుపతి : ఆపదలో ఉన్న బాలికలు.. లైంగిక వేధింపులకు గురయ్యే యువతులు.. కామాంధుల కోరల్లో చిక్కుకున్న మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్. మహిళా రక్షణే ప్రధాన బాధ్యతగా భావించిన ప్రభుత్వం మహిళా దినోత్సవం రోజు శక్తి యాప్ ప్రవేశపెట్టింది. యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్‌పై క్లిక్ చేసినా.. షేక్ చేసినా సమాచారం కమాండ్ కంట్రోల్‌కు చేరుతుంది. అర్బన్ పరిధిలో 6 - 7 నిమిషాలు, గ్రామీణ ప్రాంతాల్లో 10 నిమిషాల్లోనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని రక్షణ కల్పిస్తారు. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. వ్యక్తిగత వివరాలు నమోదు చేశాక ఓటీపీతో అనుసంధానం చేసుకోవాలి. కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఫోన్ నంబర్లు జోడించాలి. ఆపదలో ఉన్న మహిళలు, యువతుల రక్షణ కవచంగా శక్తి యాప్ పనిచేయనుంది.



**ఉపయోగాలు ఇలా..**

అత్యవసర సాయం.. ఆపదలో ఉన్న మహిళలు, విద్యార్థినుల సమాచారం పోలీసులకు చేరుతుంది. ఎస్‌వోఎస్ క్లిక్ అలర్ట్‌తో పోలీసులు, యాప్‌లో పొందుపరిచిన కుటుంబ, సన్నిహితుల ఫోన్ నంబర్లకు అలర్ట్ వస్తుంది. పోలీస్ కంట్రోల్ రూమ్ జియో లొకేషన్ ట్రాకింగ్ ద్వారా మహిళ ఉన్న ప్రదేశాన్ని గుర్తించి సంబంధిత పోలీసులను అప్రతమత్తం చేస్తుంది. సమాచార అవగాహన, మహిళా హక్కులు, రక్షణ, చట్టాలు, ప్రభుత్వ నిబంధనల వివరాలు తెలుసుకోవచ్చు. సమీప పోలీస్ స్టేషన్ సమాచారం, హెల్ప్‌లైన్ వివరాలు యాప్‌లో ఉంటాయి. కౌన్సెలింగ్‌కు వీలుగా మెటర్నిటీ హాస్పిటల్‌లోని వన్‌స్టాప్ సెంటర్, షెల్టర్ హోమ్స్ అందుబాటులోకి తెచ్చారు.

**ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలి**

జిల్లాలోని మహిళలు, బాలికలు, విద్యార్థినులు, ఉద్యోగినులు, గృహిణులకు శక్తి యాప్ మరింత భద్రత ఇస్తుంది. అత్యవసర సమయంలో పోలీసుల సాయం పొందవచ్చు. ప్రతిఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆపద కలిగితే వెంటనే యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే చాలు పోలీసులు తక్షణ సాయం అందిస్తారు. హర్షవర్ధన్ రాజు, ఎస్పీ, తిరుపతి జిల్లా

## ఇదేనా స్వచ్ఛ సంకల్పం ?



అనంతపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కోసం పరితపిస్తుంటే క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం సీఎం స్వచ్ఛ సంకల్పానికి తూట్లు పొడుస్తున్నారు. ఉమ్మడి అనంత జిల్లాలోని పురపాలికల్లో చెత్త సేకరణ అధ్వానంగా జరుగుతోంది. పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాల్సిన కమీషనర్లు పట్టించుకోకపోవడం, పాలక వర్గాలు బాధ్యతలను విస్మరించడంతో ఈ పరిస్థితి నెలకొందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ప్రత్యామ్నాయం పట్టదా?**

గతంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) ప్రత్యేక వాహనాల ద్వారా పారిశుధ్య నిర్వహణ చేపట్టారు. ఇందుకుగాను పుర ప్రజల నుంచి చెత్తపన్ను ముక్కుపిండి వసూలు చేశారు. అయినా వీధుల్లో అపరిశుభ్రత కనిపించేది. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం చెత్తపన్ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో గుత్తేదారులు వాహనాలను వెనక్కి తీసుకున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సిన పురపాలికలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి.

**నగరంలో నగుబాటు**

అనంతపురంలో 50 డివిజన్లకు గాను 39 వాహనాలతో చెత్త సేకరణ జరుపుతున్నారు. ఇంకా 30 ట్రాక్టర్లు అవసరమని అధికారులు చెబుతున్నారు. వీటికోసం టెండరు ప్రక్రియ పూర్తయినా క్షేత్రస్థాయిలో పనులు మొదలుకాలేదు. ప్రస్తుతం 817 మంది కార్మికులు ఉండగా.. ఇంకా 300 మంది అవసరమని గతంలోనే తీర్మానించినా అమలుకు నోచుకోలేదు. ఫలితంగా ప్రధాన ప్రాంతాల్లో రోడ్లపైనే చెత్త పేరుకుపోతోంది.

**సగానికి సగమే..**

గుంతకల్లులో కేవలం 8 వాహనాల ద్వారానే సేకరిస్తున్నారు. మరో 8 వాహనాలు అవసరమైనా ఆ దిశగా చొరవ చూపడం లేదు. మరో 100 కార్మికులు అవసరం ఉంది. సగానికి పైగా కాలనీల్లో ఇంటింటా చెత్తసేకరణ జరగడం లేదు. గుంతకల్లు పట్టణం

రాయదుర్గంలో 5 ట్రాక్టర్లు, ఒక కంపాక్టర్ ద్వారా చెత్త సేకరణ జరుగుతోంది. మరో 20 మంది కార్మికులు అవసరం. కంపోస్టు యార్డు చెత్తతో నిండిపోయి అధ్వానంగా మారింది. రాయదుర్గం

**తోపుడుబండ్లే దిక్కు..**

కళ్యాణదుర్గంలో 2 వాహనాలతోనే సేకరిస్తున్నారు. వీధుల్లో తోపుడుబండ్లతో ఇంటింటా సేకరిస్తున్నారు. మరో 6 వాహనాలు, 11 చెత్త కుండీలు అవసరం. అధికారులు ప్రతిపాదనలు పంపారు. వీధుల్లో చెత్తను కాల్చివేస్తున్నారు. కళ్యాణదుర్గం

**కమిషనర్లకు ఆదేశాలిచ్చాం..** - విశ్వనాథ్, మున్సిపల్ ఆర్డీ

చెత్త సేకరణకు అవసరమైన వాహనాలు సమకూర్చుకోవాలని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లకు ఆదేశాలిచ్చాం. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉంది. ఇంటింటా చెత్త సేకరణ నిత్యం చేపట్టాల్సిందే. అన్ని పురపాలికల్లో పరిస్థితులపై సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటాం.

## కొసరంత పండినా కొనేవారేరీ?



హిందూపురం : దిగుబడిలేక దిగాలుగా ఉన్న చింతరైతు చేతికి దక్కిన పంటను కొనేందుకు వ్యాపారులు రాక సోమవారం స్థానిక చింతపండు మార్కెట్లో ధరలు తగ్గాయి. ఈ సీజన్ ప్రారంభం నుంచి ధరలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఉగాది పండగ దగ్గర పడుతుండటంతో రైతులు సోమవారం పెద్దఎత్తున కరిపూళి, ఫ్లవర్ రకం చింతపండు తీసుకొచ్చారు. కరిపూళి రకం పండు క్వింటాల్ తక్కువగా రూ.8,200, ఎక్కువగా రూ.30 వరకు, ఫ్లవర్ రకం తక్కువగా క్వింటాల్ రూ.4,500, ఎక్కువగా రూ.12,500 వరకు ధర పలికింది. ఈ ధరలు గిట్టుబాటుగా లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ కనీసం కూలీలకు చెల్లించే డబ్బు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకొని తమకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**అధిక కూలీతో రైతుల బెంబేలు**

ప్రతి ఏటా కూలీల వ్యయం పెరుగుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్టుపై నుంచి కాయలు తొలగించేందుకు గత సంవత్సరం రూ.800 కూలీ ఉంటే రూ.850 నుంచి రూ.900లకు పెరిగిందన్నారు. పండు నుంచి విత్తనం వేరు చేసేందుకు రోజూ కూలీ రూ.250 (ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు), సిద్ధం చేసిన పండును మార్కెట్కు తీసుకొచ్చేందుకు దూరాన్ని బట్టి లగేజీ ఛార్జీలు చెల్లించాలి. ఈ వ్యయం రైతులకు భారంగా మారింది.

**కర్ణాటక నుంచి అత్యధికంగా సరకు..**

స్థానికంగా ఈ సంవత్సరం చింత ఫలసాయం తక్కువగా ఉంది. అందువ లన కొంత కాలం నుంచి ఆశించిన స్థాయిలో మార్కెట్కు చింతపండు రాలేదు. సోమవారం కర్ణాటక మధుగిరి ప్రాంతం రైతులు అత్యధికంగా చింతపండు స్థానిక మార్కెట్ కు తరలివచ్చారు. దీంతో మార్కెట్ చింతపండుతో కళకళలాడింది.

**గిట్టుబాటు ధర లభించేలా చూస్తున్నాం -చంద్రమౌళి, మార్కెట్ కార్యదర్శి**

గతం కన్నా ఈ సంవత్సరం ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. పండు నాణ్యతను బట్టి ధర లభిస్తోంది. మార్కెట్కు చింతపండు తీసుకొచ్చిన వారు ఇబ్బంది పడకుండా గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకొంటున్నాం. మార్కెట్కు వచ్చిన చింతపండు: 1991.70 క్వింటాళ్లు దక్కిన ధర (క్వింటాల్‌కు)

ఫ్లవర్: రూ.7,000

కరిపుళి: రూ.15,000

విత్తనాలతో: రూ. 3,400

## చేనేతకు వెలుగులు



ధర్మవరం : చేనేత కార్మికులకు, పవర్ లూమ్స్‌కు ఉచిత విద్యుత్తు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో ఉమ్మడి జిల్లాలోని చేనేతల్లో ఆనందం వెల్లువిరిసింది. ఎన్నికల ముందు చేనేతలకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. యువగళం పాదయాత్రలో భాగంగా ధర్మవరంలో నిర్వహించిన చేనేతల ఆత్మీయ సదస్సులోనూ మంత్రి నారా లోకేశ్ ఉచిత విద్యుత్తుపై హామీ ఇచ్చారు. ఉమ్మడి అనంత జిల్లాలో చేనేత మగ్గాలు నిర్వహిస్తున్న ఇళ్లకు ప్రతి నెలా 200 యూనిట్ల చొప్పున, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల చొప్పున ఉచితంగా ఇవ్వనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ధర్మవరం, ముదిరెడ్డిపల్లి, హిందూపురం, సోమందేపల్లి, గోరంట్ల, అనంతపురం జిల్లాలో యాడికి, తాడిపత్రి, రాయదుర్గం, ఉరవకొండ, సిండికేట్నగర్ తదితర ప్రాంతాల్లో అధికంగా ఉంటున్న చేనేతలు, మరమగ్గాల నిర్వాహకులు లబ్ధి పొందనున్నారు. ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్న నేతన్నలకు నిర్ణీత విద్యుత్తు బిల్లు నుంచి మినహాయింపు ఇస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

చేనేత మగ్గాలున్న గృహాలు: 19,500

పవర్‌లూమ్స్ : 10,000

భారం తప్పుతుంది..

- చిప్పల మార్కండేయ, చేనేత కార్మికుడు, ధర్మవరం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 నెలలకే చేనేత కార్మికుల ఇళ్ల వివరాలు అధికారులు నమోదు చేసుకున్నారు. తరువాత మా ఇంటికి వంద యూనిట్ల వరకు విద్యుత్తు బిల్లు సున్నా వస్తోంది. ప్రస్తుతం 200 యూనిట్ల అమలుకు ఆమోదం తెలపడంతో ఆర్థిక భారం తప్పనుంది.

## అనర్హులా.. లేరే!

చిత్తూరు: వైకాపా హయాంలో జగనన్న కాలనీల్లో భూ సేకరణ మొదలు స్థలాల చదును వరకు ప్రతి అంకంలోనూ అవినీతి జరిగింది. అర్హత లేకున్నా అప్పటి అధికార పార్టీ శ్రేణులకు ఇళ్ల స్థలాలు కట్టబెట్టారు. కొందరు పేదలు అనర్హులకు అమ్మేశారు. నిర్మాణానికి కేవలం రూ.1.80 లక్షలు ఇస్తామని చెప్పడమే దీనికి ప్రధాన కారణం. ఇలా ప్రతి లే అవుట్‌లోనూ 20- 30 శాతం స్థలాలు అర్హత లేని వ్యక్తుల పరమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ అంశంపై పదేపదే ఫిర్యాదులు రావడంతో జగనన్న కాలనీల్లో పట్టాలు పొందిన వారిలో అర్హులెవరు? అనర్హులెవరనేది తేల్చేందుకు సర్వే చేయాలని రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటివరకు జరిగిన పరిశీలనలో వందల్లోనే అనర్హులని తేలడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. వైకాపా హయాంలో 2020 డిసెంబరులో పేదింటి మహిళల పేరిట ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు సైతం కొందరికి స్థలాలు ఇచ్చారు. ఇలా అప్పట్లో 1,54,505 మందికి గ్రామాల్లో ఒకటిన్నర సెంటు, పట్టణాల్లో ఒక సెంటు భూమి కేటాయించారు. జిల్లాలో ఎక్కువ శాతం మందికి కొండలు, గుట్టల్లోనే పేదలకు స్థలాలు చూపారు. కొన్ని మాత్రం పంచాయతీలు, మండల కేంద్రాలు, జాతీయ రహదారులకు సమీపంలోనే ఉన్నాయి. కేవలం అధికార పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులనే ఉద్దేశంతో ఆనాడు ఒకే ఇంట్లో ఇద్దరు- ముగ్గురికి కూడా భూమి ఇచ్చారు. మరికొందరు నేతలు తమ బినామీల పేరిట స్థలాలు దక్కించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలా దాదాపు 25 శాతం మంది



అనర్హులున్నారని కూటమి ప్రభుత్వం అంచనా వేసింది. ఈ క్రమంలోనే అనర్హుల ప్లాట్లను రద్దు చేసి వాటిని అర్హులకు ఇవ్వాలనే ఉద్దేశంతో సర్వే చేయాలని స్పష్టం చేసింది.

0.13 శాతమే తప్పిదాలంటూ.. గత నెల 10న ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. 15 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని చెప్పింది. ఆర్ఐ, సర్వేయర్, వీఆర్వోలతో ఓ బృందం ఏర్పాటు చేసి సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని పేర్కొంది. ఇప్పటివరకు 1,43,668 స్థలాలను పరిశీలించగా 191 ప్లాట్లు మాత్రమే అనర్హులకు కట్టబెట్టారని అధికారులు నిర్ధారించారు. అంటే కేవలం 0.13 శాతం మందే.

**అక్కడ లేకున్నా ఇల్లు నాదేనంటూ..** అధికారులు పరిశీలనకు వచ్చిన సందర్భంలో అక్కడ ఇల్లు కట్టుకున్న, అనధికారికంగా స్థలం కొనుగోలు చేసిన వ్యక్తి.. గతంలో పట్టా పొందిన లబ్ధిదారుడిని సంప్రదిస్తున్నారు. తానే గృహం నిర్మించుకుని ఉంటున్నానని పత్రాలు చూపుతున్నారు. దీంతో ప్రస్తుతం అనుభవంలో ఉన్నది పేద వ్యక్తేనని నమోదు చేసుకుంటున్నారు. ఇలా సర్వేకు వచ్చిన వారిని బురిడీ కొట్టిస్తున్నారు. వాస్తవంగా ఆ ప్లాట్లలో అనర్హుడు ఉంటున్నాడని తెలిసినా ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో అధికారులు ఉన్నారు.

జిల్లాలో ఇళ్ల పట్టాలు పొందిన మహిళలు: 1,54,505 మంది

ఇప్పటివరకు పరిశీలించిన స్థలాలు: 1,43,668

అర్హులు: 1,41,158 మంది

అనర్హులు: 191 మంది

ఖాళీగా ఉన్న ప్లాట్లు: 2,319

ఇంకా పరిశీలించాల్సినవి: 10,837

## కాణీ లేదు.. కదలిక రాదు

తిరుపతి : స్మార్ట్‌సిటీ పథకం ప్రాజెక్టులు దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. వాటితో తిరుపతి రూపురేఖలు మారుతాయని, రూ.1,587 కోట్ల విలువైన అభివృద్ధితో నగర ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని అంతా ఆశించారు. అయితే ఐదేళ్ల వైకాపా పాలన వాటన్నింటినీ నీరుగార్చింది. కీలక ప్రాజెక్టులు అవినీతికి వేదికగా మారి చివరకు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి.

2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్మార్ట్‌సిటీ పనులు ప్రారంభించే సమయానికి స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు ఖాతాలో రూ.380 కోట్ల నిధులు జమచేశారు. వాటితోనే వైకాపా నేతలు 2022 వరకు నెట్టుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా ఎంతకూ విడుదల కాకపోవడంతో కేంద్రం సైతం నిధుల విడుదల నిలిపేసింది. రాష్ట్ర హామీ మేరకు కేంద్ర ప్రభుత్వం 2022లో మరోసారి రూ.188 కోట్లు విడుదల చేయగా.. నాటి జగన్ ప్రభుత్వం మాత్రం మరోసారి చేతులెత్తేసింది. ఐదేళ్లలో పైసా విడుదల చేయకపోయినా.. మొత్తం జగన్ ప్రభుత్వం చేసినట్లు ప్రచారం చేసుకుంటూ రూ.568 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులు వినియోగించుకున్నారు.

**విచారణ తర్వాతే పనులు?**

తిరుపతి స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ రూపొందించిన వాటిలో పలు ప్రాజెక్టుల ఊసే లేకుండా పోయింది. వినాయకసాగర్ పునరుద్ధరణకు గతంలో రూ.21 కోట్లతో ప్రతిపాదించగా.. గత ప్రభుత్వం వాటిని రూ.60 కోట్లకు పెంచింది. ఇలా స్వప్రయోజనాలకు అనుకూలంగా ఉన్నవాటికి పాలక మండలిలో ఆమోదం పొందగా వీటిపై పెద్దస్థాయిలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పటికే రూ.1,140 కోట్ల విలువైన పనులు చేసినట్లు చెబుతున్నా చాలావరకు అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో అవినీతి లెక్కలు తేల్చాలని వినతులు వస్తున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించే అవకాశం ఉంది. ఆ తర్వాతే ప్రాజెక్టులు పట్టాలెక్కే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు.

**ఆ రూ.406 కోట్లే దిక్కు**

కేంద్ర ప్రభుత్వం నుంచి ఐదో విడతగా రూ.98 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో పెండింగ్‌లో ఉంచిన 3, 4, 5 కంతులకు చెందిన రూ.308 కోట్ల పైనే అధికారులు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం స్మార్ట్‌సిటీ ఖాతా ఖాళీ కావడంతో ఎక్కడి ప్రాజెక్టులక్కడే స్తంభించాయి. నిధులొస్తే తప్ప పట్టాలెక్కే పరిస్థితి లేదు. రూ.327 కోట్ల విలువైన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, సిటీ ఆపరేషన్ సెంటర్, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టులకు ఇప్పటివరకు చెల్లించింది రూ.35 కోట్లు మాత్రమే. పూర్తిస్థాయిలో నిధులు రాబట్టగలిగితే తప్ప ఈ ప్రాజెక్టులకు మోక్షం లభించదు.

స్మార్ట్‌సిటీ పథకంలో మొత్తం ప్రాజెక్టులు: 97

పూర్తయినవి: 78, విలువ: రూ.1140 కోట్లు

అసంపూర్తి: 19, విలువ: రూ.447 కోట్లు

## మృణాల్ మినీ వైట్ డ్రెస్ లుక్ అదుర్స్

2012లో బుల్లి తెరపై ముజ్సే కుచ్ కెహ్తే...యే ఖామోషియాన్ సీరియల్‌తో సర్‌ప్రైజ్ చేసిన ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. తక్కువ సమయంలోనే బాలీవుడ్ దృష్టిని ఆకర్షించింది. హిందీ సినిమా ఇండస్ట్రీలో 2018లో ఎంట్రీ ఇచ్చింది. అంతకు ముందు అంటే 2014లో హలో నందన్ తో మరాఠీ సినిమాలో నటించింది. మరాఠీలో 2014లో మూడు సినిమాల్లో నటించింది. ఆ తర్వాత వరుసగా హిందీ సినిమాల్లో నటించింది. మరాఠీ సినిమాలో నటించిన తర్వాత దాదాపు నాలుగు ఏళ్లకు హిందీ సినిమాలో నటించే అవకాశాన్ని మృణాల్ సొంతం చేసుకుంది. బాలీవుడ్‌లో 2018 నుంచి 2021 వరకు సినిమాల్లో నటించింది. కానీ ఒక్క సినిమాతోనూ హిట్ కొట్టలేకపోయింది. బాలీవుడ్‌లో అడపా దడపా ఆఫర్లు వచ్చినా హిట్ కొట్టక పోవడంతో కెరీర్‌లో నిలదొక్కుకోవడం కష్టమే అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా ఈ అమ్మడికి టాలీవుడ్ నుంచి సీతారామం సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. తెలుగులో సీతారామం సినిమా సూపర్ హిట్ కావడంతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా మారింది. తెలుగులో ఈమె వరుసగా రెండు




విజయాలను సొంతం చేసుకోవడంతో ఆ తర్వాత ఈ అమ్మడు చేసిన సినిమాలు మంచి క్రేజ్ క్రియేట్ అయింది. ఒక వైపు సౌత్‌లో సినిమాలు చేస్తూనే మరో వైపు బాలీవుడ్‌లోనూ ఈ అమ్మడు సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ అమ్మడు రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 14 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు పలు బ్రాండ్స్‌కి అంబాసిడర్‌గా వ్యవహరించడంతో పాటు, పలు ప్రముఖ మ్యాగజైన్‌లపైనా కనిపిస్తూ వస్తుంది. తాజాగా కాస్మోపాలిటన్ ఇండియా మ్యాగజైన్ కోసం ఈ అమ్మడు కవర్ ఫోటోకు స్టిల్స్ ఇచ్చింది. వైట్ డ్రెస్‌తో విభిన్నమైన బ్యాక్‌గ్రౌండ్‌లో మృణాల్ కెమెరాకు ఫోజ్ ఇచ్చి సర్‌ప్రైజ్ చేసింది. మినీ డ్రెస్‌లో మృణాల్ ను చూస్తూ ఉంటే అలాగే చూస్తూ ఉండాలని ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా మృణాల్ మరింత అందంగా కనిపిస్తుంది అంటూ ఆమె అభిమానులు, ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు. మహారాష్ట్రలోని ధూలేలో జన్మించిన మృణాల్ ఠాకూర్ వసంత్ విహార్ స్కూల్‌లో చదివింది. చదువుకునే సమయంలోనే ఈమెకి బుల్లి తెరపై కనిపించే అవకాశం దక్కింది. గ్రాడ్యుయేషన్ చేయకుండానే కాలేజ్‌ని మధ్యలో విడిచి పెట్టింది. ప్రస్తుతం తెలుగులో ఈమె అడవి శేష్‌తో కలిసి డెకాయిట్ సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమా కోసం ఆమె ఫ్యాన్స్‌తో పాటు అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఈమె హిందీలో సన్నాఫ్ సర్దార్, పూజా మేరీ జాన్, హై జవానీ తో ఇష్క్ హెూనా హై, తుమ్ హెూ తో సినిమాల్లో నటిస్తోంది. తెలుగులో ఈమెకు మరిన్ని ఆఫర్లు వస్తున్నాయి. కానీ ప్రస్తుతం బాలీవుడ్‌పైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది.

## హీరో కన్నా ముందు హీరోయిన్ ని దించారేంటి..?

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కార్తీక్ సుబ్బరాజ్ కాంబినేషన్ లో రెట్రో అంటూ ఒక క్రేజీ ప్రాజెక్ట్ వస్తుంది. ఈ సినిమాను సూర్య తన సొంత బ్యానర్ లో నిర్మిస్తున్నాడు. ఈమధ్య సూర్య సోషల్ మెసేజ్ తో కూడిన సినిమాలు చేస్తూ వచ్చారు. అందుకే తనలోని మాస్ ని మిస్ అవుతున్న ఫ్యాన్స్ కోసం సూర్య రెట్రో చేస్తున్నాడు. కార్తీక్ సుబ్బరాజ్ కూడా ఈ సినిమాతో పెద్ద ప్లానింగ్ తో వస్తున్నాడు. కార్తీక్ సినిమాలకు తమిళ్ లో సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అందుకే రెట్రో మీద సూర్య ఫ్యాన్స్ తో పాటు ప్రతి సినీ లవర్ కొన్ని అంచనాలు పెట్టుకున్నాడు. సూర్య రెట్రో సినిమాలో బుట్ట బొమ్మ పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తుంది. ఈ సినిమాతో పూజా తిరిగి సౌత్ లో ఫాంలోకి రావాలని చూస్తుంది. ఐతే రెట్రో సినిమా పాన్ ఇండియా



రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. మే 1న ఈ సినిమా రిలీజ్ కాబోతుంది. ఐతే ఇప్పటికే రెట్రో ప్రమోషన్స్ మొదలు పెట్టారు మేకర్స్. తమిళ్ లో ఏమో కానీ తెలుగులో ఆ సినిమా హీరోయిన్ తో ప్రమోషన్స్ చేస్తున్నారు. సూర్య రెట్రో గురించి పూజా హెగ్డే వరుస ఇంటర్వ్యూస్ ఇస్తుంది. తెలుగులో రాధే శ్యామ్ తర్వాత అమ్మడు మళ్లీ ఛాన్స్ అందుకోలేదు. ఐతే తెలుగులో సినిమాలు చేయకపోయినా సరే ఆమెకు ఉన్న ఫాలోయింగ్ తెలుసు కాబట్టే రెట్రోకి ఆమెతో ప్రమోషన్స్ మొదలు పెట్టారు సూర్య అండ్ టీం. ఐతే సూర్య రెట్రో సినిమా ప్రమోషనల్ ఇంటర్వ్యూస్ లో పూజా హెగ్డే తెలుగు ఛాన్స్ ల గురించి కూడా ప్రస్తావించింది. తెలుగులో నటించాలనే కోరిక ఉన్నా ఇక్కడ నుంచి సరైన ఛాన్స్ లు రావట్లేదని అన్నది అమ్మడు. రెట్రో సినిమా తెలుగు ప్రమోషన్స్ పూజా హెగ్డే తో మొదలు పెట్టడంలో సూర్య మాస్టర్ ప్లాన్ ఏంటన్నది తెలియాల్సి ఉంది. ఐతే ఇక్కడ పూజా ఫాలోయిన్ ని క్యాష్ చేసుకునేందుకే ఆమెతో ఈ ప్రచారం మొదలు పెట్టినట్టు తెలుస్తుంది. పూజా హెగ్డే తో మొదలు పెట్టి సూర్యతో ప్రమోషన్స్ అదరగొట్టాలని చూస్తున్నారు. సూర్యకు తెలుగులో కూడా మంచి ఫ్యాన్ బేస్ ఉంది. ఆయన ప్రతి సినిమా ఇక్కడ మంచి రిలీజ్ లు అందుకుంటాయి. సూర్య రెట్రో సినిమాను తెలుగులో సితార ఎంటర్టైన్మెంట్స్ రిలీజ్ చేస్తున్నారు. అందుకే తెలుగు ప్రమోషన్స్ ని కూడా భారీ రేంజ్ లో ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. తెలుగులో పూజా రెట్రో ఇంటర్వ్యూస్ ఇవ్వడం వెనక ప్లానింగ్ కూడా సితార వాళ్లదే అని టాక్. ఏది ఏమైనా సూర్య రెట్రోతో వింటేజ్ లుక్స్ తో అదరగొడతాడని అంటున్నారు. మరి కార్తీక్ సూర్య కాంబో నిజంగా ఆశించిన రేంజ్ ఫలితాన్ని అందుకుంటుందా లేదా అన్నది చూడాలి.




## సింగిల్స్ సాంగ్ వచ్చేసింది.. శ్రీ విష్ణు స్టెప్పులు కేక!




శ్రీ విష్ణు నటిస్తున్న కొత్త సినిమా సింగిల్ నుంచి మరో పెప్పీ సాంగ్ విడుదలైంది. ఇప్పటివరకు వచ్చిన పోస్టర్స్, గ్లింప్స్ సినిమాపై మంచి క్రేజ్ క్రియేట్ చేయగా.. 'శిల్పి ఎవరో' అంటూ వచ్చిన ఫస్ట్ సాంగ్ మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఇప్పుడు మేకర్స్ రిలీజ్ చేసిన రెండో పాట 'సిరాకయింది సింగిల్ బతుకు..' అంటూ మాస్‌లో వైరల్ అవుతోంది. ట్యూన్స్ తో హైగా ఫీల్ అయ్యేలా ఉన్న ఈ పాట యూత్‌ను ఎట్రాక్ట్ చేసేలా ఉంది. ఈ సినిమాలో శ్రీ విష్ణు పూర్తి కామెడీ టచ్‌తో కనిపించబోతున్నారు. దర్శకుడు కార్తిక్ రాజు కథనాన్ని ఫన్ టోన్‌లో నడిపించగా, పాటలు కూడా అదేలా డిజైన్ చేశారు. 'సిరాకయింది సింగిల్ బతుకు..' పాటలో లైఫ్‌లో లవ్ రాక గడిపే ఓ యువకుడి ఎమోషన్‌ను సరదాగా చూపించారు. సింగిల్స్ ఫీలింగ్స్‌ను ఈ మ్యూజిక్ ట్రాక్ ఎక్కడా తక్కువ చేయకుండా, అదే సమయంలో ఓ కామెడీగా చూపించడం స్పెషల్. ఈ పాటకు విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ అందించగా, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ ఆలాపన మరింత ఎనర్జీ తీసుకొచ్చింది. శ్రీ విష్ణు స్టెప్పులు, బాడీ లాంగ్వేజ్ పాటకు పర్ఫెక్ట్ మాచ్ అయ్యాయి. రామజోగయ్య శాస్త్రి రాసిన లిరిక్స్ మాత్రం ఈ పాటకు అసలైన హైలైట్. చాలా వరకు లైన్స్ నేటి యువత మనసును తాకేలా ఉన్నాయి. సింగిల్స్ కు ఇది ఓ ఆత్మ గీతంలా మారే అవకాశముంది. పాటలోని విజువల్స్ కూడా చాలా వెరైటీగా ఉన్నాయి. అతనికి తోడు వెన్నల కిషోర్ కూడా ఉ ఒడడం మరో స్పెషల్ హైలెట్. గీతికా శర్మ, ఇవానా హీరోయిన్లుగా ఉన్న ఈ సినిమాలో ఆ ఇద్దరితో వచ్చే మోమెంట్స్ ఎలా ఉంటాయో, ఈ పాట హింట్ ఇస్తోంది. ఒక్కో లైన్‌కూ ప్రేక్షకుల నుంచి నవ్వులు రాబట్టేలా శ్రీ విష్ణు క్యారెక్టరైజేషన్ డిజైన్ చేయబడింది. ఈ పాట రిలీజ్‌తో పాటు సింగిల్ సినిమా హైప్ మళ్లీ పెరిగింది. మేలో విడుదల కానున్న ఈ మూవీకి గీతా ఆర్ట్స్ సమర్పణ ఇవ్వడం వల్ల ట్రేడ్ వర్గాల్లో మంచి బజ్ ఉంది. పూర్తి కామెడీతో మాస్ యూత్‌ను ఎంటర్‌టైన్ చేసేలా ఈ సినిమా ఫుల్ గేర్‌లో ఉంది. వరుసగా కంటెంట్ బేస్డ్ సినిమాలతో శ్రీ విష్ణు నిలబడుతున్న తరుణంలో, ఈ సినిమా మరింత వన్ మాన్ షోగా నిలుస్తుందా అనే ఆసక్తి నెలకొంది.

## విశ్వంభర టీమ్ దానిపై ఫోకస్ చేయాల్సిందే!



ఏ సినిమాకైనా బజ్, హైప్ చాలా ముఖ్యం. సినిమాపై బజ్ లేకపోతే ఆ సినిమాలో ఎంత పెద్ద స్టార్ క్యాస్ట్ నటించినా ఉపయోగం ఉండదు. ప్రస్తుతం విశ్వంభర సినిమాకు ఇంచుమించు ఇవే పరిస్థితులు ఎదురవుతున్నాయి. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న సినిమాకు చెప్పుకోదగ్గ బజ్ లేదంటే అసలు చిత్ర యూనిట్ ఏం చేస్తుందన్నది ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చిరంజీవి హీరోగా బింబిసార ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా విశ్వంభర. సోషియో ఫాంటసీ మూవీగా రూపొందుతున్న ఈ సినిమా మొదలైనప్పుడు సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. కానీ ఎప్పుడైతే సినిమా నుంచి టీజర్ వచ్చిందో అప్పుడే అసలు నెగిటివిటీ మొదలైంది. లేకపోతే విశ్వంభర ఈ పాటికే రిలీజై ఉండేది. కేవలం టీజర్ కు వచ్చిన నెగిటివిటీ వల్లే విశ్వంభర వాయిదా పడిందనేది ఒప్పుకోవాల్సిన వాస్తవం. అందుకే ఆ నెగిటివిటీని తగ్గించేందుకు చిత్ర యూనిట్ వెంటనే ఆ విఎఫ్ఎక్స్ బాధ్యతల్ని వేరే టీమ్ కు అప్పగించి మంచి అవుట్‌పుట్ ను తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. ఇదిలా ఉంటే రీసెంట్ గా విశ్వంభర నుంచి రామ రామ అనే ఫస్ట్ సింగిల్ రిలీజైంది. ఈ పాట వినడానికి బాగానే ఉన్నప్పటికీ ఆడియన్స్ లోకి వెంటనే రీచ్ అయ్యేలా ట్యూన్ క్యాచీగా, ట్రెండీగా లేదు. దీనికంటే రాములోరి మీద మొన్నా మధ్య వచ్చిన ఓ ప్రైవేట్ సాంగ్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. దాంతో పోలిస్తే కీరవాణి కంపోజ్ చేసిన ట్యూన్ సో సో గానే ఉంది. మొత్తానికి విశ్వంభర ఫస్ట్ ట్యూన్ చార్ట్ బస్టర్ కాలేకపోయింది. సో, ఇప్పటికిప్పుడు విశ్వంభరపై హైప్ పెంచాలంటే సినిమా నుంచి ఆడియన్స్ ను నెక్ట్స్ లెవెల్ లో శాటిస్‌ఫై చేసే కంటెంట్ ను మేకర్స్ వదలాలి. అది టీజర్ రూపంలోనా, పాట రూపంలోనా అనేది పక్కన పెడితే మంచి కంటెంట్ ను రిలీజ్ చేసి ఆడియన్స్ అటెన్షన్ ను ఆ దిశగా మళ్లిస్తే తప్పించి విశ్వంభరకు బజ్ పెరిగేలా లేదు. విశ్వంభర టీమ్ ఈ విషయంపై ఫోకస్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ట్రోలర్స్‌కు ఖుష్బూ... అలంటి ఇలాంటి కౌంటర్ కాదు!


ఒకప్పుడు సౌత్ లో టాప్ హీరోయిన్ గా చలామణి అయిన ఖుష్బూ.. చిరంజీవి, వెంకటేష్ లాంటి అగ్ర హీరోలతో నటించింది. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించిన ఖుష్బూ పెళ్లి చేసుకున్న తర్వాత చాలా కాలం పాటూ సినీ ఇండస్ట్రీకి దూరంగానే ఉంది. మళ్లీ ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ ను మొదలుపెట్టి తనదైన శైలిలో సత్తా చాటుతోంది ఖుష్బూ. సపోర్టింగ్ రోల్స్ చేస్తూ వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఖుష్బూ ఓ వైపు నటిగా ఉంటూనే మరోవైపు తన భర్త దర్శకత్వం వహించే సినిమాలకు నిర్మాతగా, రాజకీయ నాయకురాలిగా కూడా బాధ్యతల్ని తన సత్తా చాటుతోంది. అయితే ఒకప్పుడు బాగా బొద్దుగా ఉండే ఖుష్బూ ఇప్పుడు బరువు బాగా తగ్గి సన్నగా అయిన సంగతి తెలిసిందే. 54 ఏళ్ల వయసు లో ఖుష్బూ ఇంత భారీగా బరువు తగ్గడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. రీసెంట్ గా ఖుష్బూ బరువు తగ్గాక కొన్ని ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ బ్యాక్ టూ ఫ్యూచర్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఆ ఫోటోల్లో ఖుష్బూ గ్రీన్ కలర్ మోడ్రన్ డ్రెస్ లో ఎవరూ ఊహించనంత సన్నగా కనిపిస్తోంది. బాగా తీక్షణంగా చూస్తే కానీ ఆమె ఖుష్బూ అని



గుర్తుపట్టలేనంతగా తన లుక్ మారిపోయింది. ఖుష్బూ లుక్ ని చూసి కొందరు పాజిటివ్ గా రియాక్ట్ అవుతుంటే మరికొందరు మాత్రం ట్రోలింగ్స్ చేస్తున్నారు. ఈ వయసులో కూడా ఎంతో కష్టపడి బరువు తగ్గినందుకు ఖుష్బూని కొందరు మెచ్చుకుంటుంటే మరికొందరు మాత్రం ఖుష్బూ కష్టపడి బరువు తగ్గలేదని, సన్నగా అవడానికి ఇంజెక్షన్స్ చేయించుకుందని, వాటి వల్లే బరువు తగ్గిందని, ఆ ఇంజెక్షన్స్ మ్యాజిక్ ను కూడా ఫాలోవర్లకు చెప్పమని ఓ నెటిజన్ కామెంట్ చేయగా దానికి ఖుష్బూ రెస్పాండ్ అయింది. అసలు మీరెలాంటి మనుషులు? మీ ముఖాలను మీరెప్పుడూ చూపించరు. ఎందుకంటే మీరంత అసహ్యంగా ఉంటారు కాబట్టి. మీ తల్లిదండ్రులను చూస్తుంటే చాలా జాలేస్తుంది అంటూ ఖుష్బూ రిప్లై ఇచ్చింది. ఖుష్బూ షేర్ చేసిన ఫోటోలతో పాటూ ఆమె నెటిజన్ కు కౌంటర్ ఇస్తూ చేసిన ట్వీట్ కూడా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## చీర కట్టులో అందాల రాశి

'ఊహలు గుసగుసలాడే' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయం అయిన రాశి ఖన్నా తక్కువ సమయంలోనే పలువురు యంగ్ హీరోలకు జోడీగా నటించింది. కెరీర్ ఆరంభంలో కాస్త బరువు ఎక్కువగా అనిపించిన రాశి ఖన్నా తెలుగు ప్రేక్షకుల కోసం, టాలీవుడ్‌లో ఎక్కువ సినిమాల్లో నటించే అవకాశం కోసం రాశి ఖన్నా బరువు తగ్గింది. బరువు తగ్గిన తర్వాత రాశి ఖన్నా పేరుకు తగ్గట్టు మరింత అందంగా ఉందని అభిమానులు కామెంట్స్ చేశారు. సోషల్ మీడియాలో రాశి ఖన్నా గురించి రెగ్యులర్‌గా ప్రచారం జరిగేలా ఆమె అందం ఉంటుంది అనడంలో సందేహం లేదు. ఈమధ్య కాలంలో తెలుగులో కాస్త ఆఫర్లు తగ్గడంతో తమిళ్‌లో ఈ అమ్మడు బిజీ అయ్యే ప్రయత్నాలు చేసింది. లక్కీగా ఈమధ్య తమిళ్, హిందీలో వరుసగా ఆఫర్లు దక్కుతున్నాయి. తెలుగులో ఈమె చివరగా థాంక్యూ



లో నాగ చైతన్యతో కలిసి కనిపించింది. ఆ తర్వాత రాశి ఖన్నా తెలుగు వెండి తెరపై కనిపించలేదు. కానీ హిందీ, తమిళ్‌లో మాత్రం చాలానే సినిమాల్లో నటించింది. ప్రస్తుతం తెలుగులో తెలుసు కదా అనే సినిమాలో నటిస్తుంది. ఆ సినిమాతో రాశి ఖన్నా మళ్లీ టాలీవుడ్‌లో బిజీ కావాలని అభిమానులు కోరుకుంటున్నారు. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను ఈ అమ్మడు షేర్ చేయడం మనం చూస్తూనే ఉంటాం. తాజాగా మరోసారి రాశి ఖన్నా తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి చీర కట్టు అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. గ్రీన్ కలర్ చీరలో స్లీవ్‌లెస్ బ్లౌజ్ ధరించి నడుము అందం చూపిస్తూ కన్నుల విందు చేసింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు దాటినా, వయసు మూడు పదులకు చేరిన రాశి ఖన్నా మాత్రం ఇంకా 20 ఏళ్ల పడుచు అమ్మాయి మాదిరిగా చాలా అందంగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో రాశి ఖన్నా అందమైన చీర కట్టు ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఇంతటి అందంకు టాలీవుడ్‌లో ఆఫర్లు దక్కక పోవడం విడ్డూరంగా ఉందని కామెంట్స్ వస్తున్నాయి. రాశి ఖన్నా ప్రస్తుతం చేస్తున్న సినిమాల విషయానికి వస్తే హిందీలో ఒక సినిమాకు కమిట్ అయింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536